16-6-67




Roopkala
కె. విజయకుమార్ సమర్పించు
శ్రీ విజయలక్ష్మీ పిక్చర్స్ వారి
సరస్వతీ శపథం
(ఈస్ట్ మన్ కలర్)
దర్శకత్వం
ఏ.పి.నాగరాజన్
సంగీతం
కె.వి.మహాదేవన్
ఆంధ్ర: మహాలక్ష్మీ, నైజాం: జగత్, సీడెడ్: శ్రీ శైవ
VANIE PUBLICITIES

ఉత్తరాలు

వ్యాసాలు

2—6—67 సంచికలో శ్రీమతి భవనం జయప్రదగార్ని కూర్చి వ్రాసిన వ్యాసం చదివాను. మా స్వస్థలం నుండి శాసనసభకు ఎన్నుకోబడిన శ్రీమతి జయప్రదగారి ఉన్నత విద్యార్హతలు, రాజకీయానుభవములు సదరు వ్యాసం ద్వారా మొదటి సారిగా తెలుసుకొని చాలా ఆనందించాను. ఆమె నాయకత్వం క్రింద వెనుకబడి వున్న మా వినుకొండ తాలూకా అంతో— ఇంతో పైకి రాగలదన్న నమ్మకము ఇప్పుడు దృఢంగా కలుగుతున్నది.

పోతే వినుకొండ ఆంధ్రదేశపు 'లెనిన్‌గ్రాడ్'గ వినుతి కెక్కి వున్నట్లుగా ఆ వ్యాసంలో రచయిత పేర్కొన్నారు. అది యేమాత్రం సరికాదు అక్కడ జరిగిన నాలుగు జనరల్ ఎన్నికలలో రెండ పర్యాయములు కమ్యూనిస్టులు గెలుపొందగా మరి రెండు పర్యాయములు కాంగ్రెస్ గెలుపొందింది పోతే ఈ పర్యాయము శ్రీమతి జయప్రదగారు సాధించిన మెజారిటీతో చూస్తే, కమ్యూనిస్టులు సాధించిన మెజారిటీ చాలా స్వల్పం. కనుక రచయిత పేర్కొన్నట్లు వినుకొండ లెనిన్‌గ్రాడూ కాదు, స్టాలిన్ గ్రాడూ కాదు, కనీసం సూపో గ్రాడు కూడా కాదు. ఐతే 'లెనిన్‌గ్రాడ్' అని వినుకొండకు బిరుదు ప్రదానం చేయడం ద్వారా, తాము ప్రచారంలోకి రావాలని రచయిత అభిప్రాయపడ్డారేమో ననిపిస్తున్నది. ఏమైనా శ్రీమతి జయప్రదగార్ని గూర్చిన ముఖ్య విషయాలను, ఆయన ముచ్చటగా పేర్కొన్నారు.

పోతే 'అధ్యక్షుని మరణం' అన్న వ్యాసం వారన్ కమిషన్ వారి నివేదిక నుండి వ్రాసి వుంటే ఇంకా బాగుండేదని నే నభిప్రాయపడుతున్నాను. ఎందువల్లనంటే వారన్ కమిషన్ అమెరికా ప్రభుత్వంచే ఏర్పాటై, ప్రభుత్వ— ప్రయివేట్ వ్యవస్థల నుండి సంపూర్ణ సహకారం పొంది, అన్ని విషయాలూ క్షుణ్ణంగా పరిశీలించి, ఆ పైన తమ నివేదికను విడుదల చేసింది. కానీ విలియం మాంచెస్టర్ రచననే ఎందుకు ఎన్నిక చేశారో బోధపడటం లేదు.

పాటిబండ్ల వెంకటకృష్ణ ప్రసాద్ (హైదరాబాద్)

*   *   *

5—5—67 వ తేదీ వారపత్రికలో శ్రీమతి జమునారమణరావు పారిస్‌లోకి "వీసా"లేకుండా వెళ్లలేక పోయిన విషయము చదివిన తరువాత నా అనుభవంకూడా పాఠకులకు తెలియజేయాలని పించింది. నేను ఫిబ్రవరిలో జపానునుండి మనదేశానికి తిరిగివచ్చే దారిలో బాంగ్‌కాక్, సింగపూరు, కొలంబో చూడాలని నిశ్చయించుకుని అన్ని ఏర్పాటులు చేసుకున్నాను. సిలోన్ చూడాలంటే వీసా అవుసరం ఉండ వచ్చుని ఎవరో చూచాయగా చెప్పడం వలన, ఎయిర్ ఇండియాలోను, భారతరాయబారకార్యాలయంలోను వాకబు చేశాను. రెండుచోట్లా, వీసా అక్కరలేదని తెలియజేశారు. అయినాఎందుకయినా మంచిదని సిలోన్ రాయబార కార్యాలయానికి టెలిఫోను చేస్తే వారు కూడ అలాగే తెలియచేశారు. కాని, కొలంబోలో విమానం దిగగానే వీసా లేనిదే వూరిలో అడుగు పెట్టడానికి వీలులేదని, బొంబాయివెళ్తున్న అదే విమానంలోఎక్కించి మర్నాడు మదరాసు వెళ్లవలసిన నన్ను బొంబాయి పంపేశారు. (కొలంబోలో రెండు విమానాశ్రయాలున్నాయి. ఒకటి విదేశ యానాలకు, రెండవది స్థానిక యానాలకు, భారత దేశయానాలకు. ఒక దానినుండి యింకొక దానికి వెళ్లాలంటే కూడా వీసా కావాలట!) ఆరోజు బొంబాయిలో గడిపి మరునాడుదయం మదరాసు చేరాను.

ఈవిషయం టోక్యోలో భారతరాయబారకార్యాలయానికి తగు చర్య తీసుకోవలెనని వ్రాసి రెండున్నర నెలలయినది ఇంతవరకు తెలియచేసిన ఉత్తరము అందినట్లుకూడా తెలియచేయలేదు. భారతీయులకు సమాచారం యివ్వడం విషయంలో ఎయిర్ ఇండియా గురించిగాని, మన రాయబార కార్యాలయాల గురించి కాని ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ఇంతకూ మనరాయబార కార్యాలయం కంటే అన్యాయంగా ఉన్న రాయబార కార్యాలయం ఉందనే సంతృప్తి మాత్రం కలిగినది.

కె. శివప్రసాద్‌గుప్త (పాలంచ)

సీరియల్

విలియం మాంచెస్టర్ రచన "అధ్యక్షుని మరణం" (ది డెత్ ఆఫ్ ఎ ప్రెసిడెంట్) ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించడం చాలా సంతోషము కలిగిస్తోంది కాని విలియం మాంచెస్టర్ రచనను యధాతథంగా ప్రచురిస్తున్నారో లేక జాక్విలిన్ కెన్నడి అభ్యంతరం చూపిన సన్నివేశాలు, భాగాలు వదిలివేసి మిగిలిన భాగాలను మాత్రమే ప్రచురిస్తున్నారో తెలుసుకోవాలనుంది. ఏమైన ప్పటికీ చిరకాలంగా చదవాలను కొంటున్న మాంచెస్టర్ రచనను ఆంధ్రసచిత్ర వారపత్రిక ద్వారా పాఠకులకు అందచేయడం ఆనందదాయకం

మరొక విషయం. 'చిత్రసమీక్ష' శీర్షిక కింద మీరు ప్రతి తెలుగు చిత్రాన్ని ఉత్తమ చిత్రమనో, మహత్తర చిత్రమనో పేర్కొనడం పరిపాటి అయింది. కాని ప్రేక్షకులు, పాఠకులు మీసమీక్షతో ఏకీభవించడం చాలా దుర్లభం.

కొంపెల్ల వేదవతి శివసుబ్రహ్మణ్యం (వాల్తేరు)

ఫిలిం బాలత్

19—5—67 తేది పత్రికలో మీరు ప్రచురించిన కథలు "నీడలేని పందిరి', 'నిప్పు', 'అనూ' మూడూ మూడు ఆణిముత్యాల లాంటివి. రచయితలకు నా అభినందనలు తెలుపగలరు. ఉత్తరాలు శీర్షికలో సర్వసిద్ధి చిరంజీవిగారు రామారావును ఏచిత్రములో ఎన్నిక చేశారు? అని ప్రశ్నించారు. కాని ఆ ఎన్నిక పత్రికవారు చేసినది కాదని, ఆంధ్రప్రేక్షకులని తెలియదు కాబోలు.'

"శ్రీకృష్ణ పాండవీయం" పరస్పర విరుద్ధమైన పాత్రలు ధరించి తన అమోఘ నటనతో చరిత్ర సృష్టించిన రామారావుగారు ఉత్తమ నటునిగా ఎన్నికవడం శోచనీయమైన విషయం కానేకాదు.

ఈవిషయం సుండూరు కోటయ్యగారు (అనంతపురం) సర్వసిద్ధి చిరంజీవిగారు (విశాఖ) గుర్తించ గలరు. యు. మురళీధరరావు (బెంగుళూరు)



తెలుగుసినిమా
చరిత్రలో ఇది
'సాక్షి' నామ సంవత్సరం
నిర్మాతలు
సురేష్ కుమార్
శేషగిరిరావు
కెమెరా సెల్వరాజ్
సంగీతం. కె.వి.మహదేవన్
శ్రీ సారథీ స్టుడియోస్
శ్రీ ఫిలింస్ విడుదల
నందనా ఫిలింస్
రచన ముళ్లపూడి వెంకటరమణ • దర్శకుడు బాపు

చిత్రలహరి

26-5-67 పత్రిక ముఖచిత్రము (గౌతమ బుద్ధుడు) ఎంతో ఆకర్షణీయముగా ఉన్నది. గని సెట్టిగార్కి మా అభివందనములు. సినిమాతారల ముఖ చిత్రాలచే విసుగు చెందిన మాకు ఈవారం ముఖచిత్రంచే ఆనందింప జేసారు. ముఖ్యముగా తెలియ జేయునది:—

'చిత్రలహరి'లో 58, 60 పేజీలలో వేసిన చిత్రాలు ఎంతో అసహ్యకరంగా వున్నవి. చూపరులకు వెంటనే చలన చిత్రాల మీద జుగుప్స కల్గుతుంది. అని ఘంటాపథంగా జెప్పవచ్చు.

మన చలన చిత్ర పరిశ్రమ రోజు రోజుకు ఇంతగా దిగజారిపోతున్నందుకు మనము ఎంతోయో సిగ్గుపడవలసి యున్నది. మన పత్రికలో చిత్రలహరి, చిత్రసమీక్ష ఉన్నదే ముచ్చటగా మూడు పేజీలు. అందులో ఇలాంటి చిత్రములు మన పత్రికలో వేయరని విశ్వసించి వ్రాయుచున్నాము. ఆంధ్రదేశ ప్రభుత్వము చలన చిత్రాలను ప్రోత్సహించేందుకు అన్ని రాష్ట్రాలకన్నా ముందంజ వేసినదని, చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వము గైకొన్న చర్యలు అందరికి తెలిసిన విషయమే. మరియు తెలుగు చిత్రాలలో ఉత్తమమైన వాటికి ప్రభుత్వము ఏటేటా అవార్డులు కూడా ఇస్తున్నది. అయినను చూపరులకు జుగుప్స కల్గించే డాన్సులను ఎందుకు చిత్రాలలో ఇరికించుదురో? సెన్సారువారు ఎలా సెన్సారు చేస్తారో అవగాహన అవుట లేదు. ఏది ఏలాగున్నను వార పత్రికలో ముమ్ముందు ఇలాంటి అసహ్యకరమైన చిత్రాలను వేయరని విశ్వసించుచున్నాము. పాఠకులు మా అభిప్రాయంతో ఏకీభవించుదురని నమ్ముచున్నాము

యన్. డేనియల్‌రాజు (నాగపూర్)

ఉత్తరాలు

న్యూఢిల్లీ లేఖ


19—5—67 సంచిక న్యూఢిల్లీ లేఖలో శ్రీకృష్ణగారు భాషా సమస్యను గురించి అర్థరహితముగ విమర్శించినారు. భారతదేశ విభజనకు హిందీ ప్రాంతీయులు కారకులనడము ఏమంత సమంజసముగ లేదు. హిందీ ప్రాంతీయులు భారతదేశాన్ని విభజించడానికి వెనుకాడరను వారి అభిప్రాయము కేవలము హాస్యాస్పదముగ యున్నది. ఇంకా దక్షిణానే మద్రాస్ రాష్ట్రములో ఒక పక్షమువారు తమకు తమిళనాడు ప్రత్యేకముగా కావలసనెడి ఆశయము కలిగియున్నారు. దక్షిణమున దిన దినానికీ ఆంగ్లమునకు ప్రాధాన్యత అధికమవుతున్నదేగానీ, తగ్గడములేదు. పాశ్చాత్యసభ్యత వేషధారణలు రోజు రోజుకూ జాస్తి అగుచున్నది. కావున దక్షిణాన హిందీభాషా వ్యాప్తి జరిగే అవకాశము లేదు. ఇంగ్లీషు ప్రాధాన్యత తగ్గుతుందేమో అని శ్రీ కృష్ణగారు దిగులు చెందనవసరములేదు.

జనసంఘమువారు ఢిల్లీలో ప్రజలను హిందీలో మాట్లాడమని నిర్బంధించలేదు.

బొంబాయిలో శివసేనను గురించి విమర్శించారు. బాగానేవుంది. మద్రాస్‌లో కూడ తమిళులుగాక అన్యులకు ఎంత ఆదరణ లభిస్తుండేది అందరికీ తెలిసిన విషయము.

మొత్తముమీద శ్రీ కృష్ణగారు ఈ లేఖను కేవలము హిందీభాష వ్యతిరేకోన్మాదముతో, ఆక్రోశపూరితులై వ్రాసినట్లుగ కనపడుచున్నది. ఇటువంటి వ్యాసాలు వ్రాసినందులకు సమస్యలు పరిష్కారము కాకపోగా వైమనస్యాలు, కలహాలు సంభవిస్తవి. వారి పక్షపాత ధోరణిని చక్కగా వ్యక్తపరచుకొన్నారు. నిష్పక్షపాతముగ విమర్శలు చేయవలసినదిగా శ్రీకృష్ణగారిని కోరుచున్నాను.

పి. రామయ్య (నెల్లూరు)



ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 16—6—'67
ప్లవంగనామ సం॥ జ్యేష్ఠమాసం శుద్ధ నవమి

సంపుటము : 59 సంచిక : 40

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	22.40
6 మాసముల చందా	11.20
3 మాసముల చందా	5.60

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	42.00
అర్ధసంవత్సర చందా	21.00

విషయానుక్రమణిక




అధ్యక్షుని మరణం

విలియం మాంచెస్టర్

3

నగరం ఎదురుకుండా మెరిసిపోతోంది. చదును ప్రదేశం మీద కట్టడాలు ఎత్తుగా కనిపిస్తున్నాయి. మెక్‌హ్యూగ్ దురదృష్టం! శాన్‌ఆంతోనియోలో కావలసినంత ఎండ! కింద శాన్‌ఆంతోనియో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో శ్రీ లిండన్ జాన్సన్ అప్పుడే క్షవరశాలలో నుంచి వచ్చి, విమానాశ్రయానికి వచ్చిన వారిని వరసలు వరసలుగా సద్దుతున్నారు. సాధారణంగా ఆయన భార్య ఇటువంటి సమయాలలో ఆయనకి సాయంచేస్తూ ఉంటుంది కాని గుంపులో హటాత్తుగా తనతో చదువుకున్న పాత స్నేహితురాలు కనిపించటంతో ఆమెతో పాటు కబుర్లు చెప్తూ వేరే ఉండిపోయింది. పనంతా భర్తకే వదిలి వేసింది. పనికేమీ తక్కువ లేదు గాని శ్రీ జాన్సన్ ఇటువంటి వ్యవహారాలలో చాలా అనుభవం కల వ్యక్తి. ఎవరిని ఎలా పలకరించి, ఎక్కడ నుంచోపెట్టాలో బాగా తెలుసు. అప్పటికే విమానాలు కొన్ని దిగుతున్నాయి. ఆహ్వాన సంఘం సిద్ధంగా ఉంది.

'అదుగో!' అని అరిచాడు ఒకతను. ఎయిర్‌ఫోర్స్ — 1 విమానం అప్పుడే అందంగా దిగి వేగంగా విమానాశ్రయం భవనం వయిపుకి వస్తుంది. 'జాకీ!' అని కేక వేసింది ఒక స్త్రీ. 'జాకీ! జాకీ!' అని అరవడం ప్రారంభించారు గుంపులోని వారంతా. విమానం వద్దకి మెట్లనిచ్చెన తీసుకు వెళ్లారు. తలుపు తెరుచుకుంది. అధ్యక్షుని సతీమణి బయటికి వచ్చింది. ఆమె ముఖం మీద సిగ్గుతో కూడిన చిరునవ్వు వెలిసింది, ఎప్పటిలాగే. తర్వాత కోటు గుంజీ సవరించుకుంటూ 'హాకిల్లా' వచ్చాడు. పెద్ద కోలాహలం. మూడవ మనిషి రాల్ఫ్ యార్బరో అయి ఉండవలసిందికాని, ఆ ఊర్లో హెన్రీగొంజాలెస్‌కి మంచి పేరు ఉందని తెలుసు కాబట్టి యార్బరో అతన్నే ముందుకి తోశాడు. ఇక కింద గుంపు హడావుడికి అంతులేదు! మేయర్‌తో కలచాలనం చేసి కెన్నెడీ భార్యతోబాటు గుంపులో కలిశాడు!



యు. ఎస్. ఎయిర్‌ఫోర్స్ నెం 1 విమానం భాగాలుచూపే బొమ్మ

ఇంతలో బయట మోటారుకారు ఊరేగింపు సన్నాహాలు చురుకుగా జరుగుతున్నాయి. ఓ'డానెల్ సాధారణంగా మంచి రోరిపాలకు'డుగా పేరు సంపాదించుకున్నాడు. కాని ఇక్కడ అతనిమాట వినేవారే లేరు. యార్బరోని ఏకారులో కూచోపెట్టాలో చెప్పలేకపోయాడు. కొందరు స్థానిక రాజకీయ నాయకులు యార్బరోతో, 'జాన్సన్‌వెళ్లే కార్లో వెళ్లకండి! అయినా, కానల్లీ మీమీద పన్నుతున్న కుట్ర గురించి మీకుమాత్రం తెలీదా!' అన్నారు. అయినా, యార్బరో స్థానం నిర్ధారణ కాలేదు. ఇక కార్లు బయలుదేరపోతాయనగా రూఫస్ యంగ్ బ్లడ్ అనే రహస్య రక్షకదళం భటుడువచ్చి, 'సెనేటర్, మీరు వయిస్ ప్రెసిడెంట్ కార్లో వెళ్లాలి,' అన్నాడు.

యార్బరో అతనిని పట్టించుకోకుండా అక్కడినుంచివెళ్లి నేరుగా గొంజాలెస్‌ని సమీపించి, 'హెన్రీ నన్ను నీతో తీసుకుపో!' అన్నాడు.

గొంజాలెస్ చాలా సంతోషించాడు. యార్బరో విమానంలో కానల్లీ గురించి చెప్పినదీ, ఇప్పుడు చూపించిన నిర్లక్ష్యం అక్కడి విలేఖరులు గమనించారు. ఇది జాన్సన్‌కి చిన్నతనం అని అనుకున్నారు. కానల్లీ ఎలాగూ దర్జాగా అధ్యక్షుడు లింకన్‌లో కూర్చుని ఉన్నాడు?

కెన్నెడీ పేరు చెప్తే ప్రజలు తండోపతండాలుగా వస్తారన్నది కట్టుకథ కాదన్న సంగతి ఆరోజు రుజువుఅయింది. దారి వెంబడే 125,000 మందికి పయిగా తమ అధ్యక్షుడినీ, ఆయన భార్యనీ చూడటానికి వచ్చారు. దట్టంగా మునురుకునిఉన్న తలల మీద ఆహ్వానం తెలిపే అట్టలు ఊగుతున్నాయి. 'జె. ఎఫ్. కె. కి సుస్వాగతం', 'జాకీ మా రాష్ట్రంలో వాటర్ స్కీయింగ్ చెయ్యాలి!' వంటివి ఆహ్వాన సంఘంవారు తయారుచేయించినవి కావని లేడీ బర్డ్ జాన్సన్ కూడా అన్నది.

బ్రూక్స్ మెడికల్ సెంటర్‌వద్ద కోలాహలం ఇంతా అంతాకాదు. కెన్నెడీ ఉపన్యాసం వినిపించకపోయినా అందరూ విశేషంగా అరిచి తమ ఆమోదాన్ని తెలిపారు!

శాన్ ఆంతోనియో మజిలీ పూర్తి అయింది. మధ్యాహ్నం 3.48కి కెన్నెడీ దంపతులు తిరిగి తమ విమానం ఎక్కారు. ఇద్దరూ అలిసిపోయిఉన్నారు. చమటకి తడిసిపోయారు. ఇటువంటి ప్రయాణంతో కూడుకునిఉన్న ప్రయాస అప్పుడే ప్రారంభం అయిందివారికి. ఇద్దరూ నిద్రకి ఉపక్రమించారు. వారు కలిసి జీవించటం అనేది మరొకరోజు మాత్రమే. కాని, ప్రశాంతంగా కలిసి గడపగలిగిన చివరిగంట ఒకటే మిగి

లింది. 45 నిముషాలలో 'హూస్టన్' చేరుకున్నారు.

కొత్త చొక్కా వేసుకుని బయటికివచ్చిన అధ్యక్షుడు శాసనసభ్యుడు ఆల్బర్ట్ థామస్‌ని పిలిచాడు. అతను, 'మా నియోజకవర్గంవారు మీకు శాన్ అంతోనియో కన్నా బాగా స్వాగతం ఇస్తారు!' అన్నాడు.

'చూద్దాము,' అని జవాబు ఇచ్చాడు కెన్నెడీ.

అక్కడా పెద్ద స్వాగతమే దొరికింది! జాక్వెలీన్ కెన్నెడీకి మూడుడజన్ల పసుపు రంగు గులాబీలు (టెక్సాస్ చిహ్నాలవంటివి ఇవి) సమర్పించారు అక్కడికి వచ్చినవారు. విమానాశ్రయం గేటువద్ద 8000 మంది జాకీ పేరు అరుస్తూ, చెమటలు కక్కుతున్నా లెక్కచెయ్యకుండా, నుంచుని ఉన్నారు. అందరూ కెన్నెడీ దంపతులకి సుస్వాగతం పలికేవారే. థామస్ కెన్నెడీ వయిపు తిరిగి గౌరవం చూపటానికి కొద్దిగా ముందుకివంగి, 'ఎలాఉంది!' అన్నాడు సగర్వంగా.

'ఓ. కే!' అని నవ్వాడు కెన్నెడీ. గేటు దగ్గర గుంపులో కలిసి పోయాడు. ఈ రకం స్వాగతాలు జాక్వెలీన్ కెన్నెడీకి అలవాటు లేకపోయినా త్వరగానే గుంపులతో స్నేహం చేసుకొనటం నేర్చుకుంది. భార్య ఎలా నెగ్గుకు వస్తుందో ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు కెన్నెడీ.

ఇక్కడ మోటారుకారు ఊరేగింపు ఏర్పాట్లు కొంచెం ఇబ్బంది కలిగించాయి. యార్బరోని సమీపించిన యంగ్‌బ్లడ్, 'సెనేటర్, మీరు శాన్ అంతోనియోలోనే ఉపాధ్యక్షుడితో వెళ్లవలసింది! ఇక్కడా అంతే,' అన్నాడు.

'మీకభ్యంతరం లేకపోతే థామస్‌కారులో నేనూ, నా భార్యా కలిసి వెడతాము.' అని యార్బరో సమాధానం ఇచ్చాడు.

ఈ సంగతి వెళ్లి యంగ్‌బ్లడ్ జాన్సన్‌తో చెప్పాడు. అతను తల ఆడించి ఊరుకున్నాడు.

కార్ల వరస 'రయిస్ హోటల్' ముందు వచ్చి ఆగింది, 40నిముషాల తర్వాత. ఒక విలేఖరి అక్కడ పోగయినవారిలో కొందరిని, 'మీరెందుకు వచ్చారు, మీరెందుకు వచ్చా' రని అడగటం ప్రారంభించాడు. కొందరు, 'అధ్యక్షుడినీ, జాకీని చూడటానికని, మరి కొందరు, 'జాకీని చూడటాని'కని చెప్పారు.



కెన్నెడీ డేల్ పవర్స్‌ని గుంపు బలం అంచనా వెయ్యమని అడిగాడు.

'మీ కోసం అయితే పోయినసారి వచ్చినంత మందే! కాని జాకీని చూడటానికి లక్షమంది పయిగా వచ్చారు!' అని జవాబిచ్చాడు పవర్స్.

'రయిస్ హోటల్' అధిపతి మాక్స్ పెక్ లౌక్యుడు. నిబ్బరం కల మనిషి — కాని అధ్యక్షుడి సతీమణి కారు తలుపు తెలుస్తూ, 'గుడ్ ఈవెనింగ్, మిసెస్ ప్రెసిడెంట్!' అన్నాడు కంగారుగా, పిచ్చిగా.

ఆమె కోసమనే మాక్స్ 50వ అంతస్తు మీది 'ఇంటర్నేషనల్ స్వీట్'ని ప్రత్యేకంగా అలంకరించాడు. (దాని రోజు అద్దె 150 డాలర్లు) గోడలకి నీలం, తెలుపు రంగులు వేయించాడు. నేల మీద నీలం పువ్వుల తివాసీ పరిచాడు. వాషింగ్టన్‌లోని 'వైట్ హవుస్' ఆఫీసులో ఉండే ఊగే కుర్చీ ఒకటి వేయించాడు. కూర్చునే గదిలో ఒక పళ్లబుట్ట, ప్రత్యేకమయిన వయిన్లూ ఫలహారాలూ ఉన్నాయి.

'టెక్సాస్‌వాళ్లు' మంచివాళ్లు అని లోపలే అనుకున్న జాక్వెలిన్ కెన్నెడీ, 'చాలా బావుంది!' అన్నది.

'ఈ గదిలో ఇంతకిముందెవరూ దిగలేదు,' అంటూ సెలవు తీసుకున్నాడు మాక్స్.

అధ్యక్షుడు కోటు, చెమటతో తడిసిపోయిన షర్టు విప్పి, రాకింగ్ చెయిర్‌లో కూర్చుని వార్తాపత్రికలు తిరగేసి చూశాడు. జాకీ తన గదిలో కునుకుతీసింది. కొంతసేపు తర్వాత అధ్యక్షుడు చిన్న ట్రెయర్ లోకిమారి రాత్రి ఇవ్వపోయే ఉపన్యాసాన్ని నగిషీ చెక్కాడు. ఇంతలో మేలుకున్న శ్రీమతి కెన్నెడీ నల్ల వెల్వెట్ సూటూ, రెండుపేటల ముత్యాలహారం, వజ్రపు చెవి దుద్దులూ ధరించింది. అధ్యక్షుడు కూడా డ్రెస్ చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి భోజనం ముగించారు. బహిరంగంగా జరిగే విందులలో తినేందుకే అవకాశం ఉండదు!

వీరి పయిగదిలో ఉపాధ్యక్షుడు తమ సతీమణితో భోజనం ముగిస్తున్నాడు. అధ్యక్షుడు ఆయనని కిందకి పిలిచాడు. వారు ఏమి చర్చించారో సరిగ్గా తెలియటం లేదు. 19నెలల తర్వాత ఈ సమాలోచనని గుర్తుకి తెచ్చుకున్న శ్రీ జాన్సన్, 'విభేదం అంటూ లేదు...అన్నీ చర్చించాము, చాలా విషయాల మీద ఏకీభవించలేకపోయాము,' అన్నాడు. పక్క గదిలో తన స్పానిష్ ఉపన్యాసం చదువుకుంటున్న శ్రీమతి కెన్నెడీకి వారు గట్టిగా మాట్లాడుకొనటం మాత్రం వినిపించింది. గదిలోకి వచ్చి వెడుతున్న హోటల్ పనివారు కొందరు యార్బరో పేరు ప్రస్తావన వచ్చినట్లు చెప్పారు. జాన్సన్ కోపం గురించి అందరికీ తెలుసు తనపయి అధికారి దగ్గర నిబ్బరం చూపినా, 'గదిలో నుంచి పిస్తోలులాగ బయటపడ్డా'డని తర్వాత చెప్పాడు తలుపు దగ్గర కాపు కాస్తున్న ఒక రక్షకభటుడు. లిండన్ జాన్సన్ నడిచి వెళ్లిపోతూ ఉండగా చూశాడు మాక్స్‌పెక్. పొడుగాటి కాళ్లతో పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ కోపంతో ఉడికి పోతున్నట్లు కనిపించాడని చెప్పాడు మాక్స్ తర్వాత.

'ఏమిటా గొడవంతా? జాక్వెలీన్ కెన్నెడీ ఉపాధ్యక్షుడు వెళ్లిపోయిన తర్వాత గదిలోకి వచ్చి అడిగింది. 'చాలా కోపంగా ఉన్నట్లున్నాడే?'

అధ్యక్షుడు నవ్వుకున్నాడు. 'లిండన్ తరహా అంతే...కాని చిక్కుల్లో ఉన్నాడు!'

ఉన్నట్లుండి జాక్వెలీన్ తనకి కానల్లీ అంటే ఇష్టం లేదన్నది.

'ఎందుకలాగంటున్నావు?'

'రోజంతా అతనితో గడపలేను. అతను పటువంటివాడు — ఏమిటో! అలా కూచుని తనని గురించి తానే అంత గొప్పగా చెప్పుకుంటూ ఉంటే భరించలేను. అదీకాక

నీకు కోపం తెప్పించాలని చూస్తున్నట్లున్నాడు.'

'నీ కిష్టంలేదనకు జాకీ! ఆలోచించిన కొద్దీ అతనిమీద అయిష్టం ఎక్కువయిపోతుంది. ఈ టెక్సాస్ వ్యాపారుల నెందరినో దువ్వి ఉంచుతున్నాడు. వాళ్లంతా మునుపు అతనికి ఎదురుగా ఉండేవారుట. గార్లో అతను చెప్పిందేమిటంటే టెక్సాస్‌లో కాకంటే ముందుగా వెడుతూ ఉంటానని. సరే, వెళ్లనీ! కాని, దయచేసి అతనితో పేచీ పెట్టుకోక! ఇక్కడికి నేను వచ్చిందే విరోధాలూ తగ్గించటానికి. ఇద్దర్నీ ఒక కారులో ఎక్కిద్దామని చూస్తున్నాను. ఇక గోపాలూ, తాపాలూవస్తే అసలే పెడసరం అయిపోతారు! ఎవరూ ఎవరితోనూ కలిసి ప్రయాణం చెయ్యరు...'

ఆవిడ కూడా తను అనవసరంగా చిరాకు తెప్పించుకుంటున్నానేమో, అని ఆ సంగతిని

అధ్యక్షుని మరణం

పట్టించుకోకుండా ఉండాలనుకున్నది. తన ఉపన్యాసం వేళకూడా అయింది. (స్పానిష్ భాష ఉపన్యాసం.)

'బాల్‌రూమ్'లో ముందు ఉపాధ్యక్షుడు, తర్వాత కెన్నెడీ మాట్లాడారు — ఇద్దరూ 'మైత్రి' గురించి చెప్పారు. 'నా మాటలు ఇంకా స్పష్టంగా అర్థమయ్యేట్లు నా భార్య చెప్పగలదు. ఆవిడని మాట్లాడమంటాను,' అన్నాడు అధ్యక్షుడు. ఆవిడ తన 'సభా పిరికి'ని అణగదొక్కి ఉపన్యాసం ప్రారంభించింది. మెక్సికన్ శైలికి అలవాటుపడ్డ అక్కడివారికి ఆమె అభిజాత్యమయిన ఉచ్చారణ వింతగా వినిపించింది.

'ఓలె!' అని అరిచారు ఆ చిన్న ఉపన్యాసం పూర్తికాగానే. నిజానికి అది గొప్ప ఉపన్యాసంకాదు. కెన్నెడీయే ఎక్కువ చెప్పాడు. కాని, వినేవారి సొంత భాషలో చెప్పిన ఉపన్యాసం! బాల్‌రూమ్ వదిలివెళ్లే ముందు కెన్నెడీ దంపతుల చూపులు కలవటం డేల్‌పవర్స్ గమనించాడు. లేడీ బర్డ్‌కి అధ్యక్షుడివాలకం 'మైకం కమ్మినట్లు' ఉందిట.

చీకటిలో మరొక ఊరేగింపు —ఆరోజుకి అది నాలుగవది. నిద్రపోయేముందు మరొక రెండు ఉన్నాయి...

కోలిసియమ్‌లో ఏర్పాటుచూసే మనిషి జాక్‌వాలెంటీ. అతనికి 'వైట్ హౌస్ పాస్' లేదు. అందుచేత మొదట కొంచెం ఇబ్బంది కలిగినా చివరికి పెత్తనం అంతా చేతుల్లోకి తీసుకున్నాడు. వేదికమీద అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు కూర్చున్నప్పుడు అతనికి కుర్చీలేకపోవటంచేత నాటకాల్లో వేషాలువేసేవారికి మాటలు చెప్పటానికి సహాయం చేసేవారిలాగ

(56 వ పేజీ చూడండి)

బలిసినకుక్కల దేశం!

భారతదేశం, ఈజిప్టులమధ్య గాఢమైత్రి ఉందంటారు. రెండుదేశాలు కలిసి ఒక విమానం ఇంజన్ తయారీ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని వార్తలు తరుచూ పత్రికలలో వస్తూనే ఉంటాయి, 1956 లో సూయెజ్ కాలువ జాతీయం చేసిన సందర్భంలో జరిగిన యుద్ధంలో భారతదేశం ఈజిప్టుని పూర్తిగా బలపరిచింది. ఇప్పుడు 1967 లో ఈజిప్టు ఇస్రాయెల్‌తో తిరిగి కొట్లాట పెట్టుకుంది. భారతదేశం తిరిగీ ఈజిప్టునే బలపరిచింది. పాకిస్తాన్‌తో భారతదేశం యుద్ధం చేసినప్పుడు ఈజిప్టు మనల్ని ఇంత స్పష్టంగా బలపరిచిందా అంటే అడిగేవే సంగతి! రెండుదేశాల మైత్రి గట్టిదని మాత్రం సరిపెట్టుకోవాలి.

ఈ మధ్యనే 'టయిమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో వారి కెయిరో విలేఖరి ఈజిప్టు పత్రికలలో భారతదేశం గురించి అప్పుడప్పుడు పడే వ్యాసాలగురించి రాస్తూ కొన్ని ఉదాహరణలు పేర్కొన్నారు.

శ్రీ అబ్దుల్ ఫట్టాహ్ రిజ్క్ అనే ఒక పరిశోధకుడు 'రోసె ఎల్ యూసెఫ్' అనే పత్రికలో, 'నదులు పవిత్రమయినవి కాబట్టి (భారతదేశంలో) సాగుబడి చెయ్యరాదు.' అనే శీర్షిక కింద ఒకవ్యాసం రాశాడుట.

వ్యాసంలో మరొకచోట, 'గట్టి మత సాంప్రదాయాలు అన్ని అంతర్ శాఖా సంబంధాలనీ పాలిస్తాయి. ఒక రాష్ట్రంలో మల మల మాడుతున్న లక్షలాది జనానికి పక్క రాష్ట్రంలోని వారు సహాయం చెయ్యరు. ఎందుకంటే మిగులు కల పక్కరాష్ట్రం వారు తక్కువ మతం శాఖకి చెందినవారు కాబట్టి.

'ఇందులో అతిశయోక్తికి అవకాశం ఉంది. కాని బీహార్ ఒక కొట్టవచ్చేట్లున్న ఉదాహరణ. బీహార్ రాష్ట్రంలో 'అశుద్ధ' లయిన తక్కువ జాతి హైందవులు ఉంటారు. ఎక్కువ కులం హైందవుడు తక్కువకులం వాడిని తాకరాదు. తాకితే శాపానికి లోనవుతాడు. మరి ఇతను వారి సహాయానికి ఎలా వెడతాడు?

'పవిత్రమయిన గంగానది, ఆ నది ఉపనది తీరాలమీదనే ఉన్న కొన్ని గ్రామాల ప్రజలు ఆ నదుల నీటిని సాగుబడికి వాడరంటే నమ్మశక్యంకాదు. మతాచారాలవల్ల దహింపబడిన శవాల బూడిద, ఎముకలు, ఇతర అవశేషాలు కలిసిన ఈ నది నీటిని వాడటానికి వీలులేదు. బూడిదతోబాటు సేంద్రియ సారాన్ని కూడా ఇండియన్ మహా సముద్రంలోకి తీసుకుపోయే ఈ విచిత్రమయిన నది వంక చూస్తూ ఊరుకుంటారు. అంతే.'

శ్రీ రిజ్క్ మరొకచోట ఇలా రాశారుట— 'భారతదేశంలోని క్షామాలని, నీటి ఎద్దడులనీ వదిలి ప్రాణాలతో బయట పడగలిగిన వాటిలో కెల్లా గట్టివి కుక్కలే. ఇవి చాలా లౌక్యం కలవి. నదీ తీరాలకి వెళ్లి నీటిలో తేలుతున్న ఆవుల, మనుష్యుల శవాలన్నీ పట్టుకొచ్చి తినేవి. ఇందువల్ల అవి అతి భయంకరంగానూ, క్రూరంగానూ తయారయ్యాయి.

'క్షామానికి పాలి, చిక్కిపోయిన పిల్లలూ, ఆడవారూ, ముసలివాళ్లూ ఒక వయిపు చావుకోసం ఎదురుచూస్తూ ఉంటే మరొక వయిపు బలిసిన కుక్కలూ, పవిత్రమయిన ఆవులూ శవాలూ మనకి చాలా బాధ కలిగిస్తాయి.'

ఒకసారి ఒక సందర్భంలో కీ. శే. లాల్ బహదూర్‌శాస్త్రిని 'మూడవరకం' బుద్ధి కల వ్యక్తిగా వర్ణించి, భారతదేశంలోని 'మొదటిరకం' సమస్యలని తీర్చేశక్తి ఆయనకి లేదని ఒకపత్రికలో రాశారుట!

ఒ. వి.

కొత్త సీసాల్లో పాత పానీయం

■ 'శివసేన కాంగ్రెసులో ఒకభాగమా?' —మద్రాసులో ఒకప్పుడు ద్రవిడకజగం వలె, దేశమంతటా నేడు కుడి కమ్యూనిస్టులవలె, శివసేన కాంగ్రెసులో భాగమే.

28—5—67 'ఆర్గనయిసర్'లో పాఠకుడి ప్రశ్న, పత్రిక జవాబు.

ఈ శతాబ్దం రెండవ దశాబ్దంలో సుప్రసిద్ధ మహారాష్ట్ర చరిత్రకారుడు, శ్రీ వి. కె. రాజవాడె తన పరిశోధనల ఫలితంగా ఒక పుస్తకం ప్రచురించాడు. శ్రీ రాజవాడె బ్రాహ్మణ కులానికి చెందినవాడు. ఆయన పుస్తకంలో 'చంద్రసేనీయకాయస్థ ప్రభు' కులం గురించి రాయటం జరిగింది. ఆయన కేవలం చరిత్రకారుడి దృష్టితో రాసినా కొందరు శ్రీ రాజవాడె చం.కా. ప్ర. కులాన్ని అవమానపరిచారని కోపగించుకున్నారు.

చంద్రసేనీయకాయస్థ ప్రభుకులం చరిత్రలో పేరెన్నిక పొందినది. బెంగాల్‌లో కాయస్థ కులంలోవలెనే ఈ కులంలోనూ ఎందరో మేధావులు, మహానుభావులు జన్మించారు. వివేకానందుడు, అరవిందుడు, సి. ఆర్. దాస్, సుభాస్ చంద్రబోస్ కాయస్థకులం వారు. శ్రీ సి. డి. దేశ్‌ముఖ్ ఆధునిక మహారాష్ట్రంలో చం. కా. ప్ర. కులంలో జన్మించి జగద్విఖ్యాతి తెచ్చుకున్నవారు.

శ్రీ రాజవాడెమీద పెద్ద ఉద్యమం ఒకటి బయలుదేరింది. ఎందరో ఆయనకి కుల ద్వేషం అధికం అని బహిరంగసభలలో ఆరోపించారు. కాని రాజవాడె పాండిత్యం, (అంతకన్నా ముఖ్యం) ఆయన నిజాయితీ, ఆయన పేరు ప్రతిష్ఠలని కాపాడాయి. పండితవర్గాలలో ఆయనకి పెద్ద అవమానం ఏదీ జరగలేదు. ఇలా ఉండగా, ఒక యువ చంద్రసేనీయ కాయస్థ ప్రభు రచయిత రంగంలోకి దూకాడు. రాజవాడె రచనని అతి చాతుర్యంతో ఖండిస్తూ ఒక పుస్తకం వెలువరించాడు. ఈ గ్రంథం శైలి, శిల్పం, అందులో సేకరించిన చారిత్రిక సమాచారం ఎందరినో ఆకర్షించాయి.

ఈ పుస్తకం రాసిన యువకుడి పేరు కేశవ్ సీతారామ్ ఠాక్రె. శ్రీ ఠాక్రె అప్పుడు బొంబాయిలో ఒక వ్యాపార సంస్థలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కాని, ఈ పుస్తకం ప్రచురణతో అతని కీర్తి పెరిగి—రాజవాడె అంతటివాడిని విజయవంతంగా సవాలు చెయ్యగలిగాడనే కీర్తి—పనిమాను కుని కుటుంబంతో బాటు బొంబాయినుంచి సతారాకి బదిలీ అయిపోయాడు. అక్కడ 'ప్రబోధన్' అనే వార పత్రిక ప్రారంభించాడు. ఈ పత్రిక ముఖ్యోద్దేశం బ్రాహ్మణ కులంవారు, ఇతర కులాలవారికిచేసిన అన్యాయాన్ని ఎత్తిచూపి ప్రజలకి హితబోధ చెయ్యటమే.

సతారా సత్యసమాజం, ఉద్యమానికి కేంద్రం. బ్రాహ్మణేతరులని బ్రాహ్మణ కులం మోపిన బానిసత్వంనుంచి విడుదలచెయ్యటం సత్యసమాజం తన కర్తవ్యంగా ఎన్నుకుంది. శ్రీ ఠాక్రెకి ఈ సమాజం స్వాగతం ఇవ్వటంలో ఆశ్చర్యంలేదు.

అప్పటికి సత్యసమాజానికి ముఖ్యపోషకుడు కొల్హాపూర్‌రాజు. ఆయన దాతృత్వాన్ని కొంతదాకా శ్రీ ఠాక్రెకూడా పొంది ఉంటాడని అందరూ అనుకునేవారు.

మదరాసులోని జస్టిస్‌పార్టీకి, సత్యసమాజానికి చాలా పోలికలు ఉన్నాయి. కాని, సత్యసమాజంవారు తీవ్రవాదులు. కార్యసాధనమేతప్ప మార్గం ఎలా ఉన్నా ఫరవాలేదనేవారు. బ్రాహ్మణ కులంవారిమీద చెయ్యి చేసుకొనటానికి కూడా సందేహించేవారుకారు.

1925 లో కొల్హాపూర్ రాజు, సాహూమహరాజ్, మరణించినప్పుడు శ్రీ కేశవ్ సీతారామ్ ఠాక్రె బొంబాయి తిరిగివచ్చి వెయ్యవలసివచ్చింది, తన పత్రికని ఇక్కడ నుంచే వెలువరించేవాడు. కాని, బొంబాయిలో ఆయన ఆగ్రహానికి కొత్త లక్ష్యం ఒకటి దొరికింది.

బొంబాయిలో దక్షిణ భారతీయుల ప్రమాదం పెరిగిపోతోందని ప్రచారం ప్రారంభించాడు. అక్రమ పద్ధతులద్వారా దక్షిణాదివారు బొంబాయిలోని ఉద్యోగాలన్నీ చేజిక్కించుకుంటున్నారని చాటేవాడు.

(56వ పేజీ చూడండి)

లోకం పోకడ

—మన స్వంతరాష్ట్రం (మద్రాసు)లోని తేని, ముడుకలత్తూర్‌లో విజయోత్సాహంతో ప్రతిపక్షం వారికోసం, కాంగ్రెసు ఏర్పాటు చేసిన సంఘటనలని గుర్తుకి తెచ్చుకొనవచ్చు. ఇందొక దినుసు ప్రయాసతో కాని అంతకు తక్కువకాని ఉపాయంతో, ఒక ముఖ్యమయిన ఎన్నికని 'వన్నియార్ వోటు అన్ని యార్ కిల్లయ్' (వన్నియార్ కులం వారివోట్లు ఇతరులకి కావు) అనే నినాదంతో గెలిచారు. ఇంకా ఎన్నో ఎన్నికలని 'జేబు—నియోజక వర్గం' పద్ధతి మీద గెలుచుకున్నవాటి సంగతి సరేసరి.

27-5-67 స్వరాజ్యలో ఇ. బాలసుబ్రమణ్యం.

* * *

—కేంద్రఆర్థికమంత్రి (స్టేట్) శ్రీ కె. సి. పంత్‌గృహం, శ్రీ తీన్‌మూర్తిమార్గ్‌లో ఒక వింత టీపార్టీ జరిగింది. పార్టీ పత్రికల వారికని ఇచ్చింది. శ్రీ పంత్ 'పార్టీదాత' అని వేరే చెప్పనక్కరలేదు. కాని ఆహ్వానాలు 'ప్రెస్‌ఎసోసియేషన్' తరఫున వేశారు. పత్రికల వారు మంత్రికి పార్టీ ఇవ్వాలనుకుంటే సాధారణంగా ఇందుకు వాడేచోట్లలో ఒకదానికి వారిని పిలిచి ఉండవచ్చు; మంత్రిగారు పత్రికలవారిని గౌరవించానుకుంటే తమే వారిని ఆహ్వానించి ఉండవచ్చు. ఈ విచిత్రమయిన ఏర్పాటు రాజధానిలో ఎందరో విలేఖరులని ఆశ్చర్యపరిచింది.


31—5—67 స్టేట్స్‌మాన్‌లో 'సి.ఎస్.సి.'

* * *

—...ఒకనాడు మనం శ్రీ కరుణానిధి తన సంస్కారం పేరుని తమిళంలోకి 'ఇరకకువియల్' గా మార్చుకొనటంకూడా చూడవచ్చు.

28—5—67 ఆర్గనయిజర్‌లో శ్రీ కె. కె. శాస్త్రి.

గోల్డ్ ఫింగర్-25   జేమ్స్ బాండ్ బొమ్మల సీరియల్



"అమెరికావదిలే ముందు మాస్కోలో నా మిత్రులకి టెలిఫోన్ చేశాను మిస్టర్ బాండ్! వాళ సంస్థ పేరు 'స్మెర్ష్'"

"వాళ్ళకి నన్నుగురించంతా తెలిసే ఉంటుంది!"

"తప్పకుండా! నాకు వెంటనే చాలా కొత్త విషయాలు తెలిశాయి. స్మెర్ష్ వాళ్ళు మిమ్మల్ని పరీక్షిస్తారు, ఈ ప్రయాణం తర్వాత. ఇదే మీ చివరి ప్రయాణం. ఇక మీరేమి ఎత్తులు ఎలాగ వెయ్య


("వెయ్యలేనా? సరే చూద్దాం..")— చేతనయింది చేస్తాను. నీ సీట్ బెల్టు కట్టుకో.*** బాండ్.



20,000 అడుగుల ఎత్తున విమానం జోరుగా వెళ్లిపోతోంది. రెండుగంటల తర్వాత బాండ్ కార్యానికి సంసిద్ధుడు అవటం మొదలు పెట్టాడు. షూలోనుంచి ఒక కత్తి తీశాడు.

ఆడ్‌జాబ్ తల కునికిపాటుతో ఊగుతోంది. బాండ్ అతని పక్క కిటికీకి గురి పెట్టాడు.

పెద్ద శబ్దం..గాలి కీచుగా అరిచింది...



ఆడ్‌జాబ్‌ని గుడ్డతో చేసిన బొమ్మలాగ చిల్లులోనుంచి లాక్కువెళ్లిపోయింది వాయుశక్తి.

భయంకరమయిన శబ్దంతో ఆ కొరియావాడి దేహం సందులోనుంచి బయటికి వెళ్లిపోయింది.

ప్రాణవాయువు తగ్గిపోవటంతో బాండ్ రొమ్ములో నెప్పితో కింద పడిపోయాడు.



తెలివి వచ్చేసరికి బాండ్‌కి నోట్లో నెత్తురు రుచి వచ్చింది. గూడులో నొప్పి..

జీవితంలో మొదటిసారిగా పిచ్చెక్కినట్లయింది..


"ఆ....!"



గోల్డ్‌ఫింగర్ పట్టు సడలింది. చేతులు వేళ్లాడి పోయాయి. నెమ్మదిగా బాండ్ తన వేళ్లనీ వదిలించాడు...

కాపలావాడి పని కూడా అయిపోయింది. అతనికి తుపాకి ఇంకా ఎందుకు?

"కాని ఆ సీటు బెల్టు నిన్ను కాపాడింది. నువ్వు బతుకుతావు పుస్సీ ...



"గోల్డ్‌ఫింగర్ చచ్చాడు. నా మాట వినని వాడిని చంపేస్తాను...


"పైలట్ మన మెక్కడున్నామో చెప్పాలి.."

"సర్, మనం గూస్‌బేకి 500 మైళ్ల దూరంలో ఉన్నాము. 'నేలవేగం 250 మైళ్లు, ఎత్తు 20,000 అడుగులు, ఇంధనం 2 గంటలకి సరిపడా ఉంది. ఈ ఎత్తులో, ఈ వేగంతో ఎగరటానికి."

"మనకి దగ్గరగా ఉన్న పెద్ద స్టేషన్ నౌక దగ్గరకి దారితియ్యాలి. ఎక్కడుంది?

"ఈశాన్యంగా 300 మైళ్ల దూరంలో 'వెదర్ షిప్' చార్లీ ఉందండి..

(ఇంకా వుంది)



సరివింద

-డి. కామేశ్వరి

'సుజా!...కాస్త కాఫీ యిస్తావా?' గది లోకి వస్తూనే అడిగాడు సుధాకర్. 'ఏం పాపం పేకాట ఆడి అలసిపోయారా?' మంచంమీద అటు తిరిగి పడుక్కునే కాస్త కఠినంగా అంది సుజాత.

'ఊ...నిజంగానే అలసిపోయాను!... నీరాగ్గా వుంది...కాస్త వేడికాఫీ పడితే హాయిగా వుంటుంది!...' ముఖం తువ్వాలతో తుడుచుకుంటూ, సుజాత ప్రక్కన కూర్చున్నాడు. 'అదేం...యిప్పుడు పడుకున్నావు!...'

'ఆ...థేంక్సు!...అదొంతకాదు!... పెళ్ళాం అనేది ఒకర్తి వుందని గుర్తుందా మీకు!' హేళనగా అంది సుజాత.

'అయ్యో! రాణీగారిని మరచిపోగలనా!... మరచిపోదామన్నా నీ వూరుకుంటావా?' భార్య కోపం గ్రహించకుండానే మామూలుగా నవ్వుతూ అన్నాడు సుధాకర్. 'అది సరే గాని...కాఫీ యిచ్చేదేమన్నావుందా, లేదా...?'

'ఏం, అంత తొందరపడుతున్నారు!... మళ్ళీ పేకాట ఆడాలా?'

'ఓ...ఆడా!...పేకాట ఆడావా యిా అంకంతా!'...భార్య కోపం గ్రహించి చిన్నగా నవ్వాడు సుధాకర్. 'నీకు సమంగారాదు... ఆడమంటే ఆడవు, నేను కాసేపు ఆడుకుంటే...దానికి కోపమే!'...

'నాకేం కోపం... వుంటే మాత్రం మీకు లెక్క ఏమిటి?...వెళ్ళండి పేకాటేం ఖర్మ, నాటకాలు, నాట్యాలు కూడ ఆడుకోండి!'...

'ఏమిటి సుజా యిది, కాసేపు పేకాడానని యింత కోపమా?...పోనీలే యింక ఆడను...యిక్కడే కూర్చుంటాను... కాఫీ తీసుకురా.' సుజాత భుజంమీద చెయ్యివేసి మృదువుగా అన్నాడు.

'కాఫీ మీకు నేనియ్యాలా ఏమిటి?...మా వదినగారిని అడగండి, అన్ని సపర్యలు చేస్తుంది కదా ఆవిడ మీకు,... ఆవిడే యిస్తుంది,...అడగండి!' మొఖం ముడుచుకుని అంది సుజాత.

సుధాకర్ అర్థం కాక తెల్లబోయి చూశాడు.

'ఏం ఎందుకంత ఆశ్చర్యం? అర్థం కానట్టు..మీరడుగుతారు, ఆవిడ యిస్తుంది.. పుచ్చుకుంటారు, అన్నీ వేళ, వేళలకే అమర్చ డానికి ఆవిడ వుండగా...యింక పెళ్ళాం ఎందుకు?!...అన్నీ అందించడానికి. ఆటలు ఆడడానికి, కబుర్లు చెప్పడానికి అన్నింటికి ఆవిడ వుండగా యింక మీకు పెళ్ళాం ఎందుకు?' హేళన, నిరసన,...అసూయ, కోపం అన్ని మిళాయించి అంది సుజాత.

'సుజా!......ఏమిటంటున్నావు?...... ఏం మాట్లాడుతున్నావు?' ఆశ్చర్యంగా అడిగాడు అప్పటికీ అర్థంకాక సుధాకర్.

'నేనేం సంస్కృతం మాట్లాడడం లేదు! వెళ్ళి మావదినని కాఫీఅడగండి, యిస్తుంది... ...అంటున్నాను...'సాగదీస్తూ అంది సుజాత.

'సుజా,...ఏమిటిలా మాట్లాడుతున్నావు? ఏమిటిది? మధ్యన మీ వదిన ఏం చేసింది? యీా విసుర్లేమిటి? యీా అనవసర కోపమేమిటి?' కాస్త కోపంగా చూస్తూ అడిగాడు సుధాకర్.

'అవును నాకోపం అనవసరంగానే కనిపి స్తుంది.మీరిద్దరు చేసేపనులు బాగున్నాయి... ఆవిడ మీతో సరసాలాడ్డం, పేకాటల్లు, నవ్వులు నాటకాలు అన్నీ బాగున్నాయి. పరాయి మగవాడితో యిష్టం వచ్చినట్లు

ఆవిడ ప్రవర్తించడం బాగుంది, పెళ్ళాం వున్నదన్న సంగతి మీకు గుర్తులేక పోవడం బాగానే వుంది...'

'సుజా!' తీక్షణంగా చూశాడు సుధాకర్.

'ఏమిటి ఆసందర్భపు మాటలు...మతి గాని పోయిందా నీకు, నివేం మాట్లాడు తున్నావో తెలుసా!... నే నావిడతో సరసా లాడానా?...ఆవిడనాతో నాటకాలు ఆడు తూందా?...ఎవరి గురించి మాట్లాడు తున్నావో తెలుసా!...' కోపంతో మాటలు తడబడ్డాయి సుధాకర్కి.

'ఏం, కోపం యెందుకు వున్నమాట అంటే...'

'ఏమిటా వున్నమాట? ఆమె నాకు కాఫీ ఫలహారాలు అందించడం తప్పా, యింట్లో ఆవిడ అన్నీ చూస్తూంది కనుక ఆవిడని నేనేదన్నా కావలిస్తే అడగడం తప్పా, అందరితో కలిసి సరదాగా పేకాట ఆడ్డం తప్పా?..యిందులో నీవు తప్పు పట్టవలసింది ఏం వుంది?...ఎందుకు తీరి కూర్చుని యిలా అనుమానాలు, అపోహలు పడి..'

'లబ్బే...తప్పేంలేదు, దేన్లోనూ తప్పు లేదు.' ఆ హేళనకి, నిర్లక్ష్యానికి సుధాకర్ వళ్ళు మండింది.

'నీ వెక్కిరింతలు. హేళనలు మాని,... సూటిగా చెప్పదలచింది చెప్పు, ఏ విషయం గురించి నీ విలా అనుమానపడి మాట్లాడు తున్నావు?...నా ప్రవర్తనలో నీకు ఏం తప్పు కనిపించింది?..' తీక్షణంగా అడిగాడు.

'తప్పేముంది!..యిష్టం అయితే ఏ తప్పు వుండదు!..'

సుధాకర్ ఒక్కక్షణం నిశితంగా సుజాత మొహంలోకి చూశాడు. సుజాత వ్యర్థ అనుమానం, అపార్థానికి కొంత ఏహ్యమే కలిగింది భార్యమీద

'హాం...పరాయి యింటినించి వచ్చిన అమ్మాయిని కాదూ, యింత తేలిగ్గా... యింత నిందవేయగలిగావు...యిదే నీ అక్క, చెల్లెళ్లయితే వేయగలవా?...అన్న భార్య, వదినగారిని...నివు అనవలసిన మాటలేనా యివి?'...

సుజాత కలవరపడింది ఒక్క క్షణం... క్రింది పెదవి పంటక్రింద నొక్కిపట్టి విసురుగా... 'ఎవరైనా నాకు ఒకటే... నా మొగుడిని వలలో వేసుకోడానికి ప్రయత్నిస్తుంటే చూస్తూ వూరుకోవడం నాకు చాతగాదు' బింకంగా అంది.

'ఛఫ్... నోటికి వచ్చినట్టు మాట్లాడకు!... యింతోటి మొగుడు నీకే కాదు, ఆవిడకీ వున్నాడు నీ మొగుడిపాటి మొగుడు... ఆవిడకేం ఖర్మ కాలింది నీ మొగుడిని వలలో వేసుకోడానికి?'...

'ఏమో, ఏం అవసరం వచ్చిందో నాకేం తెలుసు, ఏం లేకపోతే ఎందుకలా మిమ్మల్ని పూసుకు తిరగడం...మీకన్నీ అంత అభిమానంగా, ఆప్యాయంగా అమర్చడం...'

'సుజాతా!' కోపంగా అరిచాడు సుధాకర్. 'ఛీ...నీకు బుద్ధిలేదు...యింత చిన్న విషయానికి యిలా అనుమానపడి....మీ వదినని,...తోటి స్త్రీని గురించి యింత హీనంగా ఆలోచిస్తావా?...పాపం ఆవిడ యింటి కోడలుగా,...యింటికి వచ్చిన అతిథికి...అందులో అల్లుడికి కాఫీ ఫలహారాలు అమర్చడం తప్పా?.. నలుగురిలో కలసి సరదాగా మాట్లాడడం, కాసేపు ఆడడం తప్పయిందా?...అసలు నీ కిలాంటి అనుమానం ఎలా వచ్చింది?'...

'ఏం ఎందుకు రాదు?. .ఆవిడ ఎందుకు మీకు అన్నీ చూడ్డం? నేనేమయ్యాను!.. భార్యని నేనుండగా,...నా మొగుడి విషయం దానికెందుకు? ఆవిడ మొగుడు సంగతి నేనేమైనా చూస్తున్నానా?. . నా మొగుడి విషయంలో తన కెందుకంత శ్రద్ధ!'... కోపంగా అంది సుజాత.

మితిమీరిన అసహ్యంతో, తిరస్కారంగా చూశాడు సుధాకర్.

'అసలు నీ కిలాంటి ఊహలు వచ్చినందుకు సిగ్గుపడాలి నువ్వు సుజాతా! ఆవిడ మొగుడికి నివు అన్నీ అమర్చడానికి, నీ మొగుడికి ఆవిడ అన్నీ అందించడానికి చాలా తేడా వుంది! ఆవిడ మొగుడు నీకు అన్న!...యిది నీపుట్టిల్లు!...యిక్కడ నీవు ఎవరికి ఏం చేసినా, మానినా ఎవరూ అను కోరు!...కాని ఆవిడ ఆ యింటికోడలు! యింటికొచ్చిన వాళ్ళ మంచి చెడ్డలు చూడాల్సిన బాధ్యత ఆవిడ కుంది! ఆవిడ తన బాధ్యత నెరవేరుస్తే.. యిలా అంటున్నావు ...ఏమి పట్టించుకోకుండా వుంటే ఆ నోటితోనే 'ఫ్రెండింటికి వస్తే యిన్ని కాఫీ నీళ్ళయినా యిచ్చే దిక్కులేదు. మా అమ్మేవుంటే యిలాగే చేసేదా?' అని నీవే నిష్ఠూర్యమాడుతావు!..ఛీ...వావివరుసలు కూడ మరచిపోయి...ఎందు కిలాంటి అనుమానాలు...ఆమె నాకు సోదరి వరుస తెలుసా!'...బాధగా అన్నాడు సుధాకర్!

'సోదరి!'...వెక్కిరింపుగా అంది సుజాత... 'పాపం ఎంత అభిమానం లేకపోతే .. సోదరిని యిలా వెనకేసుకు వస్తారు!'...

తీక్షణంగా చూశాడు సుధాకర్. 'చదువు కున్న దానివి,...యింత సంస్కార హీనంగా ఎలా మాట్లాడుతున్నావు?... యీపాటి వివేకంలేని నీకు ఆ డిగ్రీ ఎందుకు కావాలి?...'

సుజాత మొహం ఎర్రబడింది. 'డిగ్రీ లున్నంత మాత్రాన...నా మొగుడిని వలలో వేసుకోడానికి ప్రయత్నించే వారిని క్షమించే ఔదార్యం నాకులేదు...సంస్కారం అంటే అదేనని నాకు తెలీదు!' కర్కశంగా అంది.

సుజాత వ్యర్థ అనుమానానికి, మూర్ఖత్వానికి సుధాకర్కి పట్టరాని కోపం వచ్చింది. అలాంటి మనిషితో ఏమని వాదించి నచ్చచెప్పాలో కూడ అంతుబట్టలేదు.

'సుజా!...చెప్పినా కూడ...యింకా నీవు నీ అనుమానాలతో బాధపడాలని వుంటే పడు. ...ఇంకోసారి గట్టిగా చెపుతున్నాను...నీవ పొరపడి, అనుమాన పడవలసిన బాంధవ్యం మా మధ్యలేదు...ఆమె నాకు చెల్లెలితో సమానం...యింతే నేను చెప్పదలచింది!'... భార్యతో యింక మాటలు పెంచడానికి మనస్కరించక చేతికందిన పుస్తకం తీసి మొహానికి అడ్డు పెట్టుకున్నాడు.

తనని బతిమాలి, ప్రాధేయపడుతాడనుకున్న సుధాకర్ అంత నిర్లక్ష్యంగా అంటీ అంటనట్టు ప్రవర్తించడంతో సుజాత ఉక్రోషం...కన్నీళ్ళుగా మారింది.

'పెళ్ళయి...యింతామూడునెలలయింది... అప్పుడే నామీద మీకు యింత విముఖత్వం కలిగిందంటే!...అది కాదూ కారణం ..అంత యిష్టంలేనివారు...ఎందుకు పెళ్ళిచేసు కోవాలి ఎన్నో సంస్కారవంతుల్ని, యిష్టమయినవారి నె కట్టుకుని వుండాల్సింది...' సుజాత మాటలు బాణాల్లా దూసుకొస్తున్నా... తనని కాదన్నట్టు చలనం లేకుండా అలాగే కూర్చున్నాడు సుధాకర్.

'ఛీ...ఛీ...అసలు యిలాంటి ఆలోచన ఎలా వచ్చింది సుజాతకి! చదువు, సంస్కారం అన్నీవున్నాయనుకున్న తన భార్య

ఊహాలు యింత హీనంగా వున్నాయా?... పరాయి ఆడదాని వంక కన్నెత్తిచూస్తేనే అనుమానపడేంత నీచ మనస్తత్వమా?... ఎవరో చదువురాని మూర్ఖులు,...పంపుల దగ్గర ఆడవాళ్ల మనస్తత్వమా?... సుజాతది! యింత కుసంస్కారమా?

ఇంతకీ తామేం అసభ్యంగా ప్రవర్తించామని యిలా అపోహలు పడుతూంది! తను మాటల్లో, చేతల్లో ఎంచి చూపడానికైనా ఏం తప్పు కనిపించింది సుజాతకి! ఆవిడ తన గదిలో దూరి ఏకాంతంగా రహస్యాలు మాట్లాడిందా? తాను ఆవిడతో ఏం గుసగుసలాడాడు? ఏం తప్పు కనిపించింది?... యింటికివచ్చిన చుట్టానికి కాఫీ, ఫలహారాలు యిస్తే అందులో అనుమానపడేదేముంది? ఏమన్నా సరదాగా మాట్లాడుకున్నా, సరదాకి పేకాట ఆడినా అందరూ కలసి, నలుగురిమధ్యన హాల్లులో కూర్చుని ఆడారు! యిద్దరూ వంటరిగా ఎన్నడూ ఏం చెయ్యలేదు! అలాంటప్పుడు యింత నింద ఎలా వేయగలిగింది సుజాత!

ఆవిడమీద అనవసరంగా యిలా ఎందుకు కత్తి పట్టింది! తననంటే తను యింత బాధపడకపోను! అన్న భార్యని, వదినని పెళ్లయి కాపురం చేసుకుంటూ, పిల్లల తల్లిఅయిన ఆమెనిగురించి యింత హీనంగా ఆలోచిస్తున్నందుకు ... సుధాకర్ వళ్లు కోపంతో దహించుకు పోసాగింది. పైగా తను ఏదో కొట్టినట్లు యింత చిన్న విషయానికి కొంప మునిగినట్లు ఏడుస్తున్న సుజాతని చూస్తే జాలి బదులు మరింత కోపం పెరిగింది.

'మావయ్యగారూ,... యిదిగో కాఫీ... అమ్మ యిమ్మంది' ఏడేళ్ల సరోజ వచ్చి గ్లాసు అందించింది...' యింత అభిమానంగా, ఆదరంగా వేళ వేళకి యింట్లో అందరి అవసరాలు గుర్తించి అభిమానంగా చూసే కమలని ఎంత మాట అంది!

కమలతో తను చనువుగా మాట్లాడే మాట నిజమే!...ముందునించి వున్న పరిచయంవల్ల కమలతోటి కాస్త సన్నిహితంగానే వుంటాడు...

కమలని తనకు యీ పెళ్లి కాకముందే తెలుసు! తన ఫ్రెండు భాస్కర్ చెల్లెలు కమల! యూనివర్సిటీలో తన చదువు, భాస్కర్ చదువు వేరయినా భాస్కర్ తనకి సీనియర్ అయినా భాస్కర్‌తో తనకు పరిచయం అయి...ఆ పరిచయం సన్నిహిత స్నేహంగా మారింది. భాస్కర్‌కోసం యింటికి వెళ్లే తనకి ఆ కుటుంబం అందరితోనూ పరిచయం వుంది. పండుగలు, శుభకార్యాలు వచ్చినా భాస్కర్ యింటికి భోజనానికి వెళ్తూండేవాడు. ఒక సారి తనకి తీవ్రమయిన జ్వరంవస్తే భాస్కర్ యింటికి తీసికెళ్లి ఆ పదిహేను రోజులు ఎంతో అభిమానంతో పరిచర్యలు చేశాడు.

భాస్కర్ చెల్లెలు కమలకి అప్పటికే పెళ్లయింది. అప్పుడు పురిటికి పుట్టింటికి వచ్చివుంది. తనకన్నా ఒక సంవత్సరమే చిన్న కమల. తన భారం అంతా చెల్లెలికి అప్పగించాడు. జ్వరంలో వున్నన్ని రోజులు, కమల తనకి స్వంత అన్నయ్యకి చేసేంత అభిమానంగానూ పరిచర్యలు చేసింది...'సుధాకర్‌గారూ' అంటూ ఎంతో చనువుగా మెలగింది. అప్పటినించి ఆ యింటిలో అందరితో తనకి గాఢ మైత్రి కలిగింది. చదువులు అయి ఉద్యోగాలలో వున్నా భాస్కర్ తనూ యిప్పటికీ మిత్రులే! అసలు యీ సంబంధం కమల ద్వారానే కుదిరింది. సుజాత లాంటి అందచందాలున్న భార్య లభించినందుకు... కమల పట్ల కృతజ్ఞత తన మనసులో యిప్పటికి వుంది!

ముందునించి వున్న పరిచయం కొద్దీ, చనువు కొద్దీ, అత్తవారింట్లో అందరూ క్రొత్త చేత,...ఏం కావల్సినా ఎవరినయినా అడగడానికి బిడియపడేవాడు. అందరిలో సుజాతతో మాట్లాడడానికి మొహమాటపడి ఏదైనా కావలిస్తే కమలని అడిగేవాడు. కమలకూడ ముందునించీ వున్న చనువుచేత అన్నీ అమర్చిపెట్టి, సరదాగా మాట్లాడింది...అంతకు తప్ప యిద్దరికీ ఏ కోశానా ఏ దురుద్దేశమూ లేదు.

అసలు కమకేలం ఖర్మం! ఆ మొగుడి కంటె తను ఎందులో అధిక్యుడు!?... అలాగే సుజాత కంటె కమల ఎందులోనూ ఎక్కువకాదు! సుజాత అందచందాలతో అసలు కమల పోటీపడలేదు! అలాంటప్పుడు ఏం చూసి యిద్దరూ వున్న భార్యని, భర్తని వదిలి యింకోరి వెంటపడే ఖర్మ ఏమిటి తమకు?...యింత మాత్రం యోచించలేని మూర్ఖురాలా సుజాత!

సుజాత ఎంత అందంగా వుంటుంది! వికసించిన గులాబిలాంటి అందం వెనక కంటకం లాంటి యింత సంకుచిత మనస్తత్వమా!

సుజాత లాంటి భార్య దొరికినందుకు యీ క్షణం వరకు ఎంత గర్వించాడు! యింత అందగత్తెను వుంచుకుని పరస్త్రీ వ్యామోహంలో పడతాడని ఎలా అనుకుంది? ఎంత అపురూపంగా, అభిమానంగా చూస్తున్నాడు సుజాతని తను...తన ప్రేమని కూడ గుర్తించలేక పోయిందా?

అసలు సుజాత కోపం, అనుమానం తన మీద కాదు! కమలమీద అని గ్రహించాడు సుధాకర్....అసూయ! తన భర్తని ఆకర్షిస్తుందన్న అపోహ! స్త్రీల్లో ఓపాలు ఎక్కువనే అసూయ వుంటుందని తనకూ తెలుసు!... కాని యింత అసూయా? ఆ అసూయకైనా అర్థముండాలి! కన్నెత్తిచూస్తే, పన్నెత్తి మాట్లాడినంత మాత్రాన అనుమానమా? భార్య భర్తంకి ఒకరిమీద ఒకరికి యీ మాత్రం విశ్వాసం లేకపోతే ఎలా?

తన భర్త తన కళ్లెదుట, తన కనుసన్నల్లో వుండి, తనమాట జవదాటకూడదని...తనమీదే పూర్తిగా ఆధారపడి వుండాలని,...ప్రతీ భార్యా వాంఛించడం సహజమే! తనకు మాత్రం సుజాత సాన్నిధ్యంలో గడపడం యిష్టంలేదూ!

'అయితే నలుగురిలోనూ వున్నప్పుడు ఎంత క్రొత్తపెళ్లాం అయితే మాత్రం ఇరవైనాలుగు గంటలు గదిలో తలుపులు బిడాయించి కూర్చుంటే ఏం అనుకుంటారు! తమ యింట్లో తామిద్దరూ తమ యిష్టం వచ్చినట్లు వుంటారు... ఒక్క నాలుగైదు రోజులు కాస్త ఓర్పు పడితే పోయేదానికి...అంత మాత్రం సహనం కూడ చూపలేక పోయింది సుజాత!

"ఏం బావగారూ, ... గదిలో దూరి పోయారు!...రండి, యింకో రౌండువేద్దాం!' బావమరిది పిలుస్తూ వచ్చాడు. వాడిన మొఖాన్ని ప్రసన్నంగా మార్చుకుంటూ... 'ప్లీజ్, ఏం అనుకోకండి...యివాళ యింక ఆడలేనండీ!...ఎమిటో కొంచెం తలనొప్పిగా వుంది...కాస్త స్నానం లదీ చెయ్యాలి,...

మీరందరూ ఆడుకోండి. తప్పించుకుంటూ అన్నాడు సుధాకర్, యిప్పుడు మళ్లీ ఆడుతే యింకెంత రాద్ధాంతం చేస్తుందో సుజాత! అనిపించి భయపడ్డాడు సుధాకర్. తనకు పేకాట చాలయిష్టం. ఉత్తిరోజుల్లో ఆఫీసు, పని తీరు బాటే వుండదు! ఏదో యిలా నలుగురూ కలసినపుడే గదా ఏం ఆడినా! సరదాగా నలుగురిలో ఆడుకున్నందుకు ఎంత గొడవ! ఎంత క్రొత్త భార్య అయినా,... ఆ భార్య ఎంత అందగత్తె అయినా...యిరవై నాలుగు గంటలు ఆమెతోటే లోకంగా...ఏ మగవాడు...ఎన్నాళ్లు గడపగలడు? అంత కట్టి బంధించాలనుకునే భార్య మనస్తత్వాన్ని మగవాడు సహించగలడా?'

'ఏమండీ, సుధాకర్‌గారూ...తలనొప్పిగా వుందన్నారుట...మాత్ర ఏమన్నా యివ్వమన్నారా?...మీ దగ్గర ఏమన్నా వున్నయ్యా?' ఆదరంగా గది గుమ్మంలో నిల్చుని, నిష్కల్మషంగా అడుగుతున్న కమలనిచూసి తడబడ్డాడు సుధాకర్.

'అబ్బే...ఫరవాలేదండీ... కొంచెం తలనొప్పే! మాత్రవేసుకున్నాను లెండి...' అదో రకంగా గాబరాపడుతూ అన్నాడు...ప్రతిసారి లాగ నిస్సంకోచంగా మాట్లాడలేకపోయాడు సుధాకర్....

'వేసుకున్నారా!...అదేం సుజా!...పడుకున్నావు యిప్పుడు?' సుజాత పలకక పోవడంతో 'సుజాత పడుకుందేం సాయంత్రం?' సుధాకర్ వంక తిరిగి అడిగింది...'


'పడుకుంది...నిద్రపోతూంది లెండి'...ఏడుస్తున్న సుజాత కమల కంటబడడం యిష్టం లేక ఏదో సర్దిచెప్పేడు. అసలు కమల అక్కడ నించి ఎంత త్వరగా వెళ్లిపోతుందా అనిపించింది సుధాకర్‌కి...అసలే మండిపోతున్న సుజాత యింకా తామిద్దరూ యిలా మాట్లాడుకోవడం, ఆజ్యంపోసినట్లవుతుంది! వెళ్లిపోతున్న కమలని,...కళ్లుతెరచి తీక్షణంగా, తడికళ్ళతో చూస్తున్న సుజాతని చూడగానే సుధాకర్ మనసు మూలిగింది బాధగా.

ఎందుకింతలా ఆవిడమీద కక్షకట్టింది? తక్కిన అందరూ సుజాత అక్కచెల్లెళ్లు... యింకో వదినగారూ...అందరూ మామూలుగా తనతో మాట్లాడుతారే! వారందరి మీద లేని అనుమానం ఒక్క కమల మీదే ఎందుకు? అసలు వచ్చిన రెండుమూడు రోజుల్నించి...అప్పుడు తను కనిపెట్ట లేకపోయాడు గాని...రెండు మూడు సందర్భాలలో కమల పట్ల సుజాత ప్రవర్తన యిలాగే వుంది. నిన్న సాయంత్రం షికారు వెళ్దామని సుజాతని ముస్తాబవ మన్నాడు... యీలోపల తను క్రింద వరండాలో, కమల కొడుక్కి ముస్తాబుచేస్తూంటే ప్రక్కన నుంచుని చంటివాడిని చిటికలు వేస్తూ పిలుస్తూ, వాడు నవ్వేబోసినవ్వులకి, కమల, తను నవ్వుతున్నారు...సుజాత ఎప్పుడు వచ్చి నుంచుందో ప్రక్కగది గుమ్మందగ్గిర నుంచుని...మింగేసేట్టు చూస్తూంది... అప్పుడు ఆ కోపం తనుగ్రహించ లేకపోయాడు!...మొన్న అలాగే, అందరూ భోజనాలయ్యాక హాలులో కూర్చుని సరదాగ కబుర్లు చెప్పుకుంటున్నారు...కమల కూడ వచ్చి కూర్చున్న వెంటనే...అంత వరకు నవ్వుతూ కబుర్లు చెపుతున్న సుజాత మొహం మటమటలాడించుకుంటూ విసురుగా లేచివెళ్లి పోయింది...యివాళా అంతే! బావమరిది వచ్చి పేకాట ఆడదామని పిలిస్తే వెళ్లాడు...సుజాతని రమ్మని పిలిస్తే ముఖం ముడుచుకుని 'నేనురాను మీరాడుకోండి. మీరందరూ పేకాట ప్రవీణులు, నాకు రాదు' అంది. నిజమే సుజాతకి పెళ్లి అయే వరకు పేకాటరాదు...తనకి సరదానించి కొంచెం నేర్పాడు. 'ఫరవాలేదు, ఇంట్లో సరదాగా ఆడుకోడానికి చాలు నీ ఆట' అని బలవంత పెట్టినా రానని కోపంగా పడుకుంది. ఇష్టంలేదని తనింక బలవంత పెట్టలేదు, ఆ పేకాట ఆడాక యింత గొడవ చేసింది!

ఎలాగైనా యిక మీదట తను కాస్త జాగ్రత్తగా వుండాలి! తన మూలంగా కమల అనవసరమైన నిందకి గురి కాకూడదు! అనవసరమైన అపోహలకి, అనుమానాలకి తావీయకూడదు! కాని కమలకి ఎలా తెలుస్తుంది సుజాత అపోహ గురించి! ఏమని చెప్పడం కమలకి, సుజాత అనుమానం గురించి!?... తెలిస్తే ఎంత బాధపడుతుంది! ఆడబడుచు కోపాన్ని కమలంతటకమల గ్రహించగలిగితే మంచిదే! కమలకి తెలియనోకయినా, భార్య మనస్తత్వం తెలిసిన తను కమలతో ముభావంగా వుంటే కొన్నాళ్లకి కమలే అర్థం చేసి కొంటుంది! నిట్టూర్పు విడిచాడు సుధాకర్. సుజాత యింకా ఏడుస్తూనే వుంది!... ఒక్కసారి చూసి, పకరించడానికి మనస్కరించక, స్నానంచేసి, బయటికి వెళ్లి మామగారి గదిలో భోజనాల టైము వరకు కూర్చుండిపోయాడు సుధాకర్.

రాత్రి భోజనాల దగ్గర ... అంతవరకు ఎంతో సరదాగా వున్న సుధాకర్ గంభీరతని... సుజాత ఏడ్పు మొహాన్ని చూసి అందరూ మొహాలు చూసుకుంటూంటే, సుధాకర్ ఎంతో సిగ్గుపడ్డాడు. మాటా మంతీ లేకుండా, విసురుగా, ధుమధుమలాడుతూ,

(58 వ పేజీ చూడండి)



మట్టిబొమ్మలు



సీరియల్

తాడిగిరి పోతరాజు

జరిగిన కథ

వెంకట్రామయ్యగారు హైస్కూలు సంస్థాపకులు. ఆయన కుమారుడు మధు. వారింట్లో పెరిగిన అనాథ ప్రసాద్. ఆ స్కూల్లో పనిచేసే హెడ్మాస్టరు కామయ్య ఆయనకు ఆప్తమిత్రులు. వెంకట్రామయ్యగారికి జబ్బుచేసి మరణిస్తారు. ఆయన భార్య అచ్చమ్మగారు తన తమ్ముడు శివరామయ్య కూతురు వూర్మిళను మధుకు చేసుకోడానికి ఆయన్ను ఒప్పిస్తుంది. మద్రాసులో చదువుకుంటున్న మధు సెలవులకని యింటికివచ్చి ఉత్సవాల్లో కామయ్య మాస్టారికూతురు శారదను చూస్తాడు. ఆకర్షించబడతాడు. కాని ఆమె వైముఖ్యాన్ని తెలుసుకుంటాడు. ఇది పసికట్టిన అచ్చమ్మగారు వెంటనే మధుచేత మద్రాసు ప్రయాణం కట్టిస్తుంది. ఇంతలో ఆ స్కూల్లో యస్. యస్. యల్. సి. పెట్టుకోటానికి అనుమతి వస్తుంది. కొత్తగా తయారయిన స్కూలు భవనం ప్రారంభోత్సవాలు జరుపుకుంటుంటారు.

10

రాత్రి ఎనిమిదిగంటలవేళ. చుక్కలన్నీ కొండమీద నిక్కినిక్కి చూస్తున్నాయి. కొండప్రక్కగా తాటితోపుమధ్యగా నెలపొడిచింది. మూగవెన్నెల అలుముకోసాగింది. ఊళ్లో చిన్నా పెద్దా అందరూ భోజనాలు ముగించుకొని ఒకర్ని మరొకరు కేకలు వేసి కొంటూ, నాటకం చూడటానికై హైస్కూలువైపు నడవసాగారు.

రంగస్థలం వెనకఉన్న రెండుగదులనూ నటుల ముస్తాబుకొరకు ప్రత్యేకించారు. ఒకటి ఆడపిల్లలకు. రెండవది ఆడపిల్లలు కాని వాళ్ళకు. అమ్మాయిలకు రంగులు వేయటం—విగ్గులు పెట్టటం— దుస్తులు తొడగటం— ముస్తాబుచెయ్యటం మొదలైన బాధ్యతలన్నీ శారదకు అప్పగించారు. ఆమెకు సహాయకురాలిగా ఊర్మిళను నియమించారు. కాని వాళ్ళిద్దరివలన అయ్యే పనిలా కనిపించటంలేదు. ఆరుగంటలనుండి సతమతమౌతూన్నప్పటికీ పని తెమలటంలేదు. విచిత్రవేషాలవాళ్లను గోడవారగా వరసగా కూర్చోబెట్టి నాటకంలో పాత్రధారులను ముందు సింగారిస్తున్నారు ... అంతా రద్దీ—గోల... అంతలోనే తలుపు తట్టిన శబ్దమైంది.

'ఎవరూ?'

'నేను శారదా! ... ప్రసాద్‌ని ... తలుపు తియ్యి.'

'అబ్బబ్బ — నిముషానికొకళ్ళు— తలుపు తీసి రావమ్మాయి.'

పెట్రోమాక్స్ లైటు వెలుతురులో అమ్మాయిల ముఖాలు. ఎర్రరంగు పూసిన అమ్మాయిల ముఖ పద్మాలలో తేజోవంతంగా మెరసిపోతున్నాయి కళ్ళు. కళ్ళు ఆకరాంతం వ్యాపించినట్లు కనిపించేలా కళ్ళ చుట్టూ, చెవులవరకూ నల్లనిగీతలు. బుగ్గలపై మెరుపు జల్లుకోవటం వలన ప్రక్కలకు తిరిగినప్పుడల్లా 'ఛమక్—ఛమక్' మంటున్నాయి చెక్కిళ్ళు. విల్లులా వంపు తిరిగిన పెదవులు ఎర్రరంగు పూసికొని మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి.

ప్రసాద్— అందరినీ ఓ క్షణం పాటు పరికించి శారదకేసి తిరిగాడు. జడను నడినెత్తిన మునిలా ముడివేసికొన్న నారద పాత్రధారణికి 'పఫ్'తో పౌడరు అంటించుతోంది.

అబ్బబ్బ...ఇంకెంతసేపు...త్వరగా కానివ్వాలి...జనం గోలపెడుతున్నారు. నాటకాలలోవాళ్ళను అలా వదిలెయ్యండి. ఇంకా 'పై'మందిగా...ఈ విచిత్రవేషాలు ముందు కానివ్వండి'....అంటూ ఆ నారదపాత్రను రెక్కపట్టుకొని ప్రక్కకు జరిపాడు.

'ఉండుండు...కొద్దిగా ఇక్కడ 'ఫినిష్' పౌడరద్దనివ్వు'...

'అవన్నీ—ఎవరు చూడొచ్చారు. టిక్కెట్టు డ్రామా వేస్తున్నామా ఏమిటి? ముందు ఈ తుపాకిరాముడికి పౌడరు అట్టేపెట్టు — పైపైన...అక్కడ అసలు తీరికలేదు.' అంటూ పదిహేను సంవత్సరాల కుర్రవాణ్ణి ముందుకు నెట్టాడు. అతను సిగ్గుతో మరింత వెనక్కి పోసాగాడు.

'ఎవరూ?...భాస్కరా?... రా...రా...ఈ వేషమెప్పుడు నేర్చుకొన్నావ్!...అయితే ఇదే ఫస్టు వెయటమా' అంది శారద, అతనిని ఆప్యాయంగా దగ్గరకు తీసికొంటూ.

'ఆ...చాలు శారదా...చాల బాగుంది... ఆతరువాత—ఆ భరతమాత నృత్యంవాళ్ళు తయారయ్యారా...అయితే ముందే వాళ్ళది పెట్టిస్తే ఇంప్రెసివ్‌గా ఉంటుంది— తరువాత భాస్కర్...'

'అలానా...వన్‌మినిట్' అంటూ కళ్ళు తిప్పి భారతమాతగా అలంకరించుకొన్న ఆ అమ్మాయి చేతిలో త్రివర్ణపతాకాన్ని పెట్టి, కురులన్నీ భుజాలమీదుగా వాలిపోయ్యేలా విప్పి సర్దికట్టింది.

'అయిపోయింది—వీళ్ళందర్నీ తీసికెళ్ళు'

'సరే...తరువాత ఐటమ్ రెడీచెయ్యి— క్విక్...రా—భాస్కర్ — ఏది నీ తుపాకి తెచ్చుకో—' అంటూ వాళ్ళందరినీ వెంటబెట్టుకొని రంగస్థలంవైపు నడిచాడు.

'ఊర్మిళా...పిన్నులెక్కడ పెట్టారు— అబ్బబ్బ—ఇక్కడ పెట్టినవి ఎవరుతీశారు.' అంతా రద్దీగా ఉంది. ముస్తాబు చూసికొని మురిసిపోయి నవ్వుకుంటూన్న అమ్మాయిలు. వాళ్ళ ముస్తాబులో మంచీ చెడులను విమర్శిస్తూన్నవాళ్ళు కొందరు—ఇక అద్దానికి తీరికలేదు—అందరి ముఖాలలోకీ తొంగి చూడలేక విసుగుపుడుతోంది దానికి. కొందరు గోడప్రక్కకు తిరిగి వాళ్ళనే ప్రేక్షకులుగా భావించి లోలోన మననం చేసికొంటూ హావభావాలు చూపుతున్నారు.

'హుష్...అబ్బబ్బ... ఏమిటి శారదా !', తలలుదువ్వి— తీరుతీరు కొప్పులు ముడుస్తోన్న ఊర్మిళ అంది—

'పిన్నులు'...శారద అడిగింది మరోసారి.

'ఏయ్...ఏమిటాగోల—ఏమిటిశారదా?... పిన్నులా?...ఇవిగో' అంటూ ఆ పాకెట్ అందించింది.

'ఆ...సరే...మరి ఈ పిల్లకు కాలేజీ విద్యార్థి 'మేకప్' చెయ్యాలి. ఊర్మిళా? అంతా అయిపోయింది— కానీ 'సై' 'గ గుల్స్' కావాలిట—ముందుగా ఎందుకు జ్ఞాపకం చెయ్యలేదు—ఎవరికి కావాల్సినవి వాళ్ళనే తెచ్చుకోమంటిమి కదా?'...

'చెప్పారండీ...కానీ మన ఊళ్ళో ఎక్కడ దొరుకుతాయండీ' ఇన్‌షర్ట్‌లో ఉన్న ఆ అమ్మాయి అతిజాలిగా ముఖ కవళికలు మార్చుకొని చెప్పింది.

'మరి పగలు మా ఇంటికొచ్చినప్పుడెందుకు చెప్పలేదు'

'లేదండీ ఎక్కడా దొరక్కపోతే మీకు అప్పుడు చెప్పవచ్చునని ఊరుకొన్నానండీ'.. ఆ మాటలు పలుకుతూన్న అమ్మాయి ముఖంలోని అమాయికతకు కంఠంలో వినయానికీ శారద ముచ్చటపడిపోయింది. అంతకు ముందు చూపెట్టిన విసుగు — కోపం ఇట్టే మాయమయి పోయ్యాయి.

'ఊర్మిళా!... ప్రసాద్‌ని రమ్మని పిలువు'

రెండు నిముషాలకు ప్రసాద్ దర్శనమిచ్చాడు. 'ఏమిటి — అయిందా?...అనౌన్స్ చెయ్యమంటారా?' అంటూ విసురుగా ప్రవేశించాడు.

'అప్పుడే కాదు ఈ కాలేజీ విద్యార్థిని చూశావా?'

'ఓహో ... అమ్మాయిని అబ్బాయిగా తయారు చేశావ్? ...మరి ఈ అబ్బాయికి తోడు. అమ్మాయిగా మారిన అబ్బాయా?...'

అందరూ పెద్దగా నవ్వారు. మళ్ళీ ఎవరి ధ్యాసలో వాళ్ళు మునిగిపోయ్యారు. పెట్రొమాక్సు లైటు మసకమసకగా వెలగసాగింది. దాని చెంతనే శారద వంగి కూర్చుని చేతిమీద- రంగు కలుపుతోంది. ఆ లైటు వేడికి ఆమె నొసటి పై ముత్యాల్లా చెమట బిందువులు మొలచి తళుక్కుమంటున్నాయి. అతను ఆమె ప్రక్కగా అమ్మాయిల మధ్య కొంగి పెట్రొమాక్స్ లైటును అందుకోబొయ్యాడు. కానీ అది అందుబాటులో లేక పోయింది.

'శారదా! కొద్దిగా ప్రక్కకు జరుగుతావా?...దీన్ని కొద్దిగా 'పిన్'జేస్తాను.'



అది గ్రీన్‌రూమ్. మడిగట్టుకొని మైలబడి పోతామనుకొనే శిష్టాచారాలు అక్కడ కుదరవు — రైల్వేస్టేషను కన్నా అధ్వాన్నంగా రాసుకొని పూసికొని తిరుగుతారు. ఊడిపొయ్యే మీసాలకు గమ్ము రాసుకోటానికి పరుగెత్తేవాళ్ళూ—విగ్గు సరిగా ఉందో లేదోనని అద్దం కోసం పరుగెత్తేవాళ్ళూ—పక్క చూపులతో అద్దానికి విశ్రాంతి నివ్వని వాళ్ళూ—సబ్బుతో ముఖం కడుక్కునే వాళ్ళూ—పోర్షన్ జ్ఞాపకం చేసికొనే వాళ్ళూ — దుస్తులు మార్చుకొనే వాళ్ళూ— వచ్చేవాళ్ళూ — పొయ్యేవాళ్ళతో నానాజాతి సమితిలా ఉండే ఆ గదిలో కూడ ప్రసాద్ మర్యాద పాటిస్తూ తన అనుమతి కోరటం శారదకు ఆశ్చర్యమనిపించింది. ఆ ఆ పనుల తొందరలో ఎవరెవర్ని రాసుకుంటూ పోయినా ఎవరూ పట్టించుకోరు —ఏమీ అనరు. అలాంటి పరిస్థితులలో ఏదో మిషలో అవకాశం కల్పించుకొని వెర్రి మొర్రి వేషాలు వేసే బుద్ధిమంతులు కూడ తటస్థిస్తారు..

ఓ నిముషం పరాగ్గా ఆలోచించి ప్రక్కకు జరిగి ఆ లైటుని తీసికొనే వీలు కలుగచేసింది. మగవాడి పాత్రధారియైన ఆ అమ్మాయికి నల్ల సిరాతో మీసాలువేస్తూ చిన్నస్థాయిలో పలికింది.

'ప్రసాద్ ... మగపిల్లలను చూడగానే అమ్మాయిలు సహజమైన సిగ్గుతో వినయంతో తలవంచుకొని వెళ్ళిపోతారు. అందువల్లనే అబ్బాయిలు వేళాకోళాలాడుకొంటూ వెంబడిస్తారు ... పుట్టుకతోనే మగపిల్లలు 'ఎగ్రెసివ్'...ఆ మాటను ఇంగ్లీషులో పలికి మళ్ళీ తెలుగులో మాట్లాడింది.

మట్టిబొమ్మలు

'కానీ కొంతమంది మగపిల్లలుంటారు ప్రసాద్...అమ్మాయిలు ఎదురొస్తే సరి, భయపడి అతివినయంగా తలవంచుకొని వెళ్ళిపోతారు...అలాంటి వాళ్ళకు పరికిణీ, ఓణీ వేస్తే చాలు...చక్కగా 'యాక్ట్'చేస్తారు... ఈలాటి అబ్బాయిల ప్రక్క...' అంటూ ఆ అమ్మాయి జడను తలపై కుప్పగా పెట్టి దానిమీద 'ఈవినింగ్ కేప్' పెట్టింది.

'ఎలా ఉంది?' ఆమె ప్రశ్నించింది.


అతని దృష్టంతా ఆ పెట్రోమాక్స్ దీపంపై బడింది. రెండుసార్లు వెనక్కీ ముందుకూ తిప్పి 'పిన్'చేశాడు. ఒకకాలితో దాన్ని అదిమిపట్టి గాలికొట్టాడు. అప్పుడది మరింత ప్రకాశవంతంగా వెలిగింది.

'ఏమిటి శారదా? ... ఏమి కావాలి?' అంటూ గ్యాస్‌లైటు వాళ్ళముందు పెట్టాడు.

'ఇంకొక గంటకు ఆడుగు ... నేనేం చెప్పాను'...ఆమె నటిస్తూన్న కోపంతో పలికింది.

'ఏమి చెప్పావ్? — 'పిన్' చెయ్యటంలో నేను వినిపించుకోలేదు శారదా,' చిరునవ్వుతో క్షమాపణ కోరుతూన్న ధోరణిలో అడిగాడు. ఆమె అతనికేసి చూసి జాలిగా నవ్వింది.

'ఈ అమ్మాయికి 'నెక్‌లైట్'... గాగుల్స్ కావాలి...ఎలా...సైకిల్ మీద వెళ్ళి పట్రా.'



'పంపేశావ్...నేవెళ్తే ఎలా?'

'అయితే మరి భానూని పంపు.'

'భానూ—మనకు 'టీ' తీసుకు రావటానికి వెళ్ళింది...భాస్కర్‌ని ఇప్పుడే మాష్టారు శాలువా తీసికురమ్మని పంపారు... కొద్దిగా ముందు చెప్పకూడదూ? ఊఁ సరే ఎవరినైనా పంపిస్తాలే...అయితే ఇంకా ఈ 'ఐటమ్'కు ఆలస్యముందన్నమాట' అంటూ ఓమారు అద్దంలోకి చూసికొని బయటి కెళ్ళిపోయాడు.

'పదినిముషాలు గడిచాయి. తలుపు తట్టిన శబ్దమైంది.

'అబ్బబ్బ — ఎవరూ ? ... చూడు ఊర్మిళా ?'...శారద అంది.

'నేను'...సున్నితంగా మెల్లగా అవతల నుండి జవాబు.

'నేనంటే... పేరులేదా? .. పనీ పాటా లేని మనుషులు' అంటూ తలుపు తీసిన ఊర్మిళ నాలిక కరచుకొంది. చారల చారల పైజామా...అంటిదే పొడుగు చేతుల చొక్కా— రాత్రి దుస్తులు ధరించిన నవనాగరికుడు. ఉజ్వలమైన ఆ దీపకాంతిలో మెరిసిపోతున్నాడు. ఊర్మిళ సిగ్గుపడ సాగింది అతన్నిచూసి. శారదకళ్ళు కుంచించుకుపొయ్యాయి. అతని రాకకు అందరూ విస్తుపొయ్యారు. అతను సరాసరి శారద వద్దకొచ్చి నిలబడి కొంటెగాచూస్తూ చిరునవ్వు చిందించాడు—మాటాపలుకూలేకుండ.

'ఏమండీ... మీరు 'లైట్'— గాగుల్స్ కావాలన్నారుట...ప్రసాద్ చెప్పాడు. ఇవిగో' అంటూ 'పఫ్' ప్రక్కనేపెట్టాడు.

'ఓ...థాంక్స్...చీకట్లో చాలా శ్రమపడి ఉంటారు.'

'నో మెన్షన్...ఇందులో పెద్ద శ్రమేమిటి?'...కష్టపడి మీరు మేకప్‌చేస్తూంటే ఆమాత్రం చిన్నచిన్నపనులు కూడ చెయ్యక పోతే'... అన్నాడు.

అతని మాటలు లక్ష్యపెట్టక శారద రంగులువెయటంలో నిమగ్నురాలయిపోయింది. అతని కళ్ళు ముస్తాబవుతూన్న అమ్మాయిల పైన ఓనిముషం—రెండోనిముషంలో శారదపై తిరుగుతున్నాయి. సన్నని పొడుగాటి ఆమెవేళ్ళు సున్నితంగా రంగులు రంగరిస్తున్నాయి. ముందుకు వంగటంవలన బిగుతుగా కట్టుకొన్న వక్షస్థలం ఒక్కింత పొంగింది— నుదుటిపై పడుతూన్న ముంగురు



మట్టి బొమ్మలు

లను ముంజేతితో వెనక్కి నెట్టుకొంది. రవిక క్రింద ఏలుచని ముడతలుపడిన ఆమె ఉదరభాగం కోమలంగా ఉంది.

అతని చూపులు తనచుట్టూ పరిభ్రమిస్తున్నాయని గ్రహించిన శారదలేచి నిలబడి పమిట సరిచేసికొంది. కోపంగా అతనికేసి చూస్తూ 'మధుగారూ?... ఈ 'టై' ముడివేసి మీరు వెళ్లండి......ఎలానో తలమీదుగా దూర్చుతాను...పాపం మీరు ఎంతసేపని నిలబడతారు—'వెక్కిరింత ప్రతిధ్వనిస్తున్న కంఠంతో అంది. ఆ వ్యంగ్య పరిహాసాన్ని గుర్తించి అతను సరియైన సమాధానాన్ని వెతుక్కున్నాడు...'నిలబడటం నాకేం బాధలేదు. నేనుండటం మీకు అభ్యంతరమయితే వెళ్ళిపోతాను.' మాటల్లో సభ్యతకన్న కాఠిన్యత ఎక్కువగా ద్యోతకమైంది. ముడివేసిన 'టై'ని శారదచేతిలో పెడుతూ దాన్ని ఏవిధంగా 'లూజ్' చెయ్యాలో చూపెట్టాడు.

'సరే...నాకది ఇలా ఇచ్చి...అటు ఊర్మిళ దగ్గరకెళ్ళి సహాయపడండి' అంటూ అటుకేసి చూపెట్టింది. సిగ్గుతో కృంగిపోతూన్న ఊర్మిళ 'నావద్దకెందుకన్నట్టు' ఓ వక్రచూపు శారదపైకి విసిరింది. ప్రసాద్ ఆ గదిలోకి అనేకసార్లు వచ్చాడు. కానీ అతని సమక్షంలో ఎవరికీ ఏ సంకోచమూ, ఏ భావమూ కలుగలేదు—కానీ ఈ రెండవ వ్యక్తి సమ్ముఖంలో అమ్మాయిలందరూ బిడియపడిపోసాగారు. ఆ పరిస్థితి గమనించిన శారద అతనికి బయటికి వెళ్లమని ఖండితంగా చెప్పాలనుకొని కూడ ధైర్యంలేక వెనుకాడసాగింది.

యువతీ పరివారంలో తనపట్ల కల్గిన నిరసనభావాన్ని అతను గ్రహించకపోలేదు. కానీ ఆస్థలం విడిచిపెట్ట బుద్ధికావటం లేదు—ఏదైనా పని పురమాయిస్తే ఆంజనేయస్వామి సంజీవికొండ తెచ్చినట్లు తెచ్చి వాళ్ళ మెప్పు పొందాలని అతను ఉబలాటపడసాగాడు.

ప్రసాద్ వెలిగించిన పెట్రోమాక్స్‌దీపం అతని కళ్ళలో బడింది. వారిమధ్యకు వంగి దాని తీగె పట్టుకొని దానిని అందుకొన్నాడు. పరిపూర్ణ యవ్వనంలోనున్న పడతి వాల్గంటి చూపుల్లా తీక్షణమై మిరుమిట్లు కొలుపుతోంది కాంతి. రెండుచేతులతోనూ దాని అడుగుపాదవి పట్టుకొని పరీక్షగా చూశాడు. తెల్లగా స్వచ్ఛమైన 'మాంటిల్' నిష్కళంకంగా ఉంది.

'ఎన్నిసార్లు గాలికొట్టినా ఇంతే...ఎలక్ట్రిసిటీ లేకపోతే ఇంతే చావు' అంటూ విసురుగా గాలికొట్టడం మొదలెట్టాడు. 'మాంటిల్' కదిలి సగం రాలిపోయి వేలాడసాగింది. మంటలు మండుకోసాగాయి—గప్పు—గప్పున.

'అమ్మో'...అమ్మాయిలు వెనక్కి పరుగెత్తారు. శారద కళ్ళల్లో ఆ మంటలు ప్రతిఫలించసాగాయి. ఊర్మిళ దిగ్భ్రమ చెందింది. కొద్ది క్షణాల్లో ఆగిపోయ్యే రోగి గుండెలా ఊగిసలాడుతోంది మాంటిల్. సగం రాలిన వత్తితో సతమతమైపోసాగింది గుడ్డిగుడ్డిగా దీపం. అతను 'పిన్' చేశాడు. మంటలాగిపొయ్యాయి.

'తలుపు తియ్యండి...దభదభమని తలుపు కొడుతూన్న శబ్దం.

'నేను ప్రసాద్‌ని...తలుపు తియ్యండి'...

తలుపులు తెరచుకొన్నాయి. నీరసంగా వెలుగుతూన్న గుడ్డిదీపం వెలుగులో—గడపవద్ద ప్రసాద్—అతని ముఖం వెలవెలాబోయింది. అతను మళ్ళీ పిన్ చేశాడు. వ్యధిత స్వరంతో 'ఆగు—ఆగు' అని అరిచాడు ప్రసాద్. మంటలారిపొయ్యాయి—మాంటిల్ రాలిపోయింది. లోనికి రావటానికి ప్రయత్నించి ఒకడుగువేసి ఆగిపోయ్యాడు.

అంతా చీకటి—గదంతా చీకటి నిండుకొంది. ఆడదాని మనసులాంటి చీకటి. ఆచీకటిలో తలుపు మూసికొన్న చప్పుడు. చీకటికి భయపడి ఎక్కడివాళ్ళు అక్కడ్నే నిలబడిపొయ్యారు ఒక్కక్షణం—ఆతరువాత చీకటి ముసుగులో కదలికలు—

చీకటి—చక్కని చీకటి.

ఆశలకు పురికొలిపే అంధకారం.

కోరికలను రెచ్చగొట్టే తిమిరం.

ఆత్మకు—ఆలోచనలకు అవకాశమివ్వని నిశీధం.

వాళ్ళందరూ చీకట్లో కదులుతున్నారు. గుడ్డివాళ్ళలా చేతులతో తడిమి మార్గాన్ని వెదుక్కొంటున్నారు. టేబిల్‌నుండి ఏదో

డబ్బాలాంటి వస్తువు క్రిందపడిన శబ్దం.

'ఓహో...నీవా...శారదా?' చిన్నగా అతని కంఠం పలికింది.

'ప్రసాద్......ప్రసాద్'......వణకుతూన్న శారద కంఠం.

'ఏమయింది— శారదా?' ... ఊర్మిళ కంఠంలో ఆతురత.

'నేను అగ్గిపెట్టె తెస్తానుండండి··· వాకిలితేనా ఊర్మిళా' ... తప్పుడుకొంటలా న్నట్లు అతని కంఠం.

తలుపులు తెరచుకొన్నాయి. చేతిలాంతరొకటి తీసికొని 'ప్రసాద్'వచ్చాడు. వెలుగు చూడటంతో అందరి మనస్సులో ధైర్యం నిండుకొంది.

'మేకప్ అంతా అయిపోయినట్లేనా శారదా?...లేక 'లైట్' అవసరమా?... ఇంకొక 'హ్యాంటిల్' తెచ్చి ముట్టించనా?... ప్రసాద్ అడిగాడు.

'ఇలా గాలి కొడదామని కదిలించానో లేదో...రాలిపోయింది'...అతనన్నాడు.

'పోతే పోయిందిలే ... మేకప్ అయితే పూర్తిగా అయినట్లేగా'...శారదకేసి తిరిగాడు ప్రసాద్.

శారద 'లైటు' కనిపించేసరికి తత్తరపాటును నిగ్రహించుకోసాగింది. అతను తన ముఖభావాలను గ్రహించకుండ చూపు ప్రక్కకు తిప్పుకొని '...నీవు రాకపోతే...ఈ చీకట్లో' అంటూ మాట పూర్తిచెయ్యకుండ రంగు తుడుచుకోసాగింది.

'అదేమిటి శారదా...అందరికీ వెయ్యి... ఈ 'లైటు' చాలదనుకొంటే స్టేజిలో నుండి ఇంకొక పెట్రోమాక్స్ తెస్తాను'... ప్రసాద్ అన్నాడు.

'అక్కర్లేదు... ప్రసాద్...అంతా అయిపోయింది ... ఈ ముగ్గురే మిగిలింది— వీళ్ళకు పౌడరద్దితే సరిపోతుంది ... పద ఊర్మిళా ... అంతా ... సర్దండి ... ప్రసాద్ వస్తువులన్నీ జాగ్రత్తగా చూసుకో ... ఈలోగా నేను వీళ్ళకు పౌడరద్దుతా' అంటూ వాళ్ళకు పైపైన పౌడరద్దసాగింది.

పని ముగించుకొని పది నిముషాల్లో అందరూ బయటికి నడిచారు.

(ఇంకా వుంది)

మహీధర నళినీమోహన్


కుజగ్రహంలో కాలువలు

1938వ సంవత్సరం అక్టోబరు 31వ తేదీ సాయంకాలం అమెరికాలో రేడియోలో ఒక భయంకరమైన వార్త వినిపించింది. 'కుజగ్రహం నుంచి భయంకరమైన విచిత్ర జంతువులు కొన్ని భూమిమీదకి దండెత్తి వచ్చాయి...!' ఆ వింత జీవుల ఆకార వర్ణన, వాళ్ళు యూరపులో దిగి 'మృత్యు కిరణాలు ఉపయోగించి లక్షలాది జనాన్ని ఎల్లాగ కాల్చి చంపేస్తున్నారో, వందల కొద్దీ పట్టణాలు ఎలా దగ్ధమై పోతున్నాయో వివరంగా రేడియోలో వినవచ్చింది.' ఆఖరికి ఆ జీవులు అమెరికా ఖండం మీద కూడా కాలుమోపేయి! త్వరలో ప్రమాదం ముంచుకు వస్తోంది! వాళ్ళ మారణాయుధాల నుంచి తప్పించుకునే సాధనం కనబడడంలేదు!...' ఈ విధంగా భయ గంభీరమైన కంఠం రేడియోలో వినవస్తూ ఉంటే, లక్షలాది అమెరికనులు అది నిజమే అనుకుని హడలిపోయారు. కొందరు తలుపులు బిగించుకుని, బల్లలు కుర్చీలు తలుపుల వెనుక అడ్డంగా పెట్టేరు! కొందరు ఇళ్ళు విడిచి అడవులలోకి పారిపోవడానికి గబగబా సన్నాహాలు చేసుకున్నారు. అంతలో వాషింగ్టన్ నగరంలో ఏదో లోపం వల్ల హఠాత్తుగా విద్యుచ్ఛక్తి సరఫరా ఆగిపోయింది. దానితో కుజగ్రహవాసులు పట్టణంలో ప్రవేశించేశారని అనుకున్నారు. పట్టణం పట్టణం అంతా భయ విహ్వలమైపోయిందిట. కొందరు ధైర్యవంతులు పోలీసుస్టేనుకి ఫోనుచేసి తాము యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారుట...

ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆ సావిడి ఇంత గందరగోళం జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. ప్రసిద్ధ రచయిత 'వెల్స్' వ్రాసిన పుస్తకం ఆధారంగా తయారు చేసిన చిన్న నాటకం అది. ఆ సంగతి ముందుగా తెలియజెప్పక పోవడంతో ఇంతగా భయోద్రేకాలకు కారణమైంది.

ఇది జరిగి పట్టుమని పాతికేళ్ళు కాలేదు. అందులోనూ అమెరికాలాంటి విజ్ఞాన సంపన్నమనుకునే దేశంలో కుజగ్రహంలో మనుష్యుల కన్న తెలివైన జీవులు నివసిస్తున్నాయనీ, అవి సైన్సును బాగా అభివృద్ధి చేసి, గ్రహాంతర యానాలు అవలీలగా చేయడం నేర్చుకుని మనం కనీ వినీ ఎరుగని మారణాయుధాలు తయారుచేసుకుని, ఇతర గ్రహాలమీదికి దండెత్తేటంత సాహసికులనీ...చిత్ర విచిత్రమైన భావాలు ప్రజలలో ఎంత ప్రగాఢంగా నాటుకుపోయాయో దీనినిబట్టి తెలుస్తోంది. పాశ్చాత్యదేశాలలో ఏ పుస్తకాల షాపులో చూచినా కుజగ్రహవాసులనుగురించిన కథల పుస్తకాలు రంగురంగుల భయంకరమైన బొమ్మలతో కనబడదాయి. అవి చదివిన ఆబాలగోపాలం పైవిధంగా భయపడడం సహజమే. కానీ ఈ కథలకు కొంత శాస్త్రీయ ప్రాతిపదికలేకపోలేదు.

నవగ్రహాలలోనూ కుజుడు నాలుగవవాడు. సూర్యుడినుంచి దీని సరాసరి దూరం 14,16,50,000 మైళ్ళు. ఇది భూమికన్న బాగా చిన్నగోళం. దీనివ్యాసం 4200 మైళ్ళు. భూమి దీనికన్నా ఘనపరిమాణంలో ఆరు రెట్లు, బరువులో తొమ్మిదిరెట్లు పెద్దది. భూమిమీద 150 పౌనుల బరువుండే మనిషి ఈ గ్రహంమీద నిలుచుంటే 57 పౌనులు మాత్రమే తూగుతాడు. ఈ గ్రహంలో రోజు మన భూమిమీదకన్న ఒక్క అరగంట మాత్రమే అధికం. అక్కడ సంవత్సరం మన 687 రోజులకు సమానం. ఈ గ్రహం సుమారు 2 సంవత్సరాల 45 రోజులకు ఒక్కొక్కసారి మన భూమికి దగ్గరగావస్తుంది. ఇది మనకు బహుసమీపంలోకి వచ్చినప్పుడు 3½ కోట్ల మైళ్ళ దూరంలోనూ, బహుదూరంగా పోయినప్పుడు 24.8 కోట్ల మైళ్ళ దూరంలోనూ ఉంటుంది. మనకు బహుసమీపంలోకి వచ్చినప్పుడు 70 రెట్లు పెద్దదిచేసే టెలిస్కోపు ఉపయోగించి చూస్తే కుజగ్రహం పూర్ణిమనాటి చంద్రబింబం అంత కనిపిస్తుంది. ఇది చూడడానికి ఎర్రగా కనిపిస్తుంది. ఆ కారణంచేతనే రోమనులు దీనిని యుద్ధాలకూ, వినాశాలకు అధిదేవతగా గ్రీకులు, వారిద్వారా పాశ్చాత్యులు భావించారు. దీనికే అంగారకగ్రహం అని మరో



పేరుంది. అమాటకు నిప్పు, బొగ్గు అని అర్థం ఆ గ్రహం ఎర్రగా ఉండడానికీ, ఈ పేరుకీ సంబంధం ఉందేమో.


గ్రహంలో చాలాభాగం ఎరుపు, నారింజ రంగులలో ఉంటుంది అది అంతా ఎడారి అక్కడక్కడ నల్లనిమచ్చలు కనబడుతాయి వాటికి పైజానిబట్టి సముద్రాలనీ, సరస్సులనీ, అఖాతాలనీ, సింధుశాఖలనీ పూర్వ సంప్రదాయాన్ననుసరించి పేర్లు పెట్టేరు కాని అవి సముద్రాలుకాదనీ, అక్కడ నీటికి కరువుగా ఉందనీ తరువాత తెలిసి వచ్చినా, ఆపేర్లు మటుక్కు అల్లాగే మిగిలిపోయాయి. గ్రహానికి ఉత్తర దక్షిణ ధృవాలదగ్గిర, ధగధగా మెరిసే రెండు తెల్లని టోపీలవంటివి కనబడతాయి ఆ టోపీలు శీతాకాలంలో పెద్దవి అయి, వేసవిరాగానే క్రమంగా క్షీణించి, ఆఖరికి పూర్తిగా అదృశ్యమైపోతాయి. ఆ తెల్లని టోపీలు మంచుగుట్టలు. గ్రహం మీద ఉన్న మొత్తం నీరు అంతా శీతాకాలంలో ధృవాల దగ్గర పేరుకుని, వేసవిలో కరిగి, పల్లంగా ఉన్న నల్లని మచ్చలలోకి ప్రవహిస్తుంది అక్కడి వేసవిలో ఉండే స్వల్ప ఉష్ణోగ్రతకే ఆ టోపీలు పూర్తిగా కరిగి మాయం అయి పోతున్నాయంటే ఆ మంచు దిబ్బల మందం కొద్ది అంగుళాలు మాత్రమే అయి ఉంటుంది.


ప్రతి ఏడూ ఈ 'సముద్రాలలో' ఒక విచిత్రం జరుగుతూ ఉంటుంది. వసంతం ప్రవేశించి ధృవములదగ్గిర పేరుకున్న మంచు కరగడం ప్రారంభించాక ఆ మచ్చలు మరింత నల్లగా అవుతాయి. ఆ నల్లబడడం గ్రహంమీద అన్ని సముద్రాలలోనూ ఒక్కసారిగా జరిగిపోదు. నల్లదనం కరుగుతున్న మంచు టోపీలదగ్గర బయలుదేరి క్రమక్రమంగా గ్రహ మధ్యరేఖా ప్రాంతందాకా వస్తుంది. రోజుకి సుమారు 50 మైళ్ల వేగంతో ఈ నల్లదనం ఎదరకు జరగడం గమనించవచ్చు. ఆ మచ్చలలో తరువాత రంగులు మారుతున్నట్లు కనిపిస్తుంది ముందర ముదురు ఆకు పచ్చరంగు. తరువాత పసుపు పచ్చగా, తరువాత గోధుమ వన్నెగా మారుతుంది. దీనికి కారణం ఆమచ్చలలో బయలుదేరుతున్న మొక్కలేనని శాస్త్రజ్ఞులు గ్రహించారు. ఆ గ్రహంమీద నీరు బహు స్వల్పంగాఉంది. ఆ నీరు అంతా శీతాకాలంలో ధృవములదగ్గిర పేరుకుంటుంది. వేసవిరాగానే ఆ మంచు కరిగి, నీరు పల్లంగాఉన్న మచ్చలలోకి ప్రవహిస్తుంది. ఆ నీరు అందుకనే అక్కడ మొక్కలు బయలుదేరుతాయి. మళ్లీ శీతాకాలం రాగానే ఆ మొక్కలు చచ్చిపోతాయి. (లేదా సమాధిస్థితిలో ఉంటాయి.)

కుజగ్రహానికి వాతావరణం స్వల్పంగా ఉంది. గ్రహాలన్నింటికీ వాతావరణం ఉండదు. బరువైన పెద్ద గ్రహాలకు వాతావరణం ఉంటుంది. చిన్న గ్రహాలకు ఉండదు. కుజ గ్రహం భూమికన్న చిన్నది కనుక దాని వాతావరణం భూమికి ఉన్నంత దట్టంగా ఉండదు. భూమికి 11 మైళ్ల ఎత్తున వాతావరణం ఎల్లా ఉంటుందో కుజగ్రహం మీద ప్రస్తుతం అల్లా ఉంటుంది. అక్కడ ప్రాణవాయువు, నీటిఆవిరి స్వల్పాతిస్వల్పంగా ఉన్నాయి. భూమిమీద మనకు తెలిసిన జంతువులేవీ ఇంత తక్కువ ఒత్తిడి ఉన్న గాలిలో బ్రతుకలేవు. కాని, ఆ పరిస్థితులకు అనుగుణమైన అవయవనిర్మాణం ఉన్న జీవులు అక్కడ నివసిస్తూ ఉండి ఉండవచ్చునుకదా! కనుక అక్కడి జీవులు మన భూమిమీది జీవులనే పోలి ఉండాలని ఏమీలేదు. పోలికలు ఉంటేనే ఆశ్చర్యపడాలి. ఆ గ్రహంమీద ఉష్ణోగ్రత $70^{\circ}C$ నుంచి $+25^{\circ}C$ వరకూ మారుతూ ఉంటుంది. ఈ ఉష్ణోగ్రతలో జీవులు బ్రతుకలేకపోవు.

1877 లో ఈ గ్రహం భూమికి అత్యంత సమీపంలోకి వచ్చినప్పుడు ప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞుడు 'షియాపరెల్లీ' ఆ గ్రహాన్ని గూర్చి తీవ్ర పరిశోధనలు జరిపేడు. ఒకనాటిరాత్రి ఆ గ్రహాన్ని పరిశీలిస్తూ ఉండగా రెండు నల్లని మచ్చలను కలుపుతూ సన్నని తిన్నని గీతఒకటి కనిపించింది. కళ్లునులుముకుని చూడగా అటువంటివే గీతలు మరికొన్ని కనిపించాయి. అవి అన్నీ బహు సన్నంగా, రూళ్ల కర్రతో గీసినట్లు తిన్నగా కనబడ్డాయి. అన్నీ కూడా నల్లని మచ్చలను కలుపుతూ ఉన్నాయి. అవి అన్నీ ఉన్నాయాలేవా అన్నంత స్పష్టాస్పష్టంగా ఉన్నాయి. వాటికి ఆయన 'కాలువలు' అని పేరు పెట్టేడు. ఆ కాలువలలో కొన్ని ఉన్నట్లుండి హఠాత్తుగా జంట కాలువలుగా మారిపోయి కనిపించేవి! నిన్నటి రోజున ఆ స్థలంలో ఒకేఒక కాలువ కనిపించింది. ఈ రోజున అదే స్థలంలో రెండు కాలువలు— అచ్చంగా రైలు బద్దలలాగ సమాంతరంగా — కనిపించాయి! ఆ కాలువలలో ఒక పద్ధతి నియమము ఉన్నట్లు తోచింది. వేలకొద్దీ మైళ్ల పొడవున తిన్నని సన్నని రేఖలు ప్రకృతిలో వాటంతట అవి ఎందుకు ఏర్పడతాయి? అవి కాలువలే అయితే వాటిని ఎవరు తవ్వేరు? తవ్వడం అనగానే తెలివైన జీవుల పని అయి ఉండాలిసిందే. అంటే కుజగ్రహం

(38 వ పేజీ చూడండి)






బంగారమ్మగారి బొంబాయి యాత్ర

బంగారమ్మగారు భలే మనిషి. ఆమెకు తెలియనివాళ్ళు ఆ ఊళ్ళోనే లేరని ఢంకా విూద దెబ్బకొట్టి చెబుతుంది. అంతా కలిపి ఓ వెయ్యి జనాభాగల ఆపల్లెలో బంగారమ్మగారి భర్త శీతారామయ్యగారు ఏకోపాధ్యాయ పాఠశాల ప్రైవేటుగా నడిపి ఏదో ఓ పది ఎకరాల పొలం గడించారు. తమ ఏకైకపుత్రిక శ్యామసుందరిని అల్లారుముద్దుగా పెంచి ఓ శ్రీమంతులబిడ్డ శ్రీనివాస్ చేతిలోపెట్టారు. ఆ ముహూర్తఫలమేమో గానీ అమ్మాయి అమ్మగారింట్లో ఆరుసంవత్సరాలు అలాగే ఉంది. బంగారమ్మగారికి ఖంగారయింది కానీ శీతారామయ్యగారికి చీమకుట్టినట్లైనాలేదు. ఓ శుభముహూర్తాన అల్లుని ఆగమనం, అమ్మాయితో అమెరికా పయనం అంతా ఓ నెలరోజుల్లో జరిగిపోయింది.

తరువాత శీతారామయ్యగారికి జబ్బుచేసి మంచానపడ్డారు. ఉన్న ఒక్కగా నొక్క కూతురు ఈ దేశంలోనే లేదాయె, ఇటు భర్తేమో మంచానపడ్డాడు. బంగారమ్మగారు చాలా దిగులుపడింది. కానీ ఇరుగుపొరుగు వారి సహాయంతో, ఓదార్పు మాటలతో చాలా ధైర్యం తెచ్చుకునేది. శీతారామయ్యగారు ఉన్నట్లుండి ఓరోజు కన్నుమూశారు. ఈ విషయం శ్యామసుందరికి తెలిసేటప్పటికి నెలరోజులుపట్టింది. ఏకారణంవల్లో వీలుపడలేదేమో కానీ శ్రీనివాస్, శ్యామసుందరిలు అంతదూరంనుండి సమయానికి రాలేకపోయారు. తన విచారాన్ని తెలియపరుస్తూ శ్రీనివాస్, తండ్రిపోయినందుకు తన దుఃఖాన్నంతా వెల్లడిస్తూ శ్యామసుందరి ఉత్తరాలు రాశారు. చుట్టాలు, పక్కాలు కార్యనిర్వహణచేసి మాట దక్కించుకున్నారు.

శీతారామయ్యగారుపోయిన తరువాత బంగారమ్మగారు మరీ దిగజారిపోయారు. ఆమె ఈ శోకంలోనే ఉండగా ఆమె ఇల్లు పొలం చూసి తమ పిల్లలనేమైనా పెంచుకుంటుందేమోనని పిల్లలుగల తల్లిదండ్రులు రాసాగారు. వాళ్ళు తన డబ్బుకోసమే వస్తున్నారన్నసంగతి గ్రహించిన బంగారమ్మ అసలు తనకు పిల్లవాడిని దత్తుచేసుకునే ఆలోచనే లేదని అందర్నీ త్రిప్పిపంపింది. దత్తు చేసుకోవడంవలన ఉపయోగంలేదని కూతురుకు కొడుకు పుడితే వాడే ఆస్తికి వారసుడవుతాడని అందరికీ చెప్పింది. ఇదంతా గతం.

ప్రస్తుతం బంగారమ్మగారు చాలా గట్టి మనిషి. ప్రతి నయాపైస తూచి తూచి వాడుతుంది. రెండు ధోవతులతో, అన్నంలోకి ఒకటో అరో ఆధరువుతో కాలం వెళ్ళబుచ్చుతున్నది. ఉన్నట్లుండి ఒకరోజున బంగారమ్మగారికి అత్యానందకరమైన వార్త ఒకటి తెలిసింది. అల్లుడికి బొంబాయిలో ఉద్యోగం అయిందని, వారంరోజుల్లో వస్తున్నారని తెలిసింది. తనకు ఉన్నది శ్యామసుందరి ఒక్కతే కనుక తననుకూడా తీసుకువెళ్ళడానికి వస్తున్నారేమో అనుకుంది బంగారమ్మ. ఆ ఆలోచనరాగానే బంగారమ్మగారి ఆనందానికి అవధులు లేకపోయింది. కానీ కొంత ఆలోచన చేసినమీదట కొన్ని అనుమానాలు కలిగినవి. అల్లుడు పట్టుమని పదిరోజులన్నా తమఇంట్లో ఉండలేదు. ఇప్పుడు ఇంత ఆదరంగా ఉండటానికి కారణం తను ఎవరినైనా దత్తుచేసికుంటే



ఆస్తిపోతుందన్న కారణమేమో అనిపించింది. కొంతకాలం బాగా చూసుకుని ఆస్తి కాజేసి తిరిగి పంపుతారేమోనన్న అనుమానం కూడా వచ్చింది బంగారమ్మగారికి. శ్యామసుందరి మనసున మెదిలేసరికి ఈ ఆలోచనలన్నీ మాయమై బొంబాయి ప్రయాణ సన్నాహాలలో మునిగిపోయింది. అసలు తనను తీసుకెళ్తారో లేదో అని అనుమానం వచ్చేది. అయినా వాళ్ళకుమాత్రం ఎవరున్నారు పెద్దదిక్కు. ఏదో నన్ను తీసుకెళితే పెద్దదాన్ని, ఇంట్లో ఉంటాను, వాళ్ళకు అండగా ఉంటాను, ఉత్తరంలో రాయకపోయినంత మాత్రాన తీసుకువెళ్ళరనేముంది అని తనను తానే సమాధానపరచుకొనేది. పోనీ ఈ ఊళ్ళోనే ఉందామా అన్న ఆలోచన కూడ వచ్చేది. ఎటూ తేల్చుకోలేక తికమకగా ఉంది బంగారమ్మ.

సీతారామయ్యగారి ముఖ్య స్నేహితుడయిన విశ్వనాథంగారి సలహా పొందుదామని వాళ్ళింటికి వెళ్ళింది. సంగతి వింటూనే ఆయన 'ఉన్నది ఒక్కగా నొక్క కూతురు. వాళ్ళు తీసుకెళ్తానంటే సంతోషంగా వెళ్ళక దీనికింత ఆలోచన ఎందుకమ్మా?' అని అన్నారు. అయితే తన నిర్ణయంలో పొరబాటేదీ లేదనీ, సరిగానే నిర్ణయించుకున్నానని అనుకుని, బయటికి 'అందుకే మీ సలహా పొందుదామని వచ్చానన్నయ్యగారూ, ఇక వస్తా'నని సెలవ తీసికొంది.

బంగారమ్మగారి బొంబాయి యాత్ర గురించి అప్పటికప్పుడే ఊరంతా పాకిపోయింది. చాలా అదృష్టవంతురాలనుకున్నారు కొంతమంది అతివలు. అల్లుడు, కూతురు ఎలా చూసుకుంటారోననే సంశయం వెలిబుచ్చారు మరికొందరు వనితలు. ఏకాయెకి బంగారమ్మదగ్గరికేవచ్చి తమ అభిప్రాయాలు వెల్లడించారు మరీ దగ్గరి పడతులు. ఎలాగయితేనేం ఆ ఊరిజనానికి బంగారమ్మగారి బొంబాయియాత్ర ఒక ప్రత్యేక ఆసక్తిదాయకమయింది.

విశ్వనాథంగారి భార్య పార్వతమ్మ చూసి వెళ్ళడానికి వచ్చింది. 'ఏం, అక్కయ్యా, ఎప్పుడు ప్రయాణం? అల్లుడు, కూతురు ఎప్పుడు వస్తారు?' అని అడిగి, 'పెద్ద పట్నానికి వెళుతున్నావుకదా, మరీ కొత్త ఫేషన్ అయిన బట్టలు లేకపోయినా నాలుగు కొత్త ధోవతులైనా ఉంటేగానీ సరిపోవు. కొన్నావా? లేదా? అంతా సర్దుకోవడం అయిందా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న పార్వతమ్మగారితో 'ముందు కాస్త మంచి నీళ్ళు తాగు పార్వతమ్మా, అసలే ఎండలోవచ్చావు. తీరికగా మాట్లాడుకుందాము' అని మంచినీళ్ళిచ్చి ఆదరించింది బంగారమ్మ.

'అయితే పార్వతమ్మా, నాకు ఉన్నవి రెండే ధోవతులు. నీకు తెలుసుగదా ఇవే



ఒకటి కట్టుకుని, ఒకటి ఉతికితే సరిపోదా' అన్నది.

'ఆదేమిటి బంగారమ్మా, అసలు బస్తీ చూసినట్లయితే నాలుగు ధోవతులు కూడా సరిపోవంటావు నీవు. అక్కడ అందరూ ఇస్త్రీలకు వేసుకుంటారు బట్టలు. ఇస్త్రీకి వేస్తే వారంరోజులకుగానీ తేదు. నీవు ఇస్త్రీ బట్టలు కట్టుకోకపోతే అంత పెద్ద హోదాలో ఉన్న నీ అల్లుడు, కూతురు చిన్నబుచ్చుకోరా. నీకు తప్పక మరో అరడజను ధోవతులైనా ఉండాలి' అని నొక్కివక్కాణించింది పార్వతమ్మ.

బంగారమ్మ పుట్టింది, పెరిగింది, మెట్టింది అన్నీ ఈ ఊరే అవడంతో ఆ ఊరు వదిలి ఎక్కడకూ ఎక్కువరోజులు వెళ్ళి ఉండలేదు. ఆమెకు ఇప్పటి వాగరికత, పట్నాలు, అక్కడి అలవాట్లు క్రొత్త, ఊహించలేని విషయాలు.

పార్వతమ్మ పుట్టిల్లు ఓ మాదిరి బస్తీ. తమ ఊళ్ళో చూడదగ్గ వింతలు, విశేషాలు అందరికీ చెబుతుంటుంది. 'అందర్నీ బస్తీ అలవాట్లు నేర్చుకోమని ప్రబోధిస్తుంటుంది. తను పొరపాటున పల్లెటూళ్ళో వచ్చి పడ్డానని భర్తనెప్పుడూ దెప్పుతుంటుంది. అందరికీ శుభ్రతను గూర్చి చెప్పడమేకాక ఎప్పుడూ నలిగని, ఇస్త్రీబట్టలే వేసుకుంటుంది పార్వతమ్మ. భర్తపోయిన తరువాత ఇస్త్రీకి బట్టలువేసే అలవాటే పోయింది బంగారమ్మకు. భర్తపోయినాక అసలు ఆ అలవాటే మానుకుంది. ఇప్పుడు కూతురు, అల్లుడుదగ్గర ఉండటానికైనా

బంగారమ్మగారి బొంబాయియాత్ర

తన అలవాట్లను మార్చుకోడానికి సిద్ధపడింది. పార్వతమ్మ సలహా చాలా ఉపయోగకరమని 'నీవుకూడా రా, ఇద్దరం కలిసి గుడ్డలు కొందాం' అని తోడు తీసుకెళ్ళి గుడ్డలకొట్లు మస్తానుదగ్గిర నాలుగు ధోవతులు, రాకరాక వస్తున్న అల్లుడుకు ఒక సూటుగుడ్డ, కూతురికి రెండు చీరెలు కొన్నది. అప్పటికిగాని బంగారమ్మగారి మనసు తృప్తిపడలేదు.

సాయంత్రం విశ్వనాధంగారు వచ్చారు. భార్య, బంగారమ్మకు ప్రయాణానికి తగినంత సహాయం చేస్తుండటంచూసి సంతోషపడ్డారు. 'బంగారమ్మా, ఇక్కడపుట్టి ఇక్కడే పెరిగినదానవు. నీవు బొంబాయి పోతే ఈ ఇల్లు ఎంత బోసిపోతుందో మాశావా, అసలు ఈ ఇల్లేమిటి ఈ ఊరే బోసిపోతుంద'న్నాడు విశ్వనాధం. ఇల్లు మాటనేసరికి బంగారమ్మగారికి తను ఊరు విడిచినతరువాత ఇంట్లో దీపం పెట్టడం కోసమైనా అదొకిర్పాలనుకుంది. వెంటనే ఆమాటే అనేసింది విశ్వనాధంతో. 'అవునమ్మా, నీవు చెప్పింది నిజమేను. కొత్తగా మన బడికి ఓపంతుల్నివేశారు. ఆయనరాగానే ఏదో కొంత అద్దెకు ఏర్పాటుచేస్తాను. తాళం చెవి మాకిచ్చివెళ్ళు. అద్దెకిచ్చిన తర్వాత ఉత్తరం రాస్తాను' అని ఆ బాధ్యత స్వీకరించారు.

అల్లుడు, కూతురు వచ్చేరోజు ఇంకా రెండురోజులుమాత్రమే ఉంది. ఈలోపల పనులన్నీ ముగించి సిద్ధమవాలని నిర్ణయించుకుంది.

తరతరాలనుండి వారి ఇంట పాడిఉంటూ వచ్చింది. ఇప్పుడు అన్నీపోగా ఒక్క ఆవు మాత్రమే ఉన్నది. మర్నాటి ఉదయమే పేరయ్యశాస్త్రిగారనే ఒక బ్రాహ్మణుడికి సరసమైన ధరకు విక్రయించింది. పాలేరు సోమప్పను పిలిపించి పొలమంతా మగతాకి మాట్లాడించి మిగతా డబ్బు బొంబాయికి పంపేట్లు ఏర్పాటు చేయించింది.

ఆరోజే అల్లుడు, కూతురు వస్తారు. వేకువజామున నాలుగుగంటలకే లేచి అన్ని పనులుచేసి తొమ్మిదింటికే వంటపూర్తిచేసి వేయికళ్ళతో ఎదురు చూడసాగింది. వాకిట్లో కారాగిన చప్పుడు శ్రీనివాస్, శ్యామసుందరిలు లోనికి వస్తున్నారు. ఆనందపరవశంలో తన వళ్ళు తానే మరిచింది బంగారమ్మ. త్వరత్వరగా కాళ్ళకి నీళ్ళు తెచ్చిచ్చింది. 'నాన్‌సెన్స్' అన్నాడు. శ్రీనివాస్ కాదు ఇప్పుడు పేరు మారింది. శ్రీస్. బంగారమ్మ ఆదేమీ పట్టించుకోకుండా ఆప్యాయంగా శ్యామసుందరిని దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంది. 'ఏం అమ్మా? మంచి ధోవతి లేదా? డర్టీగా ఉన్నదే. నా డ్రెస్ పాడవుతుంది. వదులమ్మా' అని తల్లిచేతుల్లోనుండి అవతలకు తప్పుకొంది శ్యామసుందరి.


బాత్‌రూమ్ లేదని, కూర్చోడానికి కుర్చీలు లేవని, టేబుల్ నిగాల్సకాదని నసిగి నసిగి సాయంత్రమే ప్రయాణమన్నాడు శ్రీనివాస్.

'ఏం నాయనా, పదిరోజులన్నా ఉండవా, ఇది మటుకు నీయిల్లుకాదా మీరుతప్ప ఎవరున్నారు నాకు' అంది బంగారమ్మ బతిమిలాడే ధోరణిలో.

'ఎవరికెక్కడ సుఖంగా ఉంటుందో వాళ్ళక్కడే ఉండటం మంచిది. ఆయిన కిక్కడ సుఖంగా లేకపోతే నేనుమాత్రం ఎందుకుంటాను' అని తానూ ప్రయాణమెంది శ్యామసుందరి. సరే 'ఇక నాదేముంది నాయనా. అంతా మీ యిష్టం. మీరేం చేయమంటే అది చేసేదాన్నేగదా నేను' అని సరిపెట్టుకుంది. ఎలాగు తను కూడా వాళ్ళతో ఉండబోయేదేకదా అని.

కారు తెచ్చాను సార్ అన్న డ్రైవరు మాటలు వింటూనే అల్లుడికి సూటు, కూతురుకు చీరెలు ఇప్పించింది. శ్రీనివాస్ కారులోకివెళ్ళి కూర్చున్నాడు. 'అమ్మా, నీవిక్కడైతే సుఖపడుతావు ఇక్కడే ఉండు. ఉత్తరాలు రాస్తుంటాన'ని తల్లికిచెప్పి కారులో కూర్చుంది శ్యామసుందరి.

చేతిలోని సంచీ క్రిందపడి, కళ్ళలోనుండి అశ్రుధారలు ప్రవహించుచుండగా నోరెళ్ళబెట్టి నిశ్చేష్టురాలై నిలిచిపోయింది బంగారమ్మ. ●



ఎన్నో రకాలు ఎన్నుకోవడానికి
రేడియోలు మరియు ట్రాన్సిస్టర్లు
రు. 125 లు మొదలుకొని వున్నాయి
మోడెల్ టిబి 0816
మోడెల్ టిబి 0581
మోడెల్ టిబి 0579
మోడెల్ టిబి 0509
మోడెల్ టిఎ/టియు 0777
మోడెల్ టిఎ 0926
మోడెల్ టిఎ/టియు 0202
మోడెల్ టిఎ/టియు 0776
మోడెల్ టిఎ/టియు 0824
మోడెల్ టిఎ 0366
వాటిని మీ స్నేహితుడైన మర్ఫీ డీలరు వద్ద యీరోజే చూడండి.
murphy మర్ఫీ మీ గృహానికి ఆనందాన్నిస్తుంది!
Murphy sets the standard

వారఫలం

16 6-1967 శుక్రవారం మొదలు
22 6-1967 గురువారం వరకు.

మేషం: ఏవ్యవహారంలోను విశేషమైన ఫలితాన్ని ఆశించడానికి అవకాశం లేదు. వ్యాపారంలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. ఉద్యోగంలో యితరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది. వారాంతంలో చికాకులు యేర్పడతాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

స్త్రీలకు— కుటుంబవ్యవహారాలు బాగానే ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం. ఫలితం మాట యెలాగ ఉన్నా, ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఇతరుల మీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలు ఫలించ గలవు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

మిధునం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. అధికారుల వలన జరుగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. సాటివారితో మాటపట్టింపులు తగవు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

కర్కాటకం: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారం మధ్యలో సామాన్యమైన పనులకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహిత్యకళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

సింహం: భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు వారం మధ్యలో లాభించగలవు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య: ఇదివరకు మీ కార్యక్రమాలలో యేర్పడిన ఆవరోధాలు తొలగిపోతాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు.

స్త్రీలకు— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

తుల: వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. రావలసిన డబ్బు వారాంతంలో అందగలదు. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాల్లో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కాగలదు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. నూతన విషయాలను తెలుసుకొంటారు.

ధనుస్సు వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారాంతంలో అధిక వ్యయం జరుగుతుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

మకరం: మీకు మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించ గలరు. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. వ్యాపారంలో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి రాజకీయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.


కుంభం· కొంతమంది వ్యక్తులు మిమ్మల్నినమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో మంచి పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. ఆర్థికవ్యవహారాలు ప్రోత్సాహ కరంగా ఉంటాయి.


స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడ తాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

మీనం: కొన్నిపనులు సులువుగా నెరవేరినా, మరి కొన్నింటిలో శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారాంతంలో అనుకూల పరిస్థితులు యేర్పడతాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. బంధు మిత్రులను కలుసుకొంటారు.

—మహేష్





(క) గుమాస్తాగిరీ:

ఒక పెద్ద వ్యాపారసంస్థ మూడు గుమాస్తా ఉద్యోగాలకోసం ఇంటర్వ్యూలు జరిపింది. ఆఖరికి ముగ్గురు యువకులను ఎన్నిక చేసింది. ఆ సంస్థ మేనేజరు ఆ ముగ్గురినీ ఉద్దేశించి ఇల్లా అన్నాడు.

'ప్రస్తుతం మీకు ఏడాదికి వెయ్యిరూపాయల చొప్పున జీతం ఇస్తాం. ఆ జీతాన్ని ఆరేసి నెలలకు ఒక్కొక్కసారి మీకు ఇస్తూ ఉంటాం. మీరు సంతృప్తికరంగా పని చేసినట్లైతే ముందు ముందు మీ జీతాలు పెంచుతాం. మా ఆఫీసులో రెండు పద్ధతులలో ఇంక్రిమెంట్లు ఇస్తూ ఉంటాం. ఏడాదికి 150 రూపాయల ఇంక్రిమెంటు గాని, ఆరు నెలలకు 50 రూపాయల ఇంక్రిమెంటుగాని. మీకు ఏ పద్ధతి కావాలంటే అదే ఇస్తాం - కోరుకోవచ్చు.'

ఆ యువకులలో ఇద్దరు తమకు ఏడాదికి 150రూ.ల ఇంక్రిమెంటే కావాలన్నారు ఆత్రంగా. మూడవ వ్యక్తి కొంచెం ఆలోచించి, రెండవ పద్ధతి ఎన్నుకున్నాడు. ఆ మేనేజరు వెంటనే మూడవ వ్యక్తిని మొదటి ఇద్దరికీ పై అధికారిగా నియమించాడు! దీనికి కారణం ఏమిటి? కంపెనీ సొమ్ము సాధ్యమైనంతవరకూ ఆదా చెయ్యాలన్న సదుద్దేశమూ, వినయమూ ఆ మూడవ వ్యక్తిలో చూచి, మేనేజరు అతడికి ఉన్నతోద్యోగం ఇచ్చాడా?

* * *

మెదడుకి మేత



డాక్టర్ మహీధర నళినీమోహన్




(చ) గంటకు 50 మైళ్ల వేగంతో వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఒకటి మద్రాసు నుంచి బెజవాడకు బయలుదేరింది. సరిగ్గా అదే సమయంలో గంటకు 10 మైళ్ల వేగంతో వెళ్లే గూడ్సు బండి ఒకటి బెజవాడ నుంచి మద్రాసుకి బయలుదేరింది. మధ్య దారిలో కలుసుకున్నప్పుడు ఆ రెండింటిలో ఏది మద్రాసు నుంచి ఎక్కువ దూరంలో ఉంటుంది?



(ట) టేబుల్ క్లాత్:

ఇక్కడి బొమ్మలో చూపిన ఆకారంలో మిగిలిపోయిన పెద్ద గుడ్డను వ్యర్థం



చేయటం ఇష్టంలేని పొదుపరి అయిన ఒకానొక ఇల్లాలు దానిని కత్తిరించి, నలుచదరపు టేబుల్ క్లాత్ చెయ్యాలనుకుంది. దీనిని మూడు ముక్కలుగా కత్తిరించి, (పిసరంత కూడా వ్యర్థం కాకుండా) జాగ్రత్తగా ఆ ముక్కలను అమర్చి నలుచదరంగా చేయగలిగింది. ఆ పని మీరు చేయగలరా?

* * *



(త) పద్నాలుగు:

కూడితే 14 వచ్చేలా ఐదు అగ్గిపుల్లలను అమర్చడం ఎల్లాగ?

జవాబులు


(క) ఆరు నెలలకు 50రూ. ఇంక్రిమెంటు కోరిన మూడవ వ్యక్తికే అందరికన్న ఎక్కువ జీతం ముట్టుతుంది! ఆరు నెలలకి 50రూ.ల ఇంక్రిమెంటు అంటే ఏడాదికి 100రూ.ల ఇంక్రిమెంటుతో సమానం అని చాలా మంది అనుకుంటారు. కాని, అది నిజంకాదు. ఈ క్రింది విధంగా వ్రాస్తే ఏ పద్ధతి ఎక్కువ లాభదాయకమో సులభంగా అర్థం అవుతుంది,

	ఏడాదికి 150 రూ.ల ఇంక్రిమెంటు	ఆరు నెలలకు 50రూ.ల ఇంక్రిమెంటు
మొదటి ఏడు	500+500=1000	500+550=1050
2వ ఏడు	575+575=1150	600+650=1250
3వ ఏడు	650+650=1300	700+750=1450
4వ ఏడు	725+725=1450	800+850=1650

ఏళ్లు గడుస్తున్నకొద్దీ తన జీతం మొదటి ఇద్దరి జీతం కన్న 50రూ, 100రూ, 150రూ, 200... ఈ విధంగా ఎక్కువగా ఉంటుందని మూడవ వ్యక్తి గ్రహించాడు. అదిగో ఆ బుద్ధి నైశిత్యమే సంస్థ మేనేజరుని ఆకర్షించింది, అంతేకాని అతని పొదుపరితనం కాదు.

(చ) ఎక్స్‌ప్రెస్ కాదు సుమా! రెండూ సమాన దిశాభిముఖంలోనే ఉంటాయి.

(ట)



సిల్కు గుడ్డను మూడు ముక్కలుగా ఎల్లా చేయవచ్చునో, ఆ మూడు ముక్కలను అతికి చదరం ఏవిధంగా తయారుచేయవచ్చునో ఇక్కడి బొమ్మలో చూపబడింది.

(త) ఐదు అగ్గిపుల్లలను అమర్చవలసిన పద్ధతి ఇదీ :



ఎలా నీకు చెప్పేది?!



అడివి శివసుబ్రహ్మణ్యం

తన ఇంటిముందు ఒక టాక్సీవచ్చి ఆగటం, అందులోనుంచి ఇరువురు అపరిచితులు దిగటం, మేడమీది డ్రాయింగు రూంలోనుంచి గమనించిన రాజారావు ఆశ్చర్యపడుతూ క్రిందకు దిగివచ్చాడు.

అప్పుడే హాలులో అడుగు పెట్టిన దంపతులిద్దరూ, రాజారావుకు నమస్కరించారు. రాజారావు ప్రతినమస్కారంచేసి, 'కూర్చోండి' అన్నాడు మర్యాద సూచకంగా, సోఫాను చూపుతూ. అతడు, ఆమె—కూర్చున్నారు. రాజారావు, వంటవాడిని పిలిచి, 'మూడు కాఫీలు తే' అని చెప్పాడు.

వచ్చిన వ్యక్తి కొంచెం కంగారుపడి, 'ఇప్పుడేమీ అవుసరం లేదండి' అన్నాడు.

రాజారావు నవ్వి 'పరవాలేదు—కాఫీయేగా!' అన్నాడు.

అతడు, తనువచ్చిన విషయాన్ని ఎలా ప్రారంభించాలో తెలియక, 'నాపేరు—శ్రీరాం—ఈమె, నా మిసెస్—మాలతి—' అన్నాడు.

అతడు చెప్పేది పూర్తి కాకుండానే, 'గ్లాడ్ టు మీట్ యూ' అంటూ అతడితో కరచాలనంచేసి, ఆమెవైపు తిరిగాడు.

'నమస్తే!' అంది ఆమె చేతులను రెంటినీ జోడించి.

రాజారావుకూడా ప్రత్యభివాదం చేశాడు.

తర్వాత, శ్రీరాం ప్రారంభించాడు 'మాది ఒంగోలు—నేను ఎమ్. ఎస్. సి. పాసై నాలుగు సంవత్సరాలైంది. అక్కడ కాలేజీలో రెండేళ్లు లెక్చరర్‌గా పనిచేశాను. ఇప్పుడు నాకు యూనివర్సిటీలో రిసెర్చికి అవకాశం లభించింది. అందుకని, ఇక్కడకు వచ్చాను. ప్రస్తుతం హోటలులో మకాం చేశాం. నాలుగురోజులనుంచీ, ఇల్లుకావాలని తిరుగుతున్నా, ఎక్కడా దొరకలేదు. ఈ వీధి చివర మేడలో ఒకభాగం ఖాళీగావుందని తెలిసివచ్చాం. తీరా వచ్చేసరికి, దాంట్లో ఉదయమే ఎవరోవచ్చి చేరారని తెలిసింది. మీ ఇంట్లో ప్రయత్నిస్తే, కొంతభాగం అద్దెకు లభించవచ్చునని, ఎవరో చెప్తే—ఇలావచ్చాం!' అన్నారు.

అదంతా విన్న రాజారావు సాలోచనగా 'అలాగా!' అన్నాడు.

ఒకక్షణం ఆలోచించి, 'మీరిద్దరే వుంటారా—ఇంకా ఎవరైనా వుంటారా మీతో?' అని అడిగాడు.

'ఊహూఁ...ఇంకెవ్వరూ వుండరు. ఎప్పుడైనా మా వాళ్లు చుట్టాలు ఎవరైనా అదరువస్తే, ఒక పూట వుండి వెళ్లిపోతారు' అన్నాడు శ్రీరాం.

'నేను ఒంటరిగాడినైనప్పటికీ, ఇల్లు అయితే, అద్దెకివ్వాలని లేదు. ముఖ్యంగా, నాకు ప్రశాంత వాతావరణం కావాలి. కాని, మీరు ప్రత్యేకంగా ఆశతో వచ్చారు కనుక, మిమ్మల్ని నిరాశపరచటం నా కిష్టంలేదు. క్రింది భాగంలో, ఈ మూడు గదులూ వాడుకోండి' అంటూ, రాజారావు లేచి, ఒక గదివైపు నడచాడు.

ఇద్దరూ అతడ్ని అనుసరించారు.

ఆ గదిలోనుంచి, లోపలకు వెడితే, మరొక గది. దానికి వెనుక మరొక చిన్నగది—వున్నాయి. ఆ చిన్నగదిని చూపిస్తూ 'మీరు వంటకు ఉపయోగించుకోవచ్చు, ఈ గది' అన్నాడు.

శ్రీరాం పరమానందభరితుడై, 'చాలా సంతోషమండీ! మీకు అభ్యంతరం లేకపోతే, సాయంకాలమే మా సామాను తెచ్చుకుంటాం—హోటలునుంచి' అన్నాడు.

రాజారావు చిరునవ్వు నవ్వాడు. 'ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావచ్చు. నేను సాధారణంగా, మేడమీద డ్రాయింగు రూంలో వుంటాను. ఒకవేళ నేను లేకపోయినా, మా వంటవాడుంటాడు. వాడితో చెప్పి వుంచుతాను' అన్నాడు.

వంటవాడు కాఫీ తెచ్చాడు.

ఇద్దరికీ కాఫీలు అందించి, తను కూడా ఒక కప్పు తీసుకొన్నాడు, రాజారావు.

'ప్రస్తుతం, ఇది అడ్వాన్సుగా వుంచండి' —అంటూ, శ్రీరాం, ఒక వందరూపాయల నోటును పర్సునుంచి తీసి, రాజారావుకు అందించాడు.

రాజారావు కొంచెం ఆశ్చర్యపడి, 'చూడండి —నేను మనుష్యుల విలువలు రూపాయలతో కొలువను మీదగ్గరే వుంచండి' అన్నాడు.

ఆమాటకు శ్రీరాం కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

'అడ్వాన్సు తీసుకోనిదే అద్దెలకెవ్వరూ ఇవ్వటంలేదీ రోజుల్లో...అందుకని...మరేమీ అనుకోకండి' అన్నాడు, నవ్వటానికి ప్రయత్నిస్తూ.

'దట్సాల్ రైట్—మరేం పర్వాలేదు. మీ వీలుచూచుకొని, ఎప్పుడైనాసరే, రండి' అన్నాడు రాజారావు.

దంపతులిద్దరూ నమస్కరించి, శలవు తీసుకొని, వెళ్ళిపోయిన తర్వాత, రాజారావు, మేడమీదున్న తన డ్రాయింగురూం వైపు నడిచాడు.

* * *

సాయంకాలం, వరండాలో శ్రీరాం పేపరు చూస్తున్నాడు, ఈజీచైర్లో కూర్చుని. లోపల వంటపనిలో నిమగ్నమైంది మాలతి.

అప్పుడే లోపలికి వస్తున్న రాజారావును 'హల్లో!' అని పలుకరించాడు శ్రీరాం. తర్వాత, అతడి చేతిలోని పుస్తకం వైపు చూచి, అదేమిటండీ?' అని ప్రశ్నించాడు.

'బహుమతి పొందిన చిత్రకారుల చిత్రాలు కొన్ని సేకరించి, ఆర్ట్సు అసోసియేషన్ వాళ్ళు పుస్తకంగా ప్రచురించారు. చూడండి' అంటూ, ఆపుస్తకాన్ని అందించి, మేడపైకి వెళ్ళిపోయాడు రాజారావు.

శ్రీరాం కొంతసేపు ఆ పుస్తకాన్ని తిరుగవేశాడు. అందులో రాజారావు చిత్రించిన మూడు చిత్రాలున్నాయి. వాటిల్లో ఒకటి చక్కటి ప్రకృతి దృశ్యం. దానికి విజయవాడలో జరిగిన ఒక చిత్ర కళా ప్రదర్శనంలో ద్వితీయ బహుమతి లభించింది. రెండవది, అలంకరణలో వున్న నవవధువు చిత్రం. ఒక పత్రికవాళ్ళు నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి పొందింది. మూడోది, ఢిల్లీలో ఏర్పాటు చేసిన జాతీయ చిత్ర కళా ప్రదర్శనంలో ద్వితీయ బహుమతి నందుకొంది. ఆ చిత్రం పేరు 'గమ్యస్థానం!' స్మశాన వాటిక — అందులో కాలుతున్న శవం—ఆ ప్రక్కనే, రోదిస్తున్న బంధువులు—ఇదీ చిత్రం!

శ్రీరాంకు ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే, రాజారావును ఒక పేరు గాంచిన చిత్రకారుగా అంతకుముందు ఎరుగడు. అతడా పుస్తకం తీసుకొని, రాజారావు రూముకు వెళ్ళాడు, మేడపైకి. 'ప్రఖ్యాత చిత్రకారుడొకడు నా మిత్రుడని చెప్పుకోవటానికి ఎంతో గర్విస్తున్నాను — మీ బొమ్మలు మూడూ చాలా బాగున్నాయి' అన్నాడు.

'ఇవాళ నన్ను పొగిడేస్తున్నారేమిటి?' అన్నాడు రాజారావు, చిరునవ్వు నవ్వుతూ.

ఆ ప్రశ్నకు శ్రీరాం 'ఎప్పుడో చెయ్యవలసిన పని, ఇవాళ — చాలా ఆలస్యంగా చేస్తున్నాను—' అని జవాబిచ్చాడు; తను కూడా మందహాసంచేస్తూ. తర్వాత మళ్ళీ అతడే అన్నాడు 'మేం మీ ఇంటికి వచ్చి నెలరోజులైనా, మీరు చిత్రకారులనీ, అందులో ఇంతపేరు గడించినవారనీ—నేను ఎరుగను'

'నుంచునే వున్నారు. కూర్చోండి' అన్నాడు రాజారావు, కుర్చీ చూపించి.

శ్రీరాం కూర్చుంటూ 'మీరు వేసిన చిత్రాలు ఇంకా వుంటే, ఓ సారి చూపిస్తారా?' అని అడిగాడు.

రాజారావు స్టీలు అల్మైరా తెరచి, ఒక అరలో, పదిలంగా వుంచిన ఆల్బం తీసి చూపించాడు. అందులో అన్నీ అతడు గీచిన చిత్రాలే వున్నాయి.

ఎక్కువభాగం అతడు గీసినవి ప్రకృతి దృశ్యాలు. ఆతరువాత, మరొక అరలో నుంచి, పెద్ద మౌంట్లమీద అతికించి వున్న పెయింటింగ్సు కొన్నింటిని చూపించాడు. శ్రీరాం, అన్ని చిత్రాలలోనూ తనకు నచ్చిన కొన్ని ప్రత్యేక ఆకర్షణలను వివరించాడు.

చిత్రాలన్నింటిని చూడటం పూర్తిఅయినాక, 'మీరు ఎన్నాళ్ళుగా ఈ చిత్రకళలో కృషి చేస్తున్నారు?' అని అడిగాడు శ్రీరాం.

'నాకు అనుభవం, దాదాపుగా రెండేళ్ళు వుందనుకోండి—అయినా, నేనూ ఓ చిత్రకారుడిగా ప్రపంచానికి పరిచయమై ఆరుమాసాలైంది.'

తరువాత, శ్రీరాం, తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు రాజారావుని. ఎక్కువ బెట్టు చెయ్యకూడదానే, మర్యాదకోసం అంగీకరించాడు, రాజారావు.

రాత్రి భోజనంచేస్తూ, మాలతిని 'ఏమండీ!' అని రాజారావు సంబోధించినప్పుడు, 'బహువచనం ఎందుకూ—నేను మీకన్నా, చిన్నదానినే' అంది మాలతి, నవ్వుతూ.

'కొబ్బరికాయ పెరుగుపచ్చడి బాగుంది. మావంటవా డెప్పుడూ ఇంతబాగా చెయ్యలేదు' అని రాజారావు వంటకాలను మెచ్చుకున్నాడు.

బాగుందనే నెపంతో, రోజూ ఇక్కడనే భోజనం చెయ్యొచ్చుననుకున్నారా!' అన్నాడు శ్రీరాం నవ్వుతూ.

అందుకు సమాధానంగా రాజారావు 'అబ్బే—నేనల్లా అనుకోవటంలేదు—నాలుగుసార్లు భోజనానికి పిలుస్తే, అద్దెడబ్బు తీయనవసరం లేదని మీరే అనుకొంటున్నారు' అన్నాడు, దరహాసంతో.

ముగ్గురూ నవ్వుకున్నారు.

* * *

అప్పుడే పోస్టుమాను ఇచ్చివెళ్ళిన ఉత్తరాన్ని చదువుకుంటున్న రాజారావు, గేటు దగ్గర, 'మాస్టారూ!' అన్నకేక విని, తల పైకెత్తి చూశాడు.

'శ్రీరాంగారుంటున్నది ఈ ఇల్లేననుకుంటాను' అన్నాడు ఆవచ్చిన యువకుడు.

'అవును—మీకేం కావాలి?' అని అడిగాడు, రాజారావు.

'మీకు వారేమవుతారో చెప్తారా?'

'నాగా కావలసినవారే—ఇంతకీ అసలు సంగతి ఏమిటో చెప్పండి'

'ఇవాళ శ్రీరాంగారు లేబొరేటరీలో ఎక్స్పెరిమెంటు ఒకటి చేస్తుంటే, స్టౌను పైకివచ్చి, ముఖం కొంచెంగా కాలింది. ప్రస్తుతం జనరల్ హాస్పిటలులో వున్నారు. వారికేమీ ప్రమాదంలేదు. వారిభార్యగారిని హాస్పిటలుకు రమ్మని చెప్పండి' అని, వార్డు నెంబరు చెప్పాడా యువకుడు.

'వాట్—శ్రీరాంకు ఆక్సిడెంటా? పాపం! మేం బయలుదేరివస్తున్నాం మీరు వెళ్లండి అన్నట్లు, మీపేరేమిటన్నారు?' విచారం, ఆశ్చర్యం, కూడుకొనగా, త్వరత్వరగా మాట్లాడేడు, రాజారావు.

'నాపేరు నారాయణరావు. నేను యూని వర్సిటీలో ఎమ్. ఎస్. సి. చదువుతున్నాను' అని చెప్పాడతడు.

అతడు వెళ్లిపోయిన తర్వాత, రాజారావు, లోపలకు వెళ్లి, 'మాలతీ!' అని పిలచాడు. అతడి పిలుపుకు సమాధానంగా, ఆమె, చేతిలో సగం చదువుతున్న వారపత్రికతో ఎదురువచ్చింది. ఆమెతో, శ్రీరాం, హాస్పిటలులో వున్నాడనీ, ఆక్సిడెంటు జరిగిందనీ, ఏమీ ప్రమాదంలేదనీ చెప్పాడు.

ఆమె కన్నులు చెమర్చాయి. ఆమె చేతిలోని పుస్తకం క్రిందకు జారింది. రాజారావు ఆమెను త్వరపెట్టి, కారులో ఎక్కించి కారును స్టార్టుచేశాడు.

మాలతినీ, రాజారావునూ చూచి, మంచంమీదనే లేచి కూర్చున్నాడు, శ్రీరాం. 'ఏం జరిగిందండీ?' అంది మాలతి, వాపోతూ.

శ్రీరాం ముఖంమీద రెండు మూడు పట్టీలున్నాయి. చేతికికూడా కట్టు కట్టబడివుంది. అతడు పెదవులమీద చిరునవ్వు తెచ్చుకుంటూ, 'మరేంలేదు. ఆవిరిముఖానికి వచ్చి తగిలింది, పెద్ద ప్రమాదమేమీ జరుగలేదు. ఇందులో కంగారుపడవలసిందేమీలేదు' అన్నాడు.

ఎలా నీకుచెప్పేది

తర్వాత, కొంతసేపు ముగ్గురూ మాట్లాడుకున్నారు. లేబొరేటరీలో ఎప్పుడూ పరధ్యాన్నంగా వుండవద్దని మందలించారు, మాలతి, రాజారావు కలసి.

పూర్తి స్వస్థత చేకూరేవరకూ, నాలుగు రోజులు హాస్పిటలులోనే వుండిపోవలసిందన్నారు, డాక్టర్లు.

*　　*　　*

ఆరోజు మధ్యాన్నం రాజారావు డ్రాయింగు రూంలో కూర్చుని, ఒక బొమ్మకు స్కెచ్ గీసుకొంటున్నాడు. మాలతి, నవ్వుతూ, అతడి గదిలోకివచ్చి, 'ఎంతసేపటినుంచీ పిలుస్తున్నా పలుకరేం—మీకు ఈ ఉత్తరం ఇచ్చిపోయాడు పోస్ట్‌మాన్' అంటూ ఒక కార్డును అతడిచేతి కందించింది. అతడా ఉత్తరాన్ని చదువుకొని, డ్రాయరు సొరుగులో పడేసి, ఇంకా అక్కడేవున్న మాలతిని ఆశ్చర్యంగా చూశాడు.

'మీరు వ్రాసిన బొమ్మలన్నీ ఒకసారి చూడాలనివుంది. చూపిస్తారా?' ఆమె మాట నట్లుగా, నిర్మలంగావుంది.

'ఓ—రండి!' అంటూ, అల్మైరా తెరచి, కొన్ని చిత్రాలను చూపించాడు. ఆమె వాటిని చూచి, క్రింద అరలోవున్న ఒకే ఒక పోర్ట్రెయిటును బయటకు తీసి, చూచి ఆశ్చర్యపోయింది.

'ఇది ఎప్పుడు వేశారు?' అని అడిగింది.

రాజారావు కొంచెం తత్తరపాటుతో 'ఆ... ఈ మధ్యనే' అన్నాడు

మాలతి 'చాలా చక్కగా వేశారు మీ ఫొటోకు దేవుడు ప్రాణం ఇస్తే, మేమిద్దరం ఒక చోటవుంటే, బొమ్మ ఏదో కనుక్కోవటం కష్టమవుతుంది' అంది నవ్వుతూ.

అతడామె వంకే చూస్తూండి పోయాడు.


'కాఫీ పెట్టటానికి టయిమవుతోంది. వస్తా' అంటూ, క్రిందకు వెళ్లిపోయింది. మాలతి. ఆమె వెళ్లిన దిక్కే కళ్లప్పగించి, చూస్తూ వుండిపోయాడు, రాజారావు.

రాత్రి పదకొండు గంటలు దాటింది. రాజారావుకు నిద్ర పట్టటం లేదు. లేచి, లైట్‌వేసి, మేడమీద నుంచి క్రిందకు దిగాడు. వరండా కటకటాల తలుపుకు తాళం వేసి వుంది. లోపల గది తలుపు దగ్గర వేసి వుంది. కిటికీలోంచి చూశాడు రాజారావు మంచం మీద తెల్లని వెన్నెలలాంటి దుప్పటి మీద బెడ్‌లైట్ కాంతిలో ఆమె పసిమి శరీరపు మెఋపులు అతడిలో ఏవేవో తలపులు లేపాయి. కొన్ని క్షణాలు అలాగే చూస్తూండి పోయాడు.

అతడి మనస్సులో ఎన్నెన్నో భావాలు మెదిలాయి ఇవాళే ... ఇవాళే ... నేడున్నది నిండురేయి— రేపన్నది ఎండమావి—రేపు— రేపు శ్రీరాం హాస్పిటలు నుంచి డిశ్చార్జి అయి వచ్చే రోజు—ఇంక ఆలస్యం చెయ్యకూడదు...అతడిలో ఏదో ఆవేశం ప్రవేశించింది. నెమ్మదిగా తలుపు తోశాడు. తెరచుకొంది. మాలతి పడుకొన్న మంచానికి ప్రక్కగా వెళ్లి నిలచాడు. ఆమె ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో పాటుగా ఎత్తయిన ఆమె వక్షోజాలు ఇంకా ఎత్తుగా లేస్తున్నాయి. బుస్సుమని. ఏదో చెయ్యాలి ... ఆమెను ఏదైనా చేసెయ్యాలి—మెల్లగా రాజారావు ఆమెపైకి వంగేడు.

మాలతికి మెలకువ వచ్చింది. కళ్లు తెరచి, అదరిపడి, లేచి కూర్చుంది. రాజారావును గుర్తించి, చిరునవ్వు నవ్వుతూ 'ఏం—ఇలా వచ్చారు?' అంది.

ఆమె చిరునవ్వొక మంత్రం — ఎదురులేని మంత్రం. దని వెనుక నైర్మల్యం గూడుకట్టుకొని వుంది...అందులో విశ్వాసం దాగి వుంది. అనుకోని హఠాత్సంఘటనకు



ఎలానీకు చెప్పేది

తడబడ్డాడు రాజారావు. 'మంచి నీళ్లు కావాలని...' ఏదో సాకు చెప్పాడు.

'నన్ను లేపకపోయారా, పాపం!' అంటూ, ఆమె లేచి, ప్రక్కనున్న కూజాలోని మంచి నీళ్లు గ్లాసులోపోసి, అందించింది.

.. గుండె దడ దడ లాడుతుండగా, మంచి నీళ్లు గడగడా త్రాగేసి, 'చాలు—వస్తాను' అంటూ, సమాధానం కోసం ఎదురుచూడ కుండా, గబగబా, మేడపైకి వెళ్లి పోయాడు, రాజారావు.

తలుపు లోపల గడియవేసుకొన్నాడు, తెల్లవారే వరకూ తియ్యకూడదు — అను కుంటూ. దీపం ఆర్పకుండా, మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు, ఆలోచిస్తూ. —తాను చేసిన పనేమిటి—ఇంకా నయం— ఏమీ కూడనిది జరగలేదు. ఆమె ఏమను కొందో—ఏమిటో! అయినా, తన కిదేం పాడుబుద్ధి— ఛీఛీ—త నెంత పతనస్థితికి దిగజారుతున్నాడు! ఇంతకన్న హీనపు పని మరొకటి వుందా ఆమె, పరస్త్రీ—మరొకరి భార్య. తనను విశ్వసించిన స్త్రీ—తన పై విశ్వాసం వున్నవాని భార్య...

తలుపు చప్పుడైంది. ఆమే! గాజుల చప్పుడు వినిపిస్తూనే వుంది. 'ఆడది ఒంటరిగా వుందని వచ్చావు- బుద్ధిలేదూ— మనిషివేనా?' అని అడుగుతుంది. తనేం సమాధానం ఈయగలడు? ఒళ్లంతా చెమటలు—రాజారావు నెమ్మదిగా వెళ్ళి, తలుపు తీశాడు—మళ్లీ అదే చిరునవ్వుతో మంత్రిస్తూ మాలతి! చేతిలో మంచినీళ్ల చెంబు, గ్లాసు.

తలుపు తెరవగానే, ఆమె లోనికివెళ్ళి, వాటిని మంచంప్రక్కనున్న టేబులుమీద పెట్టింది. 'రేపటినుంచీ, రాత్రిపూట మంచినీళ్ళు పెట్టమని వెంకన్నకు చెప్తాను' అంది.

రాజారావు మౌనంగా నిలబడిపోయాడు. ఆమె వెళ్లిపోతూ, 'నాగది తలుపు దగ్గరే వేసి వుంచుతాను. ఏమైనా కావలసివస్తే పిలవండి!' అంది:

ఆమె మాటల్లో ఎంత వాత్సల్యం!
తన మనసులో ఎంత పశుత్వం!
ఈ రెంటిమధ్యా ఎంత వ్యత్యాసం!

నెమ్మదిగా నిద్రపోవాలని ప్రయత్నించాడు. అతడికి నిద్ర రాకుండానే, నిద్రించిన సూర్యుడు మేల్కొన్నాడు.

ఉదయం బాత్‌రూందగ్గర ముఖం కడు క్కుంటున్న రాజారావును చూసి, 'కళ్ళు ఎర్రగావున్నాయి—రాత్రి నిద్ర లేదాండి?' అని అడిగింది మాలతి.

'అబ్బే—రాత్రి సాఫీగానే నిద్రపోయాను' —అని ఆమెకు సమాధానం ఇచ్చి, త్వర త్వరగా తన పని ముగించుకొని, మేడపైకి వెళ్లిపోయాడు, రాజారావు.

రాజారావు సూటుకేసులో బట్టలు సర్దు కుంటుంటే, వంటవాడు, కాఫీ, టిఫినుతో గదిలోకి వచ్చాడు. వాటినక్కడపెట్టి, తిరిగి వెళ్ళబోతుంటే, 'వెంకన్నా!' అని పిలిచాడు.

'ఏం బాబూ!' వెంకన్న ఆగిపోయాడు.

నాకు విజయనగరంలో కొంచెం పనుండి వెడుతున్నాను. రేపు సాయంకాలందాకా తిరిగి రాను.'

అల్లాగే బాబూ!'

'ఇవాళ హాస్పిటలునుంచి శ్రీరాం బాబు వస్తారు—ఆయనతో చెప్పు—రేపు సాయం కాలంలోగా, ఇల్లు ఖాళీచేసి వెళ్లిపొమ్మని.'

'అదేమిటిబాబూ— వాళ్లిద్దరూ దేవతల లాంటివాళ్ళు. వాళ్లవలన మీకేం అడ్డం ఏర్పడింది బాబూ ఇప్పుడు?' అన్నాడు వెంకన్న.

'వెంకన్నా—!' తన కంఠంలోని కాఠిన్యం, తనకే వెగటుగా వుంది.

'బాబూ!'

'చెప్పాను—అంతే! అలా చెయ్యి. రేపు సాయంత్రం నేను వచ్చేసరికి, వాళ్లు ఖాళీ చేసియ్యాలి.'

'చిత్తం బాబూ!' అని చెప్పి, వెంకన్న వెళ్ళిపోయాడు, గదిలోనుంచి మరికొన్ని క్షణాలలో అతడుకూడా సూట్‌కేసు తీసు కొని, మేడమీదినుంచి క్రిందకు దిగాడు.

* * *

శ్రీరాం హాస్పిటలునుంచి వచ్చిన తర్వాత, వెంకన్న చెప్పాడు 'మీరు రేపు సాయంకాలా నికి ఇల్లు ఖాళీచెయ్యాలని రాజారావుగారు చెప్పి వెళ్లారండి' అని.

శ్రీరాంకు ఆశ్చర్యంవేసింది. వెంటనే తేరుకొని, 'కారణమేమైనా చెప్పారా?' అని అడిగాడు.

'ఊఁ...లేదు బాబుగారూ!' వెంకన్న తల ఆడించాడు.

'అలాగే!' శ్రీరాం.

'మంచున్న పళంగా ఖాళీచేసి వెళ్ళి పొమ్మంటే ఎక్కడికిపోతామండీ? నాల్గు రోజులలో మరో ఇల్లు వెతుక్కొని వెడదాం!' అంది మాలతి.

శ్రీరాం, చిరునవ్వు నవ్వుతూ, బుజ్జగింపుగా, ఆమెకు చెప్పాడు, 'చూడు మాలా! మనం ఈ ఇంటికి అద్దె ఏమీ ఇవ్వటంలేదు. దీంట్లో మనకేవిధమైన అధికారమూ లేదు. ఏక్షణాన వెళ్ళిపొమ్మన్నా పోవలసిందే! సామానుసర్దు, టాక్సీ తీసుకు వస్తాను' అని.

విజయనగరంనుంచి తిరిగివచ్చిన రాజారావు వెంకన్నను పిలిచి 'వాళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారా?' అని అడిగాడు.

'వాళ్ళు నిన్న సాయంకాలమే వెళ్ళిపోయారు బాబూ! — ఈ కవరు మీకిమ్మన్నారు' అంటూ, వెంకన్న, అలమారలో నుంచి ఒక కవరుతీసి, రాజారావుకు అందించాడు.

రాజారావు, మేడమీది తన గదిలోకి వెళ్ళి కవరు తెరచాడు.

రాజారావుగారూ!

మీ ఇంట్లో వున్నది కొద్దికాలం మాత్రమే! అయినా, మీరు చూపిన ఆదరణ, ఆప్యాయత, మరచిపోలేం. మేం వున్న నాలుగు మాసాలకూ మీకు అద్దె ఏమీ చెల్లించలేదు. నెలకు, సుమారుగా, అరవై రూపాయల చొప్పున, 250 రూపాయలకు చెక్కు వ్రాసి. దీనితో జతపరుస్తున్నాను.

తన తప్పులేమైనా వుంటే, ఒక సోదరుడిలాగా క్షమించమని, మాలతి మీకు చెప్పమంటోంది.

శలవ్—

'శ్రీరాం'

ఉత్తరంతో జతపరచి వున్న చెక్కును ముక్కలుగా, చించి, మూలపోశాడు. గదిలో మధ్యగా నిలబడి, తను చిత్రించిన మాలతి చిత్రానికేసి చూస్తూ, గద్గదంగా 'మాలతీ! నాలోని పశుత్వం ప్రకోపించి, నీ వంటి లాంటి జీవితం బలి అయిపోతుందేమోనని భీతితో, నిన్ను ఇంటి నుంచి గెంటివేశానని నీ కెలా తెలుస్తుంది మాలతీ—ఎలా నీకు చెప్పేది?' అంటూ, రాజారావు అరచేతితో నుదురు బాదుకుంటున్నాడు.

మాలతి నవ్వుతోంది—వెన్నెలలా—వెలుగులా—పాలనురుగులా—దేవతల వరంలా—ఇంకా—ఇంకా—ఎలాగో. ●

కుజగ్రహంలో కాలువలు

(23వ పేజీ తరువాయి)


మీద తెలివైన జీవులు ఉన్నాయని బుజావు అయినట్లేనా? కుజగ్రహంలో కాలువలు కనబడ్డాయని షియాపరెల్లీ చేసిన ప్రకటన వైజ్ఞానిక లోకంలో బ్రహ్మాండమైన అలజడిని లేవదీసింది. అనేకులు ఖగోళ శాస్త్రజ్ఞులు ఆ గీతల కోసం మళ్లీమళ్లీ ప్రయత్నించి చూచారు. చాలామందికి అవి కనబడనేలేదు. కళ్లు చించుకు చూస్తే కాని అసలు ఆ గోళం మీద ఏముందో తెలియడంలేదు. ఒకసారి స్పష్టంగా కనిపిస్తే మళ్లీ చాలా సేపు అలుక్కుపోయినట్లు, ఫోకస్ సరిగ్గా లేని ఫోటోలా కనిపిస్తుంది. దీనికి ముఖ్య కారణం మన భూమి చుట్టూ ఉన్న దట్టమైన వాతావరణమే. ఇది స్థిరంగా ఉండక మాటిమాటికీ కదులుతూ ఉండడం చేత బహుదూరాన ఉన్న కుజ గ్రహ బింబం అలుక్కుపోయినట్లు కనిపిస్తుంది.

ఆటు తరువాత ఈ కుజగ్రహాన్ని గూర్చి పరిశోధనలు జరిపిన వారిలో 'పెర్సివాల్ లోవెల్' అనే అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు ముఖ్యుడు. ప్రత్యేకంగా ఈ పని కోసమై అరిజోనా ఎడారిలో ఖగోళ పరిశోధనశాల కట్టించి 18అంగుళాలు, 24 అంగుళాలు వ్యాసం గలిగిన కటకాలతో రెండు శక్తివంతమైన టెలిస్కోపులు ఉపయోగించి అనేక సంవత్సరాలు పరిశోధనలు జరిపేడు.

కుజగ్రహంలోని కాలువలను లోవెల్ కూడా చూశాడు. కొన్ని కాలువలు హఠాత్తుగా జంట కాలువలుగా మారిపోవడం ఈయనకూడా గమనించాడు. ఆజంట కాలువలమధ్య దూరం 75 మైళ్లనుంచి 400 మైళ్లవరకూ ఉండవచ్చు. ఉందా లేదా అన్నట్లు రేఖామాత్రంగా కనిపించే ఆ కాలువ అధమం 30 మైళ్ల వెడల్పు ఉంటే కాని మూడున్నరకోట్ల మైళ్ల దూరంలో ఉన్న మనకు కనబడే అవకాశమే లేదు! ఇటువంటి చిత్రమైన కాలువలు తెలివైన జీవుల పనితప్ప ప్రకృతి సహజమైనవికావు అన్నాడు లోవెల్. అయితే ఆ జీవులు ఆ కాలువలను ఎందుకు తవ్వినట్లు? ఈ ప్రశ్నకు సమాధానంగా లోవెల్ బహు సుందరమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

కుజగ్రహంలో చాలాభాగం ఎడారి. సారవంతమైన నేల చాలా తక్కువగా ఉంది అక్కడ అయినా నీళ్లుంటే కాని మొక్కలు మొలవవు. మొక్కలులేకపోతే ఆ జీవులకు ఆహారమేలేదు. కనుక నీటిని సంపాదించడం ఆజీవులకు ఏకైకలక్ష్యం. ఆ గ్రహం మీద నీరు స్వల్పాతిస్వల్పంగా మిగిలి ఉంది; అది అంతా ధృవముల దగ్గర గడ్డకట్టి ఉంది. వేసవిలో ఆమంచుగుట్టలు కరిగి ప్రవహించే నీటిని బహుజాగ్రత్తగా వాడుకోవడం తప్ప గత్యంతరంలేదు. ఈ సంగతిని ఆ జీవులు గ్రహించాయి. కనుక భూమి మీది మనుష్యులలా తమలో తాము కుమ్ములాటలు మాని, నీటిసరఫరా ప్రణాళికలు తయారుచేసుకుని ఆ కార్యక్రమాన్ని అమలు జరిపేశాయి. ధృవములదగ్గరనుంచి పట్టణాలకు, పల్లెలకు పెద్దపెద్ద కాలువలు తవ్వి, మంచు కరిగిన నీటిని వాటిగుండా ప్రవహింపజేసి, వ్యవసాయానికి వాడుకుంటున్నాయి! ఒక్క కాలువలో వచ్చే నీరు సరిపోదనిపిస్తే దానిపక్క నేమరోకాలువతవ్వి ఉంచుకుని, తలుపులు బిగించి, అవసరమైనప్పుడు ఆ కాలువలను తెరుస్తూ ఉంటారు. మనకు హఠాత్తుగా ఒక్కకాలువ రెండు కాలువలుగా కనబడడానికి కారణం ఇదే. కాని, కుజగ్రహంమీద ఉన్న నీరు అంతా పోగు చేస్తే ఒక పెద్ద సరస్సు నిండుతుందేమో! మహాఅయితే అంతకన్న అధికంగా ఉండదు. అంత స్వల్పంగా ఉన్న నీటిని సరఫరాచేయడానికి 30 మైళ్ల వెడల్పున కాలువలు తవ్వడం తెలివైన జీవులుచేసే పనేనా? ఆ నీరు అంతా దారిలోనే ఇరికిపోదూ? లోవెల్ దీనికిన్ని సమాధానం చెప్పేడు. మనకు కనిపించే నల్లని గీతలు నీరు ప్రవహించే కాలువలు కాదు. నీరు సన్ననిగొట్టాల ద్వారా ప్రవహిస్తూ ఉండి ఉండాలి. ఆ నీటిగొట్టాలకు ఎడాపెడా పల్లెలు, పట్టణాలూ బయలుదేరాయి. ఆ గొట్టాలలోనుంచి నీటిని తీసుకుని, దారిపొడుగునా చెట్లూ, పొలాలు పెంచారు. మనకు గీతలలా కనబడేవి ఈ గొట్టాలకు ఎడాపెడా మొలిచిన మొక్కలుమాత్రమే. గొట్టాలు కనబడవు. ఆ మొక్కలు 30 మైళ్ల వెడల్పున ఉన్న నేలమీద పెరగడంలో ఆశ్చర్యం ఏముంది?

అయితే ధృవములదగ్గరనుంచి గ్రహమధ్యరేఖ ప్రాంతానికి నీరు ఎల్లా ప్రవహిస్తుంది? దారి పొడుగునా ఎత్తునుంచి పల్లానికి వాలు ఉండడం సాధ్యమా? అక్కడక్కడ ఎత్తుపల్లాలు ఉండటం సహజం కదా? ఆ జీవులు బహు శక్తివంతమైన యంత్రాలను ఉపయోగించి నీరు 'పంపు' చేస్తున్నాయని లోవెల్ ఊహించాడు. మొత్తం గ్రహంమీద నీటి సరఫరాకు ఎంతశక్తి అవసరమో లెక్కలు కట్టేడు. నయాగరా జలపాతం నుంచి లభించే శక్తికి నాలుగువేలరెట్లు శక్తి అవసరం అన్నాడాయన! ఇంతటి అమోఘమైన యంత్రాలను సృష్టించ నేర్చిన జీవులు సామాన్యమైనవికావు. అవి మన మనుష్యులకన్న తెలివైనవి అన్నా ఆశ్చర్యపడనక్కరలేదు. ●



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

'ఎందుకు' శీర్షిక మొదలుపెట్టిన తర్వాత 'వనితాలోకం' లోనూ అటు వంటి శీర్షికనే నడిపితే బాగుంటుందనే సూచనలు మాకు వచ్చాయి! అందుకనే 'ప్రశ్నావళి' అనే ఈ కింది శీర్షిక ఈ వారం ప్రారంభిస్తున్నాము. 'ప్రశ్నావళి' వారం విడిచి వారం వేస్తాము.

'ప్రశ్నావళి' శీర్షిక నిర్వహించటానికి సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కె. రామలక్ష్మి అంగీకరించారు,

ప్రశ్నలు - 'ప్రశ్నావళి' ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టిస్ట్రీట్, మద్రాసు-1-కి పంపాలి. అడిగే వారి పూర్తిపేరు, చిరునామా ఇవ్వాలి. ప్రశ్నలు వీలయినంత పొట్టిగా, సూటిగా ఉంటే మంచిది. [గమనిక - ప్రచురించినప్పుడు మాత్రం అడిగిన వారి పేరు, ఊరిపేరు మాత్రమే వేస్తాము. తమ పేరు ప్రచురించ వద్దనుకునేవారు 'కలం పేరు' వాడవచ్చు.]

అడిగేవారి పేరు, చిరునామా పూర్తి తెలుగు లిపిలోనే ఉండాలి! ఇంగ్లీషు అక్షరాలు వాడరాదు!!

ప్రశ్నలు తిప్పి పంపడానికి సాధ్యపడదు కాబట్టి స్టాంపులను జతపరచ వద్దని కోరుతున్నాము.

సంపాదకుడు,
ఆంధ్ర సచిత్ర వారపత్రిక.

కె. శ్యామల, మధుర

'చిన్నతనంలో అనుకున్న సంబంధం. కాని నేను పై చదువులు చదివాను. అతను అంతంతమాత్రమే చదివి ముగించాడు. ఎలా చేసుకోవడం?'

పెద్ద చదువూ చిన్నచదువూ అంటూ వేరే వేరే లేవు. ఒకరకం చదువులని డిగ్రీలతో కొలుస్తారు. అంతే. సంస్కారం వున్న వ్యక్తికి డిగ్రీలు ప్రధానం కావు.అది మీ హ్రస్వదృష్టినే చూపుతోంది. అయినా పచ్చోడ గొట్టు కొందుకు ఏరాయి అయితేనేం అన్నట్టు, ఒక డిగ్రీ ఉన్నా, రెండున్నా అసలు లేకున్నా సంసారం సవ్యంగా సాగించేదిమీరే గాని చదువు కాదుగా?

ఏ. వాసంతి, మద్రాసు

'నాకు పై చదువు చదవాలనిలేదు. ఉద్యోగం చేయాలని అంతకన్నాలేదు. ఏం చెయ్యను?'

వెనకటికి ఒకరాజుగారికి సంతోషంగా ఉండేవాడి చొక్కా తెచ్చి తొడగ మన్నారుట. బహుశా అప్పుడు మీరు దొరికి ఉండరు! చదువూ ఉద్యోగం అక్కర లేక పోతే 'పెళ్లి' ఉండనే ఉందిగా. హాయిగా పెళ్లి చేసుకోండి. అయితే పెళ్లికూడా కొంచెం బాధ్యతతో కూడినదే— చూస్తున్నా కాలుకిందా నేస్తే లాభం ఉండదు. అదీ ఓరకం ఉద్యోగంలాంటిదే, మరిచిపోకండి.

కె. విజయ, గుంటూరు

'నాకు డబ్బంటే ఇష్టం!'

అక్కడికి నాకు యిష్టం లేనట్టు! డబ్బంటే దైవం, లేకుంటే దెయ్యం అన్నారు వినలేదా? అనేక విషమ సమస్యలకి డబ్బే కారణంగా కన్పించ డంతో ఈకాలంలో దేనికీ లేని విలువ దానికి ఉండడంలో ఆశ్చర్యం లేదు.

సి. హెచ్. ఉషాదేవి, మోచెర్ల

'నేను ఉద్యోగం చేస్తున్నాను. కాని ఏం లాభం? నా జీతంమీద చిన్నమెత్తు హక్కు లేదు. ఒకొక్కప్పుడు అనిపిస్తుంది—ఎందుకీ ఉద్యోగం చెయ్యడం అని...'

సంపాదించడం మొదలు పెట్టిన మగవాడు మహారాజా అవుతున్నాడు. సంపాదించడం మొదలుపెట్టిన ఆడది బాధ్యతలు మరీ అర్థం చేసుకుని బానిస అయిపోతోంది. పెళ్లికానంత వరకూ పుట్టింటివారి కోసం, పెళ్లి అయాక అత్తింటికోసం సంపాదించే ఆడపిల్లలు ఈ నాడు మరీ ఎక్కువగానే కన్పిస్తున్నారు. అవసరానికి ఉద్యోగం చేయడంలో తప్పు లేదు. కాని స్వేచ్ఛ లోపించడంతో మీలో నిరుత్సాహం తలెత్తుతూంది. మీ అన్నతమ్ముల లాగా మీరూ 'నాకర్చులకి ఇంతడబ్బు ఇవ్వండి' అని అడిగి చూడండి. అడిగితే గాని అమ్మైనా పెట్టదు కదా?


సి. పద్మ, చిత్తూరు

'నాకు కొత్తరకాల దుస్తులు వేసుకోవాలని సరదా. కాని వింతగా చూస్తారేమోనని భయంగా ఉంది.'

వెనకటికి ఓ తమ్ముడికి మీలాగే అనుమానం వచ్చిందట. పెరట్లో ఉన్న దున్నపోతు కొమ్ముల మధ్య తలదూరుస్తే ఎలా ఉంటుందీ అని. ఆ దున్నకి కూడా ఈతమ్ముడిని కొమ్ములతో పైకెత్తితే ఎలా ఉంటుందీ అని ఉబలాటంగా ఉందిట.ఒక ఉదయాన్నే తెగించి తమ్ముడు దున్న కొమ్ముల మధ్య తలా పెట్టాడు. అది కొమ్ము విసిరీ కొట్టింది! దానితో తమ్ముడి అనుమానం తీరింది. దున్నపోతు తల తిక్కతీరింది. ఓ సారి తెగించి వేసుకు చూస్తే మీ అనుమానం తీరిపోతుందిగా! అయినా అంతర్జాతీయంగా చీరను మించిన అందమైన ఆడనారి దుస్తులు లేవని అందరూ అంటూంటే మీకీ తిక్క ఎందుకు పుట్టింది?



సుమిత్ర సుస్వభావం



ధర్మపథం

బులుసు వెంకటరమణయ్య

'సవతి తల్లి ప్రేమ' అనే నానుడి లోకంలో ప్రసిద్ధమై ఉన్నది. సవతి తల్లికి సపత్నీ పుత్రులమీద వుండే ప్రేమ కేవలం నటనగాని యధార్థమైనది కాదని దీని అర్థం. హృదయపూర్వకంగా అభిమానం లేనిచోట అభిమానాన్ని ప్రకటించేవారి విషయంలో ఇది వాడుకలో ఉంది.

అన్ని చోట్లా ఈ మాట చెల్లుతుందా?

చెల్లదనే చెప్పవలసి ఉన్నది.

రామునికి కైక యేవిధంగా సవతితల్లో సుమిత్రకూడా అట్లే విమాత.

అయినా వీరిద్దరికీ భేదం ఉన్నది.

కైకకు తనవారూ పైవారూ అనే భేదం పన్నే గుణం వున్నది. సుమిత్రకు అందరూ సమానులే!

సుమిత్ర పుత్రులలో లక్ష్మణుడు రామునికి జంటగా కుదిరాడు. శత్రుఘ్నుడు భరతునికి జంటగా అమరాడు. ఇందులో తల్లికి వంతు లేకపోలేదు.

కైక తను కుమారుడి కోసం సవతికొడుకైన రాముణ్ణి పధ్నాలుగేళ్ళ వనవాసానికి పంపింది.

అడవికి పోతున్న శ్రీరాముని సంరక్షణ కోసం, అతనివెంట లక్ష్మణుని పంపినది సుమిత్ర.

బాగా ఆలోచించి చూడగా సుమిత్రవంటి తల్లి—తనకొడుకు అడవికి వెళ్ళుతూవుంటే వద్దని చెప్పవలసి వున్నది. నూతన వధువును ఒంటరిగా విడిచి పధ్నాలుగేళ్ళ ప్రవాసం వుండడం—అందులోనూ ఘోరారణ్యాలలో నివసించడం ధర్మంకాదని కూడా చెప్పవలసి ఉన్నదిగదా! ఆమె ఆ రీతిని చెప్పడంలేదు.

చెప్పడంలేదు సరిగదా, చాలా ఉత్సాహంతో హెచ్చరించిది.

దీనికి కారణం ఏమిటి?

శ్రీరాముడు సామాన్య మానవుడు కాడనీ, లోకాతీతుడనీ, భగవదవతారమూర్తి అనీ ఆమెకు తెలియును. విశ్వామిత్ర మహర్షి తన యాగసంరక్షణకోసం శ్రీరాముని తీసుకుని వెళ్ళడం, యాగరక్షణ, తాటకవధ, అహల్యా శాపవిమోచనం, శివధనుర్భంగం, పరశురామ పరాజయం మున్నగు వాటివల్ల ఆమె యిదివరకే శ్రీరాముని అద్భుతశక్తులను గ్రహించినది. అట్టి రాముని అండను ఉన్న తన కుమారుడికి ఎట్టి ప్రమాదమూ ఉండదని సుమిత్ర ధైర్యం.

కడచిన సంఘటనలను వినీ, కొన్ని కళ్ళారా చూచీ కూడా కైక రాముని గొప్పతనాన్ని అర్థం చేసుకోలేక పోయింది!

శ్రీరాముని విడిచి వుండడం లక్ష్మణుడికి సాధ్యంకాదు. అందువల్లనే అతడు రాముని వెనుకనే ఉండితీరాలనే దృఢసంకల్పంతో ఉన్నాడు. అతని నిర్ణయాన్ని మార్చడం కూడా అసాధ్యమే.

అడవుల కుపోతూ ఉన్న లక్ష్మణుడు మాతృదేవి అనుమతిని తీసుకోవలసి ఉన్నది.

అతడు తల్లికి నమస్కరించి వనవాసానికి అనుమతిని కోరాడు. అప్పుడామె చెప్పిన మాటలివి—

'నాయనా! వనవాసానికి భయపడకు, తల్లిదండ్రులున్నచోట కుమారుడుంటే—వానికి యే కష్టమూ వుండదు. వారు ఉండే వనమైనా పట్టణమే! వారులేని పట్టణమైనా అడవే! ఈ సంగతి తెలుసుకుని సుఖంగా వెళ్ళిరా నాయనా!'

రామాయణంలో ఇక్కడి శ్లోకం గమనించ దగినది—

'రామం దశరథం విద్ధి
మాం విద్ధి జనకాత్మజామ్,
అయోధ్యా మటవీం విద్ధి
గచ్ఛ తాత యథాసుఖమ్.'

'నాయనా! రాముడే దశరథుడని తెలుసుకో. సీతాదేవియే నేనని అనుకో. రాముడులేని అయోధ్య అడవి అని గ్రహించు, రాముడు లేని అయోధ్యలో నీవు ఉన్నా అడవిలో ఉన్నట్లే, సుఖంగా వెళ్ళిరా' అని దీని అభిప్రాయం

ఇందులో మరొక చక్కని అర్థం వ్యంగ్యంగా ఉన్నది. సుమిత్ర దూరదృష్టికిది తార్కాణం.

సుమిత్రకు—శ్రీరాముడు భగవంతుడగు విష్ణుని అవతారమని యిదివరకే తెలుసును. ఈ సంగతి యిదివరకే చెప్పబడి వున్నది.

'నాయనా! శ్రీరాముడు సామాన్యమానవుడు కాడు. దశరథుడు—పక్షివాహనుడైన విష్ణువు. సీతాదేవి లక్ష్మీదేవి. (మా=లక్ష్మీదేవి.) అందువల్ల వారిని సేవిస్తూ వుంటే నీకు ఎట్టి కష్టములున్నా ఉండవు. అట్టి అవతారమూర్తి అయిన శ్రీరాముడు లేని అయోధ్య అడవి వంటిదే! వనవాసానికి నీ వెంతమాత్రమూ భయపడక సుఖంగా వెళ్ళిరా నాయనా!'' అని దీని అంతరార్థం!

సుమిత్రసౌమనస్యానికి ఇలాంటి సంఘటనలెన్నో ఒక గీటురాయి.

సుమిత్రవంటి సవతి తల్లులు ఎందరున్నారు? ●

శాసనసభ వనితామణులు-3

శ్రీమతి పద్మా భాస్కర్ రెడ్డి



శ్రీమతి పద్మాభాస్కర్ రెడ్డి

పండిన భక్తిభావంతో, నిండిన హృదయంతో తిరుపతి వెంకటేశ్వరస్వామికి ఆమె తలనీలాలు సమర్పించుకున్నారు.

ఒకమారు కురుమాడికి తీవ్రంగా జబ్బు చేసింది. తండ్రి డాక్టరు. అయినా తగ్గలేదు. కానీ తల్లి మొక్కు ఫలించింది. మొక్కుబడిని తీర్చుకున్నారు. తర్వాత రెండుమార్లు తిరుమల మెట్లెక్కి దైవ దర్శనం చేసుకున్నారు. కొండపై సత్రం కూడా కట్టించారు. పెద్దల ప్రోద్బలం చేత నేటి రాజకీయాల్లో ప్రవేశించిన ఆ వ్యక్తి శ్రీమతి పద్మా భాస్కర రెడ్డిగారు.

మైసూరు ఆమె పుట్టిల్లు, ఆంధ్ర దేశం మెట్టినిల్లు. కొల్హాపూర్ జిల్లాలోని తోళ్లపల్లె జన్మస్థలం. తండ్రి సదాశివ రెడ్డిగారు పెద్దభూస్వామి ఆయన 15ఏళ్ల మైసూరు శాసనసభ్యులు. పద్మగారు బెంగుళూరులోని సెంట్రల్ కాలేజీలో బి. ఎస్సీ. ఆనర్స్ చదివారు. మహారాణీ కాలేజీలో ఒక సంవత్సరం లెక్చరరుగా పనిచేశారు. మైసూరులోని రెడ్లకుటుంబాలకు చెందిన తొలి గ్రాడ్యుయేటు.

డాక్టరు భాస్కర్‌రెడ్డిగారితో ఆమె 23 వ ఏట వివాహం జరిగింది. అనంతపూర్ జిల్లాలోని పాముదుర్తి ఆయన స్వగ్రామం. డాక్టరు కావాలన్న ఆమె చిన్ననాటి కల రూపుదాల్చలేదు. కానీ మరో రూపంలో ఆమెకు తృప్తి కలుగుతున్నది. భర్తతోపాటు ఉదయం సాయంత్రం ఆస్పత్రికి వెళ్ళి రోగులను పరామర్శ చేస్తారు. రాజకీయాల్లో ప్రవేశించే పర్యంతం అదే ఆమె దినచర్య. దైవపూజ ఆమెకు నైష్ఠికం. డాక్టరుగారూ పరమభక్తులు. రాజకీయాలు ఆయనకూ నచ్చవు.

పద్మగారు తొలిసారి శాసనసభలో ప్రవేశించారు. గోరంట్ల నియోజకవర్గం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా పోటీచేసి, ఇండిపెండెంటు అభ్యర్థిపై పదిహేనువేల ఓట్లకు పైగా మెజారిటీ సాధించారు. ఎన్నికల ప్రచార సందర్భంగా నాలుగైదు గ్రామాల్లో మాత్రమే ఆమె ప్రసంగించారు. అసలు కొన్ని గ్రామాలకు వెళ్ళనేలేదు. ప్రజలకు శక్తికిమించిన హామీలూ ఇవ్వలేదు. కొన్ని గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించడానికి కృషిచేస్తాననీ చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుకుంటానని ఆమె చెప్పారు.

సంప్రదాయ పద్ధతుల్లో ఆలోచించే వ్యక్తిగా పద్మగారు కన్పించారు. కాగా, నవీనమైన సభ్యమైన పద్ధతులను నిరసించరు. నిండైన ఆమె విగ్రహానికి నయనానందకరమైన ఆమె వస్త్రాలంకరణ మెండుగా ఒప్పారుతుంది. ఫాన్సీ డ్రెస్సులంటే ఆమెకు మోజు. కాలేజీలో ఫాన్సీడ్రెస్సు పోటీల్లో పెక్కుబహుమతులు పొందారు. ఆధునిక స్త్రీల, కాలేజీ విద్యార్థినుల వింత పోకడ గిట్టదు. చెట్టాపట్టాలు కట్టి మగస్నేహితులతో తిరగడం, ఒంటరిగా సినిమాలకు స్త్రీలు వెళ్లడం నచ్చదు. స్త్రీల వివాహ వయస్సును 20 ఏళ్లకు పెంచితే, తీవ్రమైన అనర్థాలకు దారితీసే ప్రమాదముందని ఆమె హెచ్చరించారు. సామాజిక జీవితంలో ఒక విధమైన అవ్యవస్థ ఏర్పడ వచ్చునన్న ఆందోళనను వ్యక్తపర్చారు.

డాక్టర్ కబుర్లు


డాక్టరుతో నిజం చెప్పాలి!

చాలా మంది జబ్బుగాలేకపోయినా డాక్టరు దగ్గరికి వెడతారు. తమ గోడు వినే వ్యక్తి ఎవరో ఒకరు వాళ్లకి కావాలి. విని సానుభూతి చూపించే వ్యక్తివాళ్ళకి కావాలి. వారి ఆందోళన తగ్గటానికి ఇది చాలు. ఈమాత్రం సానుభూతి చూపించే చుట్టం, స్నేహితుడు వారికి దొరక్కపోవచ్చు.

కాని, వచ్చిన చిక్కేమిటంటే డాక్టరుకి తమ అనారోగ్యం మానసిక ఆందోళనకి సంబంధించిన సంగతి చెప్పరు. లేని కడుపునెప్పి, ఆయాసం, తలనొప్పి వివరిస్తారు! చివరికి డాక్టరుకే నిజం తెలిసి అసలు పేషంటు తన దగ్గిరికి ఎందుకు వచ్చినదీ తెలుస్తుంది.

'రోగి' చెప్పే విషయాలేక పూ— అతను కూర్చునే విధానం, చేతి కదలికలు, కాల్చే సిగరెట్లసంఖ్య అవి కాల్చే విధానం, ఇవన్నీ కూడా 'రోగ చిహ్న'లే.

అందుకనే డాక్టర్లు తమ కన్సల్టేషన్ గదిని అందంగా 'అలంకరించాలి.



అక్కడ కూర్చునేవారికి మన శ్శాంతి కలిగించేటట్లు ఉండాలి.

హాన్. ఎల్. హార్ట్‌సెన్

(కాపీరయిటు)

41 ఏళ్ల పద్మగారికి ఒక కుమారుడు, ఒక కూతురు సంతానం. వారు చదువుకుంటున్నారు. చిన్నపిల్లలుగల తల్లులకు రాజకీయ జీవితం బాధాకరంగా ఉంటుందని ఆమె భారంగా చెప్పారు. పద్మగారికి, భాస్కర్ రెడ్డిగారికి గార్డెనింగ్ చాలా ఇష్టం. పేకాట ఆమెకు సరదా. స్నేహితులకు, బంధువులకు వెంటనే సమాధానాలు రాయడం హాబీ. తెలుగు మాతృభాష, కాని కన్నడం, తమిళం, ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడ్తారు. నూతన శాసనసభ తొలి సమావేశంలో ఆమె తెలుగులో తమ తొలి ప్రసంగాన్ని ప్రారంభించి, ఇంగ్లీషులో పూర్తి చేయగలిగారు.

గృహజీవనమే పద్మా భాస్కర్ రెడ్డిగారికి మధురమైనప్పటికీ, రాజకీయాల పట్ల అనురక్తిని పెంచుకుని, ప్రజల సమస్యలపై ప్రభుత్వ దృష్టిని మళ్లించడానికి, ఆమె శాసనసభలో నిర్వహించనున్న పాత్రను ఆసక్తితో గమనించవలసి ఉంది

—బాసాని సుదర్శన్ రెడ్డి ●

వంటలు :

మసాలా గారె

శనగపప్పు	1 కప్పు
మినపప్పు	1 కప్పు
ఉల్లిపాయలు	2
కొత్తిమీర	1 కట్ట
పచ్చిమిరపకాయలు	6, లేక 7.
ఉప్పు	కొంచెం, మెత్తగా పొడిచేసినది.
నూనె	2 కప్పులు.

మినప, శనగపప్పులని కలిపి 3 గంటలు నానబెట్టి, మెత్తగా రుబ్బాలి. తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ ముక్కలు, కొత్తిమీర, ఉప్పు చేర్చి బాగా కలిపి తడిగుడ్డమీద లేక అరిటాకు మీద గారెలు పెట్టి పొగలు కక్కుతున్న నూనెలో బాగా వేయించాలి. —ఎ. వి. ●


సోక్రటెస్

'దయామయుడవయిన భగవంతుడా! ఇవి నా జీవితం చివరి ఘడియలు. ఈ సమయంలో నాకు నువ్వు ప్రసాదించిన అదృష్టానికి నా హృదయం కృతజ్ఞతతో నిండిపోతున్నది! నాకు మానవజన్మ ప్రసాదించావు, ప్రపంచంలో కెల్లా నాగరకతకల ఈ ఏథెన్స్‌లో పుట్టేట్లు చేశావు, అన్నిటికన్నా గొప్ప విషయం ఏమిటంటే— మానవులందరిలోనూ ఉత్తముడయిన సోక్రటెస్ ఈ మహానగరంలో జరిపే ఉపదేశాలు వినటానికి తగిన కాలంలో జన్మించేట్టు చేశావు; ఆయన శిష్యులలో ఒకడినయి, ఆయన పాదాలవద్ద జ్ఞానం సంపాదించుకొనగలిగేట్లు చేశావు, అంతే చాలు!'

ఈ భగవత్ ప్రార్థన ఉచ్చరిస్తూ ఈ లోకాన్ని వదిలాడు సుప్రసిద్ధ గ్రీక్ తత్వవేత్త ప్లేటో.

ప్లేటో అంతగా కొనియాడిన గురువు సోక్రటెస్ క్రీ.పూ. 470 లో జన్మించాడు. అతని తండ్రి ఒకశిల్పి, కొంతకాలం సోక్రటెస్ తన తండ్రి వృత్తి చేశాడు కూడా కాని ఉద్దేశం వారి సైన్యంలో చేరాడు. రెండు పార్ల యుద్ధంలో పాల్గొన్నాడు.

పరాక్రమవంతుడుగా పేరు సంపాదించుకున్నాడు. తన ప్రాణాలకి లెక్కచెయ్యకుండా తోటి సైనికులని మృత్యుముఖం నుంచి కాపాడిన ధైర్యశాలి, త్యాగశీలి. సైన్యం వదిలిన తర్వాత సోక్రటెస్‌కి విద్యాభ్యాసంమీద అభిలాష కలిగింది. విద్యాభ్యాసం పూర్తిచేసుకుని ప్రజలకి జీవితంలో నడవడి మీద, రాజ్యపరిపాలనకి సంబంధించిన వివిధ విషయాల మీదా ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించాడు త్వరలో అయిదు వందల మంది 'సెనేటర్'లలో ఒకడు అయ్యాడు. ఇంకా ఇతర గౌరవాలు అతనికి లభించాయి.



కాని, సోక్రటెస్ ప్రచారాలు నగరంలోని పెద్దలు కొందరికి రుచించలేదు. సోక్రటెస్ ఉపదేశ సారాంశం ఇది: మానవుడికి నిజమయిన సుఖం ధర్మాచరణలోనే లభిస్తుంది. సుఖం కోరటం తప్పుకాదు కాని దానిని సాధించే మార్గం వేరేలేదు. మనిషికి జ్ఞానంతో గుణం కూడా పెరుగుతుంది. అందుకే నిరంతరం జ్ఞానాభివృద్ధికి కృషి చెయ్యాలి.

ఈ ఉపదేశాలు అప్పుడు ఏథెన్స్‌లో ప్రచారంలో ఉన్న కొన్ని సిద్ధాంతాలకి వ్యతిరేకంగా ఉన్నాయి. ఒక వ్యక్తి గుణానికీ అతని పరిపాలనార్హతకీ సంబంధం లేదనే వాదానికి సోక్రటెస్ సిద్ధాంతాలకీ సరిపడలేదు.

అందుచేత కొందరు 'పెద్దలు' కూడి అతని మీద నేరాలు మోపారు. సోక్రటెస్‌కి పాపభీతి లేదన్నారు. అతను యువకులని చెడగొడుతున్నాడన్నారు. విచారణ జరిపి, మరణ శిక్ష విధించి ముందుగా కొంతకాలం కారాగృహంలో ఉంచారు. సోక్రటెస్‌కి పెద్ద పదవులలో మిత్రులు లేక పోలేదు. కాని వారి సహాయం తీసుకొనటానికి అతను నిరాకరించాడు. చట్టబద్ధంగా మరణాన్నే కోరుకున్నాడు. క్రీ. పూ. 399లో అధికారుల అనుమతితో విషం తాగి చనిపోవటానికి నిశ్చయించుకున్నాడు. మరణించే ముందు సోక్రటెస్ చెప్పిన మాటలు మానవ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి.

సోక్రటెస్ పుస్తకం ఏదీ రాయలేదు. కాని అతని శిష్యుడయిన ప్లేటో రచనల ద్వారా అతని ఉపదేశాలు భావి మానవులకి మిగిలిపోయాయి.

—ఎస్. ●

మనిషి బుద్ధి

- చుక్కారెడ్డి -



సామ్రాజ్యమ్మగారికి చూపు సరిగా ఆనదు. కాని అతన్ని గుర్తుపట్టలేకపోవ టానికి కారణం అదిమాత్రం కాదు.

ఆమె గుమ్మంలో నిలబడి మెట్లమీద ఠీవిగా నుంచున్న అతన్ని మరోసారి పరకా యించి చూసింది. ఆమె భుజాలమీదుగా బాలాత్రిపురసుందరి తొంగి చూస్తోంది. అత నేమో వీళ్ళిద్దరినంకా చిరునవ్వుతో చూస్తు న్నాడు. ఇరవై, ఇరవైరెండేళ్ళుంటా యత నికి. చామనచాయ. సన్నగా పొడుగ్గా వున్నాడు. తెల్లని పాంటూ బుష్షర్టూ వేశాడు. కళ్ళకు నల్లటి అద్దాలతో హుందాగా కనిపిస్తున్నాడు. భుజానికో ఎయిర్‌బాగ్ వేలాడుతోంది. అతన్నిచూశాక సామ్రాజ్యమ్మగారికి కలిగిన మొదటి అభి ప్రాయం 'అమ్మడికి సరైనజోడు సుమా!' అని. అమ్మడు కూడా అలానే అనుకుంది.

రెండు నిమిషాలు వాళ్ళ చూపులను పట్టుకొన్నమీదట 'లోపలికి రానియ్యవా ఏమిటి?' చిరునవ్వుతో చొరవగా అడిగా డతను.

అతనిమాటలు సామ్రాజ్యమ్మగారికి కొంచెం కోపం తెప్పించాయి. ఎవరో వూరూ, పేరూలేని (తెలీని) వ్యక్తి తనని, వూరంతా పేరువింటేనే హడలిపొయ్యేతనని, ఏకవచనంతో సంబోధించినందుకు. 'అమ్మ డికి సరైన జోడు' అనే ఆమె ఆలోచన మాత్రమే అతన్ని కాపాడింది.

'ఎవర్నాయనా నువ్వు?' తన మహా కాయాన్ని అతి ప్రయాసమీద పక్కకి తొలగిస్తూ అడిగిందామె. బాలాత్రిపుర సుందరి లోపలికి వెళ్ళిపోయి తలుపుసందు లోంచి తొంగి తొంగి చూస్తోంది. అతను సామ్రాజ్యమ్మగారి ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. ఆపిల్ల వెళ్ళినవేపే చూస్తూ లోపలికి వచ్చేడు. ఎయిర్‌బాగ్‌ని ఓ కుర్చీలో పడవేసి, తనూ ఓ కుర్చీలో విశ్రాంతిగా కూచుని 'అమ్మయ్య!' అని నిట్టూర్చేడు.

అతని చూపులనే కనిపెడుతున్న సామ్రా జ్యమ్మగారి కితని వరసేం నచ్చలేదు. 'ఎవ రంటే చెప్పవేమయ్యా?' రెట్టించిందావిడ 'ఎవరు కావాలి నీకు!'

'సుందరి!' అతను ఠక్కున చెప్పేశాడు. లోపల్నించి అతన్నే దీక్షగా చూస్తున్న అమ్మడులిక్కిపడింది. సామ్రాజ్యమ్మగారికి అతనేమన్నాడో ఓపట్టాన అర్థంకాలేదు. అంత ధైర్యంగా ఆమాట అనగలిగేవాళ్ళుం టారని ఆవిడ బహుశః ఊహించి ఉండదు. ఆమె అర్థం చేసుకుని కోపంగా ఏదో అన బొయ్యేలోపలే, అతను కళ్ళజోడు తీసి ఎదట ఉన్న టేబిల్‌మీద పెడుతూ 'ఇంకా పోల్చుకోలేదా?' అన్నాడు.

తనేమనాలనుకున్నదో మర్చిపోయి అతని వంకే పరీక్షగా చూసిందావిడ. 'ఎక్కడో చూసినట్టే వుంది మొహం!' అనుకున్నది. కాని ఎక్కడ ఏ సందర్భంలో చూసిందో జ్ఞాపకం లేదు.

ఆమెనిక ఇబ్బంది పెట్టడంలో ఉన్న ప్రమాదాన్ని గ్రహించి అతను పెద్దగా నవ్వుతూ 'నేనత్తయ్యా! శంకరాన్ని!' అన్నాడు.

ఆమె నోరు తెరిచింది.

'ఏమిటీ! శంకరానివా! హారిని! ఎంత వాడివయ్యా వెంత వాడయ్యావు! ఇంకా పోల్చుకోలేదా అంటావేమిటయ్యా!' అన్న దామె ఆశ్చర్యంగా.

తలుపుచాటున నుంచున్న అమ్మడి హృదయం ఆనందంతో గెంతులేసింది. ఆపిల్ల చిన్నతనంనుంచి శంకరం గురించి తల్లిదండ్రులిద్దరూ మాట్లాడుకోటం విన్నది. అతడు తనే బావయినందుకు కాదు

సంతోషం. ధైర్యంగా 'సుందరి కావాలి' అన్న వ్యక్తే తన బావయిపోవటం.

సామ్రాజ్యమ్మగారు తన ఆశ్చర్యంతో పాలు పంచుకోటానికి కూతుర్ని పిలిచింది. 'అమ్మడూ ఇటురావే! పరాయివాడేం కాదులే! ఏడేళ్ళనాడు అలిగి పారిపోయిన విూబావే నమ్మా!' అంటూ. కాని సుందరి సిగ్గుతో బయటికిరాలేదు. అక్కడినుంచి వాళ్ళిద్దరూ స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నారాయె. వాళ్ళ మాటలుకూడా అంతకంటే స్పష్టంగా విని పిస్తూనేవున్నాయె. ఇంకెందుకూ బయటికి రావటం?

అతనోసారి తలుపువేపు నిరాశగా చూసి, వంగి బూటులేసులు విప్పుకోసాగేడు. ఓవేపు సామ్రాజ్యమ్మ ప్రశ్నలవర్షం కురిపిస్తోంది.

'ఎక్కణ్ణుంచీ రావటం? ఏం చేశా విన్నాళ్ళూ? డబ్బు బాగానే సంపాదించి నట్టున్నావ్? అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయ్యావు!' అని.

'నువ్వుమాత్రం మారిపోలేదా అత్తయ్యా! చాలా లావయి పోయ్యావు!' అంటూ నవ్వాడతను.

'నామాటకేంలే! వయసొచ్చేసింది!' అందా విడ నిరాశగా.

'సరేగానత్తయ్యా! మామయ్యేడీ?' అడిగాడు శంకరం.

'పొలంవేపు వెళ్ళారు. ఈపాటికి వచ్చేస్తుండాలే. నేనడిగిందానికి జవాబివ్వ మేమయ్యా!' జ్ఞాపకం చేసిందావిడ మళ్ళీ.

బూట్లు విప్పేసి కుర్చీ పక్కనపెడుతూ 'అదంతా ఓ పెద్ద కథలే అత్తయ్యా! తర వాత తీరిగ్గా చెప్తాగాని, ఇంటికొచ్చినవాడికి ఇట్లాగేనా మర్యాదచెయ్యడం! కాఫీ ఇద్దూ కొంచెం. అలసటగావుంది!' అన్నాడు అతను.

ఆమె చిన్నబుచ్చుకుంది. సర్దుకుని 'ఏకంగా స్నానమేచెయ్యరాదుటయ్యా! భోజనాల వేళయింది!' అన్నది.

'ప్రొద్దున స్నానం వగయిరాలు కానిచ్చే బయల్దేరాను. మామయ్యొచ్చాక ఇద్దరం కలిసి కూర్చుంటాం భోజనానికి. ప్రస్తుతానికి కాఫీ ఇద్దూ!' అన్నాడతను.

'సరే! నువ్వు కాళ్ళూచేతులూ కడుక్కో. ఇప్పుడే చేసి తీసుకొస్తాను.' అని 'అమ్మడూ! పెద్దచెంబులో నీళ్ళు పట్రా! బావ కాళ్ళు కడుక్కుంటాడు!' అంటూ లోపలికెళ్ళింది.

కాసేపట్లో బాలా త్రిపురసుందరి సిగ్గుతో అష్టవంకర్లుపోతూ, నీళ్ళు పట్టుకుని మెల్లిగా నడుస్తూ బయటికొచ్చింది.

శంకరం ఆమె వేపోసారి పరీక్షగా చూశాడు.

పదహారేళ్ళ పడుచుదనంలో వుందా అమ్మాయి. కొంచెం లావు. అయినా అందంగానేవుంది. తన భుజాలదాకా వొచ్చే ఎత్తు. పెద్ద పెద్ద కళ్ళు, కోలమొహం.

ఆమె చేతిలోంచి చెంబునందుకుంటూ 'బాగా పెరిగిపోయ్యావ్ సుందూ!' అన్నాడతను.

ఆమె ఓక్షణం తలెత్తి అతన్ని కళ్ళల్లోకి చూసి సిగ్గుతో తలదించుకుంది.

'నాదగ్గర సిగ్గేమిటే నీకూ! చిన్నతనంలో నిన్నెత్తుకుని ఆడించాను తెలుసా!' అన్నాడు శంకరం వాకిట్లోకి నడుస్తూ.

ఆమె మరింత సిగ్గుపడిపోయి లోపలికి తుర్రుమంది.

అతను ముఖమూ కాళ్ళూ కడుక్కుని వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. బాగ్‌లోంచి టవల్ తీసి మొహం తుడుచుకొన్నాడు. ఇంతలో సామ్రాజ్యమ్మ కాఫీ తెచ్చింది. అది త్రాగేసి సిగరెట్ వెలిగించాడు. ఏదేదో అడుగుదామని వచ్చిన ఆమెకి అతను బాగ్ లోంచేదో పత్రికతీసి చదువు మొదలెట్టటంతో నిరాశగా లోపలికి వెళ్ళక తప్పలేదు.

అరగంట తరువాత పరంధామయ్యగారు వొచ్చేరు. సామ్రాజ్యమ్మ చెప్పిందాకా ఆయనా అతన్ని గుర్తుపట్టలేకపోయేరు.

ఆయన స్నానంచేశాక మామా అల్లుళ్ళిదరు భోజనానికి కూర్చున్నారు. సామ్రాజ్యమ్మ వడ్డనచేస్తోంది తన భారీ శరీరాన్ని ఆయాసంగా కదిలిస్తూ. బాలా త్రిపురసుందరి వెనకగదిలో తచ్చాడుతోంది.

'ఎక్కడున్నావురా ఇన్నాళ్ళూ?' పరంధామయ్యగారు అడిగారు. మేనమామ కనక ఆయన అలాగే పిలుస్తారు అతన్ని. శంకరం ఈ ప్రశ్న వస్తుందనే ఎదురు చూస్తున్నాడు.

'హైదరాబాదులో మామయ్యా!' అన్నాడతను.

'ఏంచేశావక్కడ?'

'చదువుకున్నాను ప్రస్తుతం వ్యాపారంలో దిగేను!' చెప్పేడు శంకరం.

'అంత డబ్బెక్కడిదీ!' ఆయన ఆశ్చర్యంగా ప్రశ్నించారు.

శంకరానికి ఎట్లా మొదలెట్టాలో తెలియలేదు. వెనకగదిలో అమ్మడూ, ఎదట సామ్రాజ్యమ్మగారు ఆసక్తిగా చెవులు రిక్కించారు.

'ఆరోజు అత్తయ్య కొట్టి బయటకు వెళ్ళమనగానే ఎక్కడలేని కోపం వచ్చింది నాకు. ఈ దెబ్బలూ, చీవాట్లూ తింటూ ఎక్కువరోజులు ఇక్కడుండలేననిపించింది...'

సామ్రాజ్యమ్మగారు ముఖం మాడ్చుకుంది, 'అదేమిటి నాయనా! అలా అంటావు. నువ్వేం పరాయివాడివా నాకు! అమ్మడితో సమానం కాదటా! అదిమాత్రం తప్పుచేస్తే కొట్టలే. నువ్వంత మనసు విరుచుకుంటావనుకుంటే ఏవీ అనకపోదును. నువ్వెళ్ళిపోయాక, ఎంత ఏడిచానో, నిన్ను వెదకటానికి ఎంతమందిని పంపించానో, విూ మామయ్యనే అడగరాదూ!' అంది.

శంకరం నవ్వాడు. 'దానికి నేనేవీ అవటంలేదత్తయ్యా! చిన్నతనం కాదూ. ఆ వయసులో అలానే అనిపిస్తుంది. ఇంతకీ నువ్వలా చెయ్యటం నా మంచికే అయింది!' చెయ్యి కడుక్కుంటూ అన్నాడతను. ఇద్దరూ బయటిగదిలోకి వచ్చేరు. అమ్మడు పక్కకి తప్పుకుంది. సామ్రాజ్యమ్మ వంటిల్లు చక్కబెట్టి వాళ్ళవెనకవే బయటికి వచ్చింది.

వక్కపొడి నములుతూ చెప్పటం ప్రారంభించాడు శంకరం.

'వెళ్ళటం వెళ్ళటం రైలుస్టేషన్‌కి వెళ్ళాను. కనిపించిన రైల్లో ఎక్కేసేను. ఎక్కడికిపోతున్నానో నాకేవిూ తెలీలేదు. ఇక్కడినుండి తప్పించుకునివెళ్ళాలనే ఆత్రుత. ఓ స్టేషన్‌లో టి. సి. పట్టుకున్నాడు. రైలునుంచి దింపేసే సమయానికి నా పరిస్థితిచూసి జాలిపడి ఒకాయన డబ్బిచ్చి టిక్కెట్టుకొన్నాడు. తన ప్రక్కనే కూర్చోబెట్టుకుని అన్ని వివరాలు అడిగాడు. హైదరాబాద్‌లో దిగేక నన్ను వెంటనే తీసుకువెళ్ళారు.

ఆయన ఉండే లంకంత ఇంట్లో ఆయనా ఆయన భార్యా ఇద్దరు నౌకర్లు మాత్రమే ఉంటున్నారు. పిల్లల్లేరు ఆయనకి...'

'ఆయన పేరేమిటి?' పరంధామయ్యగారు జిజ్ఞాసగా అడిగారు.

శంకరం తడబడ్డాడు. ఓ నిమిషం ఆగి 'వెంకటరత్నంగారు ఆయనపేరు. పెద్ద వ్యాపారస్థుడు. వాళ్ళు నన్ను తమ సొంత

కొడుకు మాదిరిగా చూసుకున్నారు. అమ్మా, నాన్నా అని పిలవమన్నారు తమని. నన్ను స్కూల్లో చేర్పించేరు. మూడేళ్ళ క్రిందట ఆమె పోయింది. ఆపైన ఆయన నామీదనే ఆశలన్నీ పెట్టుకుని జీవించేడు. కాని లాభం లేకపోయింది. మూడునెల్ల క్రిందట నేను బి. ఎస్ సి. పాసవటమూ, ఆయన కాన్సర్‌తో చనిపోవటమూ ఒక్కసారే జరిగింది....'

'పాపం!' అన్నారు శ్రోతలిద్దరూ. మూడవ శ్రోత ఏమీ అనటానికి వీల్లేక వూరుకుంది.

శంకరంలో విచారమేమీ కనిపించలేదు.

'మళ్ళీ ఒంటరిగాణ్ణయ్యాను. లంకంత ఇల్లు, అందులో ఒక్కణ్ణి. ఇక ముందు ఏం చెయ్యాలో అర్థంకాలేదు. చివరికి విదేశాలకువెళ్ళి చదువుకుందామని నిశ్చయించుకున్నాను. ఆయనుండగానే పెళ్ళిచేసుకోమన్నారు నన్ను. కాని నేనే ఒప్పుకోలేదు. మీరూ నేను దూరమయినా, మీకు తెలియపరచకుండా ఎట్లా చేసుకునేదీ! అప్పట్లో రావటానికి వీల్లేకపోయింది ఆయన జబ్బుతో హాస్పిటల్‌లో ఉండటంతో. ఇక వారం రోజుల్లో ఈ దేశం విడిచిపెట్టబోతున్నాను. వెళ్ళేప్పుడయినా మిమ్మల్నందరి నోసారి చూసిపోదామనిపించి ఇక్కడికి వచ్చేను. మళ్ళీ ఏడాది దాకా తిరిగిరాను' ముగించాడు శంకరం.

పరంధామయ్యగారు అల్లుడు ప్రయోజకుడయినందుకు సంతోషించారు. ఇన్నాళ్ళూ ఆయనకిదో మనోవేదన క్రింద ఉండేది. శంకరం ఇంట్లోంచి వెళ్ళిపోవటానికి తను కారణం కాకపోయినా నలుగురు తననే వేలెత్తి చూపిస్తున్నట్టనిపించేది. అతను బ్రతికి ఉన్నాడో లేదో కూడా తెలీదిన్నాళ్ళూ. అకస్మాత్తుగా తిరిగిరావటం, అదీ అదృష్టం వెంటబెట్టుకుని, ఆయనకానందం కలిగించింది.

సామ్రాజ్యమ్మ అల్లుడు వారంరోజుల్లోనే దేశం విడిచిపెట్టి వెళ్ళిపోయేవాడనీ, ఏడాదిదాకా తిరిగిరాడని విని ఆలోచనలో పడింది.

బాలా త్రిపురసుందరి నిలబడే కలలు కంటోంది. అంత గొప్పవాడయిన బావ వస్తూనస్తూనే 'సుందరికావాలి' అనటమే ఆ పిల్లకి ఏదో పెద్దరికం వచ్చినట్లనిపిస్తున్నది.

మనిషి బుద్ధి

మర్నాడుదయం శంకరం నిద్రలేచేసరికి ఎనిమిదయింది. అప్పుడైనా అతను లేవక పోను. సామ్రాజ్యమ్మగారు బావని లేపమని కూతురికి పురమాయించింది. ఆ పిల్లవచ్చి ఏమని లేపాలో తోచక ప్రక్కనే అలమారులో ఉన్న రేడియో ఫుల్ వాల్యూంలో పెట్టేసింది. కళ్ళువిప్పి ఆమె చేసినపని గమనించి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు శంకరం.

ఆ అమ్మాయికి పిలవక తప్పలేదు.

'బావా! ప్రొద్దెక్కింది. లేచి మొహం కడుక్కోండి.' అన్నది సన్నగా.

'ఇప్పుడప్పుడే లేవను.' అన్నాడు శంకరం కళ్ళు మూసుకునే.

'నేన్లేపి కూర్చోబెట్టేదా!' అని నాలిక్కరుచుకుంది సుందరి. శంకరం ఆశ్చర్యంతో కళ్ళు తెరిచాడు. నిన్నంతా తప్పించుకుని తిరిగిన ఆపిల్ల అంత చొరవ చెయ్యటంతో.

'సరే నీ ఇష్టం!' అన్నాడు నవ్వుతూ.

ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది. బయటికి వెళ్ళటానికి వెనక్కి తిరిగింది. ఓరకంట ఆమెనే గమనిస్తున్న శంకరం చటుక్కున లేచికూర్చుని ఆమె చెయ్యి అందుకున్నాడు.

'ష్ వొదలండి బావా! ఏమిటిది? అమ్మ వొస్తుంది!' అన్నది విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

'వస్తే ఏం!' అంటూ అరచెయ్యిని ముద్దు పెట్టుకుని వొదిలేశాడు శంకరం. ఆపిల్ల వొళ్ళు జిల్లుమంది.

అతను వొదిలేసిన వెంటనే దూరంగా వెళ్ళి 'మొహం కడుక్కోండి. కాఫీ తెస్తాను.' అంటూ వెళ్ళిపోయింది సుందరి.

భోజనం చేశాక పరంధామయ్యగారు పొలం వెళ్ళిపోయారు. శంకరం వచ్చాడని తెలిసి వూళ్ళోవాళ్ళొక్కొక్కరే వచ్చి పోసాగేరు. అందరితో మాట్లాడి, అంతా వెళ్ళిపోయేక పత్రిక చేతిలోకి తీసుకుని కూర్చున్నాడు శంకర. అప్పటిదాక వెనక గదిలోవున్న సుందరి అంతా వెళ్ళిపోవటంతో అతనున్న గదిలోకి వచ్చింది. అతనున్నది గమనించనట్టే రేడియోదగ్గరికి వెళ్ళి ట్యూన్ చేసింది. ఏదో తెలుగు కార్యక్రమం వస్తున్నది.

'రోజూ రేడియో వింటావా సుందరా!' పలకరించాడతను.

'నాకోసమే తెచ్చాడాయె నాన్న. వినక పోతే ఎట్లా!' ఇటు తిరిగి నవ్విందాపిల్ల.

'ఎంతదాకా చదివావు?' అడిగాడు.

'అయిదు...'

'ఓస్ అంతేనా! ఫరవాలేదులే. నేన్నేర్పుతాగా!' అన్నాడు శంకరం.

'మరి నువ్వెళ్ళి పోతానంటున్నావుగా!' అమాయకంగా అడిగింది సుందరి.

'నువ్వు పెళ్ళాడతానంటే ఉంటాను మరి!' అన్నాడు శంకరం చిలిపిగా.

సుందరి సిగ్గుతో తలవంచుకున్నది.

'అమ్మేం చేస్తున్నది లోపల!' మాట తప్పిస్తూ అడిగాడు శంకర.

'ఏదో పనిచేస్తున్నది. నన్ను నీతో మాట్లాడుతూవుండమన్నది!' అన్నది సుందరి తలవంచుకునే.

శంకరం నవ్వుకున్నాడు. నిన్నటినుంచి సామ్రాజ్యమ్మ చూపుతున్న ఆప్యాయతలోని అంతరార్థం గ్రహించాడతను. తల్లీ తండ్రీపోయి దిక్కులేక మేనమామ పంచన చేరినప్పుడు, అతనికి నరకం అంటే ఏమిటో తెలిసేటట్టుచేసింది సామ్రాజ్యమ్మ. ఇప్పుడు అల్లుడు సామాన్యుడుకాడని పెద్ద చదువులు చదివాడని, డబ్బుగలవాడయ్యాడని మర్యాదలు చేస్తోంది. ఒకవేళ తను బీదవానిగానే ఈ ఇంటికివస్తే...? ఈ మర్యాదలేవీ జరిగేవికావు. సుందరిని తనదగ్గరిదాకా రానిచ్చేదికాదు. ఉన్నదంతా వేషభాషల్లో.

అతనాలోచిస్తుండగానే సామ్రాజ్యమ్మ చేతులు తుడుచుకుంటూ బయటికివచ్చింది.

వస్తూనే, 'రేపే వెళతానన్నావుటగా మామయ్యతో? నాల్రోజులుంటే అరిగిపోతావా?' నిష్ఠూరంగా అన్నదావిడ.

'లేదత్తయ్యా! వెళ్ళాలి! అక్కడ వ్యాపారం ఎట్లా నడుస్తున్నదో ఏమిటో. పైగా పాస్‌పోర్టు వగైరాలు సంపాదించాలి కద!' అన్నాడు శంకరం.

'ఏమిటోనయ్యా! నీవరస నాకేం నచ్చలేదు. ఇన్నాళ్ళు మమ్మల్నందర్నీ వొదిలి ఎక్కడో వున్నావు. రాకరాకవొచ్చి రెండురోజులైనా వుండకుండా వెళ్ళిపోతానంటున్నావు. నీ ఇష్టం. నామాట వింటావు గనకనా!' అన్నది సామ్రాజ్యమ్మ.

బాలా త్రిపురసుందరి శంకరం తెచ్చిన పత్రిక తిరగేస్తున్నదల్లా, తలెత్తి అతని కళ్ళల్లోకి చూసింది. కళ్ళతోనే 'ఉంటావా బావా!' అని అభ్యర్థించింది.

శంకరం ఆమెనుంచి కళ్ళు తిప్పుకుని 'వీల్లేదత్తయ్యా! వెళ్ళి ఉత్తరాలు రాస్తుంటాగా. ఏడాదయ్యాక మళ్ళీ వొస్తాను. అప్పుడు మీరు వెళ్ళమన్నా వెళ్ళను' అన్నాడు.

'సరే నీ ఇష్టం నాయనా!' అందావిడ. ఇంకా ఏమేమో అడగాలని చెప్పాలనీ ఉంది ఆవిడకు. కాని తొందరే మొచ్చిందని వూరుకున్నది. 'నేనలా పక్కింటికెళ్ళొస్తానమ్మా! బావతో మాట్లాడుతుండవా!' అని కూతురికి చెప్పి వెళ్ళిపోయింది.

శంకరం మరోసారి నవ్వుకున్నాడు. ఆట బొమ్మగా చూడబడుతోన్న ఆ పిల్లని చూస్తుంటే జాలివేస్తోందతనికి. స్వామాజ్యమ్మ బయటికి వెళ్ళిపోగానే చేతిలో పత్రిక టేబుల్ మీద పడవేసింది సుందరి. అతని వంక చూస్తూ 'అమ్మ ఇంత బతిమాలుతున్నా ఉండనంటున్నావు కాదూ! సరేలే!' అన్నది మూతి ముడుచుకుని అతనికి మళ్ళీ నవ్వొచ్చింది ఆమె మొహం చూసి.

'అది సరేగాని సుందరూ! ఉత్తరాలు రాస్తావా!' అడిగాడు.

'నేను అయిదోక్లాస్ చదివానని చెప్పేగా. నాకు ఎట్లా రాయటమో తెలీదు...' అందా పిల్ల.

'ఉత్తరం రాయటానికి పెద్ద చదువులేం అక్కర్లేదు. నీకు తోచినట్టే రాయాలి... నేను వెళ్ళాక అడ్రస్ ఇస్తూ ఉత్తరం రాస్తాను.' అన్నాడు శంకరం.

'సరే, కాని తప్పులుంటే నవ్వ కూడదు మరి.' అంది సుందరి.

'నవ్వనులే తప్పకుండా రాస్తావుకదూ!' అన్నాడు శంకరం.

'...సరే...'

ఈ రెండురోజుల పరిచయంతో ఉత్తరాల్లో ఏమని రాసుకోవటమో తెలీలేదతనికి, రాయమనగానే రాస్తానన్న ఆ పిల్లని చూస్తే జాలివేసింది శంకరానికి.

'నువ్వు రేడియో వింటావా బావా!' అని అడిగింది సుందరి.

'అప్పుడప్పుడు వింటుంటాను. ఏం?'

'అక్కడ మీ ఇంట్లో రేడియోవుందా?'

'ఒకటికాదు. రెండు రేడియోలు వున్నయి. చెప్పాడు శంకరం.

'రేడియో స్టేషన్ చూశావా నువ్వు!' అడిగింది సుందరి.

'చాలాసార్లు చూశాను!'

'నే నక్కడికివస్తే అవన్నీ చూపిస్తావా నాకు?'

'తయారవు మరి! వెడదాం!' అన్నాడు శంకరం నవ్వుతూ.

ఆ పిల్ల కళ్ళు పెద్దవి చేసి చూసింది. 'అమ్మో! నీ వెంటే! అమ్మ ఒప్పుకోవద్దూ!' అన్నది.

'నేను ఒప్పిస్తాగా!' అన్నాడు శంకరం మాటవరసకి. హైదరాబాద్ కు కాదు, నరకానికి పంపించమన్నా తయారే స్వామాజ్యమ్మ. ఇప్పుడు ఆమె విషయం అతనికి తెలిసినంతగా ఆ అమ్మాయి కేం తెలుసు.

'నిజం! ఏం చక్కా అక్కడికివస్తే రేడియో స్టేషన్ చూడవచ్చు. శారదా శ్రీనివాసన్ కనిపిస్తుందా మనకి?'

'ఆవిడెవరు?' అర్థం కాక అడిగాడు శంకరం.

'అయ్యో! ఆవిడే తెలీదా బావా! రేడియోలో నాటకాలు వేస్తుందీ. ఎంత చక్కగా మాట్లాడుతుందనుకున్నావ్. ఎంతబాగా నవ్వుతుందను కున్నావ్...' బావకి తెలీని విషయం చెప్పానన్న గర్వం ఆమెకి.

'ఈ సారెప్పుడున్నా విను!' సలహా ఇచ్చింది సుందరి.

'సరేలే! నీకోసం వింటాను!'

పరంధామయ్యగారు పొలంనించి రావడంతో సంభాషణ ఆగిపోయింది....

ఆ రాత్రి భోజనం చేస్తుండగా అతనూహిస్తున్న విధంగానే సంభాషణ నడిచింది.

స్వామాజ్యమ్మగారు కదిలించారు మొదట 'అయితే పెళ్ళెప్పుడు చేసుకుంటావు బాబూ!' అంటూ.

శంకరం 'ఏమో! తిరిగి వచ్చాక ఆలోచిస్తాను.' అన్నాడు.

'ఎవరయినా ఉన్నారా దృష్టిలో?' ఈసారి పరంధామయ్య గారడిగేరు.

'అటువంటిదేమీ లేదు!' అన్నాడు శంకరం నవ్వుతూ.

'అమ్మడి కీయేడు పెళ్ళి చేసెయ్యాలనుకున్నాం.' అని భర్తవేపు చూసింది స్వామాజ్యమ్మగారు ఇక మీ పంతన్నట్లు.


'నువ్వాగమంటే ఏడాది దాకా ఆగుతాం నీ కిష్టమయితేనే సుమా!' అన్నారు పరంధామయ్యగారు.

'మీ ఇష్టమే. నా ఇష్టం, అయినా వెళ్ళాక వుత్తరం రాస్తానుగా!' అన్నాడు శంకరం. అతనికి వీళ్ళందర్నీ మోసం చేస్తున్నానేమో, లేనిపోని ఆశలు కల్పిస్తున్నామేమోనని భయంగా వున్నది. కాని ఏమీ చెప్పడం అప్పుడు.

స్వామాజ్యమ్మగారు ఆకాశాన్నందుకున్నంత మురిసి పోయింది. బాలా త్రిపురసుందరి విషయం చెప్పక్కర్లేదు.

(64 వ పేజీ చూడండి)





సీరియల్

పూర్ణా సంధ్యా ప్రవర్తతే...

తేజోవతి

జరిగిన కథ

యస్. యస్. యల్. సి. పరీక్షల్లో వేణు కాపీలు పెట్టుకుంటాడు శంకరం మేష్టారు. శంకరం గారి మంచితనాన్ని గ్రహించిన వేణు అక్కయ్య జ్యోతి వేణుని శంకరంగారి దగ్గరకి ట్యూషనుకు పంపిస్తుంది. జ్యోతి, బావ ఆనందరావును వివాహం చేసికొంటుంది. శంకరంగారిమీద లేనిపోని అపోహను ఏర్పరుచుకొన్న వరదరాజులుగారు ఆయనమీద పగ బడతాడు. యస్. యస్. యల్. సి. రిజల్ట్సు సంరంభంలో పాలుపంచుకోలేకపోయిన వేణు తన యీ స్థితికి కారణమయిన శంకరంగారి మీద పగతీర్చుకుందామని వెళ్ళిన వాడు ఆయన అసలు వుద్దేశాన్ని గ్రహించి గట్టిగా చదివి ప్యాసు కావటానికి కృతనిశ్చయుడవుతాడు. తన కొడుకు చెడిపోతున్నాడన్న సంగతి శంకరంగారిద్వారా వినడం వరదరాజులుగారి కోపాన్ని రెట్టిస్తుంది.

8

ఆ సాయంత్రం జ్యోతి మబ్బురంగు పట్టుచీర కట్టుకుని తెల్లటి వెల్వెట్ బ్లౌజు వేసుకుంది. ఒంటినిండా అత్తగారి సొమ్ము పెట్టుకుంది. తలలో సన్నజాజుల మాల. కళ్ళకు కాటుక, నొసట పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకునీ అద్దంలో చూచుకుంటుండగా ఆనందరావు వచ్చాడు.

'ఓహో ఏమిటి కథ...అపర మహాలక్ష్మిలా తయారయ్యావ్....'

'అంటే నేనెప్పుడూ పెద్దమ్మలా వుంటానన్నమాట! ... అంతేనా?...' లేని కోపం తెచ్చుకుంది జ్యోతి.

'నీ వింత వ్యాఖ్యానాలకేమిగానీ...ఇంతకూ ఎందాకా ప్రయాణం?...'

'మీ రమణయ్యగారింట్లో పేరంటం పిల్చారు. వెళ్ళాలి...'

'మంచిపిల్లవు...దోవలో వస్తున్నావ్... అలా అందరితో స్నేహం కలుపుకోవాలి... వెళ్ళిరా' అంటూ దగ్గరకొచ్చి బుగ్గన చిటికె వేశాడు ఆనందరావు.

సుశీల, జ్యోతి యిద్దరూ రమణయ్య గారి హాల్లోకి అడుగు పెట్టేసరికి అక్కడున్న ముత్తయిదువలందరి కళ్ళూ జ్యోతి మీద వాలాయి.

'రామ్మారా ... ఇలా కూర్చో ... నువ్వు రావేమోననుకున్నాను...' అంది రమణయ్య గారి భార్య భద్రమ్మగారు.

అందరూ తనవైపలా చూస్తుంటే జ్యోతికి అదోలా అనిపించింది. 'జూ'లో వింత మృగాన్ని చూసినట్లు ఏమిటి వీళ్ళు అనిపించినా ఆ భావం కన్పించనీయలేదు. మాట్లాడకుండా వెళ్ళి ఓ మూల కూర్చుంది.

'ఒక్క హారతి పాట పాడమ్మా అమ్మ వారిమీద...' పక్కన కూర్చున్న ఓ ముత్తయిదువ అడిగింది.

'నాకు పాటలు రావండీ...'

'అయ్యో!... అంత చదువుకున్నదానివి. నీకు పాటలు రావంటే ఎంత తెలివి తక్కువ వాళ్ళమైనా నమ్ముతామటమ్మా...' మరో ఆవిడ అందుకుంది.

'మీరు పాడండి ఒక మంచి పాట...' జ్యోతి ఆవిడనే అడిగింది.

'మా పాతకాలపు పాటలు మీకు నచ్చుతాయటమ్మా?...'

'నాకు పాత పాటలంటేనే యిష్టం... ఏదీ ఒక పాట పాడండి...' అని జ్యోతి అడిగేసరికి ఆవిడ అధ్యాత్మ రామాయణ కీర్తన ఒకటి పాడింది. అది అంత శ్రావ్యంగా లేకపోయినా, 'బాగుందని' మెచ్చుకుంది జ్యోతి. ఆవిడ ఎవరో కాదు. రమణయ్యగారి కోడలు లక్ష్మి. జ్యోతి బాగుందనే సరికి ఆవిడ మొఖం సంతోషంతో వికసించింది. లక్ష్మి కూడా యించుమించు జ్యోతి వయసుదే. కానీ వద్దన్నాలుగా వీట కాపురానికి వచ్చిన ఆ అమ్మాయి అప్పుడే నలుగురు పిల్లల తల్లయి, ముఖంలోనూ, మాటల్లోనూ కూడా ముసలి తనపు ఛాయలు కనబడుతున్నాయి.

'ఈ పట్టుచీర పెళ్ళిలో పెట్టిందా... ఎంతకు కొన్నారు?...' అని అడిగింది లక్ష్మి జ్యోతి కట్టుకున్న పట్టుచీరను ముట్టుకు చూస్తూ.

'ఒసేయ్ లక్ష్మీ!...వరలక్ష్మీ వ్రతానికి మీ మామయ్య పట్టుకొచ్చిన చీర తీసుకొచ్చి ఆవిడకు చూపించు....' అంటూ భద్రమ్మగారు కోడలికి ఆజ్ఞవేసింది. లక్ష్మి చీర చూపించింది. ఎర్రటి ఎరుపు రంగు చీరకు బెత్తెడు జరీ అంచు. లక్ష్మి చామన ఛాయ రంగు అనేకంటె నలుపు అనడం మంచిది. చీర చూసిన జ్యోతి, 'లేత రంగు తీసుకోక పొయ్యారా? బాగుండేది...' అంది నోరు జారి.

నవ్వుతున్న లక్ష్మి ముఖం చిన్న బోయింది. భద్రమ్మగారు కూడా మూతి ముడుచుకొని, 'లేత రంగులు వీళాబోటి వాళ్ళకు. మాకెందుకు? నాకు కోరు స్తయ్యా పాడా?...' అంది.

జ్యోతికి తన తప్పు తెలిసొచ్చింది. సహృదయంతో చేసిన విమర్శను అర్థం చేసుకోడానికన్నా అవతలి వారిలో కొంత సౌజన్యం, సంస్కారం వుండాలి. అలా లేనప్పుడు విమర్శించడం విరోధాలను కొని తెచ్చుకోడమే అవుతుంది. అందుకే జ్యోతి వెంటనే, 'అయినా యీ రంగూ బాగానే వుంది. పట్టు కూడా మంచి పట్టు. చాలా బాగుందండీ...' అంది. బాగుందన్నంత మాత్రాన తనకు ఒరిగిపొయ్యేదేముంది! అనవసరంగా వాళ్ళ మనసు నొప్పించడమెందుకని?...

'నిజంగా బాగుందా?...' లక్ష్మి మొహం అప్పటిగ్గాని వికసించలేదు.

'నిజంగానేనండీ...ఆ రంగు మీద ఆ అంచు బాగా ఘనంగా కనబడుతోంది...' అని నచ్చచెప్పి, 'ప్రొద్దుపోయిందం'టూ లేచిన జ్యోతిని అంతా తమ తమ యిళ్ళకు రావలసిందని ఆహ్వానించారు. 'సరే' నని తలూపింది. జ్యోతి.

'అనుకున్నాంగానీ ... ఏమంత హాళ్ళా

పెళ్ళా రకంలా లేదు...' అంటున్న గుసగుసలు వినిపించాయి జ్యోతికి. అయినా జ్యోతి ఏ ఆశతో పేరంటానికి వచ్చిందో అది అక్కడున్న వాళ్ళందర్నీ చూశాక నిరాశే మిగిలింది. నిరుత్సాహంతో తలంచుకొని ఆలోచిస్తూ నడుస్తున్న జ్యోతిని చూచి, 'వదినమ్మా! ఏమిటాలోచిస్తున్నావ్ ?'...అని అడిగింది సుశీల.

'సుశీలా!...ఈ వూళ్ళో రవణ అనే ఆవిడ యిల్లు తెలుసా నీకు?...' వెంటనే అడిగింది జ్యోతి.

'రవణా !...ఇంటిపేరదీ తెలుసా వదినమ్మా?'

'ఆ వివరాలు గుర్తులేవుగానీ...భర్తపేరు వెంకట్రావనుకుంటాను.'

'వెంకట్రావు భార్యా?!!...' సుశీల అనగానే జ్యోతిమొఖం విప్పారింది.

'నీకు తెలుసా సుశీలా!...మీ అన్నయ్యగారిని ఎన్నిసార్లడిగినా తెలియదన్నారు... వీళ్ళింట్లో అయినా కన్పిస్తుందనుకున్నాను... వాళ్ళిల్లు కాస్త చూపించవా ?...' బ్రతిమాలుతూ అడిగింది జ్యోతి.


'అన్నయ్యకు తెలియదన్నాడా?...'

'తెలియదుట...'

సుశీల ఒక్కక్షణం ఆలోచించింది. 'నాకూ తెలియదొదినమ్మా ... అన్నయ్యకు తెలుసేమో అడుగుదామనుకున్నాను...' అంది మెల్లిగా.

జ్యోతి తెల్లబోయి చూసింది సుశీల మొఖంలోకి. ఈ అమ్మాయికి అసలు నిజంగానే తెలియదా ?...లేక తెలిసే తెలియదంటోందా? ... అనేది నిశ్చయించుకోలేక మాట్లాడకుండా యిల్లు చేరుకుంది జ్యోతి. ఆరోజు రాత్రి ఆనందరావును అడిగింది, 'నేనుకూడా వరలక్ష్మీవ్రతం చేసుకోవాలనుకుంటున్నాను ... అందర్నీ పిలుస్తాను ... ఏమంటారు?'

'నీకంతటి మంచికోరిక కలగాలే కానీ నే వద్దంటానా?...' అన్నాడు ఆనందరావు. నోములూ, పూజలూ భగవంతునిమీద ధ్యానము కుదరడానికి ఏర్పరిచినవని జ్యోతి అభిప్రాయము. ఆ భగవంతునిమీద మనసును కేంద్రీకరించకుండా ఏ నోములు నోచినా, ఏ పూజలుచేసినా, ప్రార్థనలు జరిపినా అన్నీ నిష్ప్రయోజనాలని జ్యోతి వుద్దేశం. ఇప్పుడు 'వరలక్ష్మీవ్రతం' చేస్తే



"ప్రాతస్సంధ్యా ప్రవర్తతే..."

నడంలో రెండు వుద్దేశాలున్నాయి. ఇరుగు పొరుగుకు తనమీదున్న అపోహలు తొలగించి వాళ్ళతో స్నేహం కలపడానికి యిదొక మంచి వుపాయం...రెండోది యీ విధంగానైనా తన ప్రాణస్నేహితురాలు రమణను చూడగలనేమోనన్న ఆశ...

రేపు వ్రతమనగా ముందురోజే సుశీలను తీసుకుని పేరంటం పిలవడానికి వెళ్ళింది జ్యోతి. సుశీల చూపిన అందరిళ్ళల్లోనూ పిలిచాక, 'సుశీలా!...అటువైపు కూడా యిళ్ళున్నట్టున్నాయి. పిలుద్దాం పద...' అంది.

'ఆవీధిలో వద్దు వదినమ్మా...వాళ్ళు మనపార్టీవాళ్ళు కారు...'

'అంటే మనమేపార్టీ ?...వాళ్ళేపార్టీ ?...' అయోమయంగా వుంది జ్యోతికి.

'మొన్న ఎన్నికల్లో వాళ్ళు అన్నయ్యకు ఎగస్పార్టీవాళ్ళు. అన్నయ్యను ఓడించాలని ఎంత ప్రయత్నం చేశారని ! ... అందుకే మన పార్టీ వాళ్ళెవరూ ఆ వీధుల్లోకి వెళ్ళరు...వాళ్ళిటు రారు...' అని చెప్పింది సుశీల.

'ఎలక్షన్లలో పోటీ చేసుకున్నంత మాత్రాన విరోధమెందుకు సుశీలా?...మేం చదుకునేరోజుల్లో మా క్లాసులో ఇందిర, జయ అని యిద్దరు స్నేహితురాళ్ళు వుండేవాళ్ళు. వాళ్ళిద్దరూ మ్యునిసిపల్ ఎలక్షన్లలో బద్ధ విరోధుల కూతుళ్ళు...అయితేనేం వాళ్ళిద్దరూ ఎంత స్నేహంగా వుండేవాళ్ళని!...ఈమాటు పిల్చివద్దాం విరోధమెందుకు?...' అంది జ్యోతి. బహుశా రమణ ఆవీధిలో వుందేమోనన్న ఆశ చిగురించింది మనసులో...ఎలాగైనా పిలవాలని ముందుకు సాగింది జ్యోతి.

'వద్దు వదినమ్మా...నీకు తెలియదు. వాళ్ళు రారు...నువ్వెళ్ళినా నేను రాను బాబూ...అన్నయ్య కోప్పడతాడు...' అంటూ అక్కడే ఆగిపోయింది సుశీల.

జ్యోతి నిర్ఘాంతపోయింది. ఇంత చిన్న పిల్లకు ఎంత పట్టు!...ఈ పంచాయతీ రాజ్యం, యీ ఎలక్షన్లు వచ్చి, ఒక్క కుటుంబంగా మెలగాల్సిన గ్రామాన్ని రెండుగా చీలుస్తున్నయ్యా!...ఇదేనా యిప్పటిదాకా సాధించిన గ్రామాభివృద్ధి!...ఇదేనా మన పెద్దలు కలలుగన్న గ్రామ సౌభాగ్యం!... ఇప్పుడు తను మొండిగా వెళ్ళినా రమణ అక్కడవుందని నమ్మకమేమిటి?...అయినా యీ వూరేనని తనకు బాగా జ్ఞాపకం... ఒకటి రెండు వుత్తరాలు కూడా వ్రాసింది రమణ...వెళితే మాత్రం యిల్లిల్లూ వెతుక్కుంటూ ఎలా వెళ్ళడం?...ఒకవేళ యీ వూరునుండి వెళ్ళారేమో?...తమపెళ్ళి శుభలేఖ పంపినా పెళ్ళికిరాలేదు...నిజంగా రమణ వుండేవుంటే అది రాకుండా వుండలేదు. కనీసం 'శుభాకాంక్షలు' అయినా పంపివుండేది...అని చాలాసేపు తర్కించుకుంది జ్యోతి...చివరికి లాభం లేదనిపించి తనూ సుశీలను అనుసరించింది విధిలేక.

మరునాడు పేరంటానికి వచ్చిన అమ్మలక్కలందరూ జ్యోతి కుట్టుపనులు అల్లికలూ ఆసిచూచి మెచ్చుకున్నారు...

'వదినమ్మా...ఈ ఎంబ్రాయిడరీ చాలా బాగుంది...నువ్వు నేర్పుతానంటే మధ్యాహ్నం పూట వస్తాను...' అని అడిగింది రవణయ్యగారి కూతురు సరోజిని.

'అన్నిటికంటె ఆకర్టెను డిజైను అల్లిక చాలాబాగుంది...నేనా డిజైను నేర్చుకుంటాను...' అంది లక్ష్మి వుత్సాహంగా...

'దానికేం భాగ్యం...మీకు నేర్చుకోవాలనుకుంటే తప్పక నేర్పుతాను...' అంది జ్యోతి.

ఆ మరునాటి నుండీ కుట్లు అల్లికలు నేర్చుకోడానికి రావడం మొదలెట్టారు వుత్సాహంవున్న యువతులు. మొదట మొదట ముచ్చట్లన్నీ వండుకున్న కూరలమీద, కట్టుకున్న చీరలమీద, అత్తగార్లు పెట్టే ఆరడిమీద సాగినా, క్రమంగా జ్యోతి వాళ్ళలో విద్యమీద ఆసక్తి కలిగించింది. ఆసక్తివున్న సుశీలా, లక్ష్మి, సరోజిని లాంటి వాళ్ళకు చదువు చెప్పడం కూడా మొదలెట్టింది జ్యోతి.

జ్యోతి ఇంత కృషిచెయ్యడంలో ఆంతర్యం 'నీకు జీవంలేని పుస్తకాలతో తప్ప జీవమున్న మనుషులతో మెలగడం తెలిస్తేగా?' అన్న ఆనందరావు అధిక్షేపణకు మాటల్లో కాక చేతల్లో జవాబు చెప్పాలన్న సంకల్పమే!...జ్యోతి యీ కృషికి ఆనందరావు మనస్ఫూర్తిగా ప్రోత్సాహిస్తున్నాడు...

ఆరోజు సాయంత్రం శ్రావణ మేఘాలు ఆకాశంలో ఒత్తుగా వ్యాపిస్తున్నాయి. రంగు రంగుల భావాల కలయిక, చిత్రమైన సంస్కృతుల సమ్మేళనంలా, తూర్పున ఏర్పడిన యింద్రధనుస్సు చూపరులను ఆకర్షిస్తున్నది. ఒళ్ళో సన్నజాజులు పోసుకుని మాలకడుతున్న జ్యోతి ఆనందరావు ఏదో ఆలోచిస్తూ కూర్చోడం గమనించి, 'ఏమిటాలోచిస్తున్నారు?...' అని అడిగింది.

'ఇవ్వాళ మామయ్యదగ్గరనుండి వుత్తరం వచ్చింది. రంగడు బొత్తిగా చదవటం లేదుట!...వాడ్నయినా చదివించి వృద్ధిలోకి తేవాలనుకున్నాను.' ఆనందరావు నిస్పృహతో నిట్టూర్చాడు.

'అన్నగారిలా రాజకీయాలలోకి దిగుతాడేమో లెండి...' జ్యోతి వ్యంగ్యంగా అన్నది.




సౌందర్యమైన చర్మంతో
ప్రారంభమవుతుంది సౌందర్యం
గోద్రెజ్ చందన సబ్బు అత్యంత
శుద్ధమైన చందన తైలంతో చేయబడింది—
మీ చర్మాన్ని శుభ్రపరచడంతోపాటు.
అది చర్మానికి వెన్నవంటి
మృదుత్వాన్ని యిస్తూ
అందమైన కాంతిని,
చాలా కాలము నిలిచే
పరిమళాన్ని యిస్తుంది.
అది చాలాకాలం
వాడుకకువుంటూ మీ
డబ్బుకు సరైనచక్కని
విలువనిస్తుంది. ప్రతి బిళ్ళ,
కొనుగోలుకు దొరికే
యే యితర చందన సబ్బు
బిళ్ళకన్నా నాల్గవవంతు
పెద్దది.
గోద్రెజ్ వారి
లగ్జరీ
సాండల్
సబ్బు
Sandal
LUXURY SOAP by Godrej
క్రొత్త శ్రేష్ఠమైన అసలైన
చందన పరిమళము

వ్యార్త్యా సంధ్యా ప్రవర్తతే.

'రాజకీయాల్లో బ్రతకడమంటే సుడి గుండాల మధ్య పడవ నడపడమన్నమాట... ఇవ్వాళ పెద్ద పదవుల్లో కీర్తిప్రతిష్ఠలు ఆర్జించుకున్న వాళ్ళు రేపు సోదిలోకి గూడా రాకుండాపోవచ్చు ... ఎప్పుడు ఎవరు సుడి గుండాల్లో చిక్కుకుంటారో ఎవరికీ తెలియదు. అందుకనే వాడు పీటల్లోకి దిగడం వాకిష్టంలేదు జ్యోతీ!...'

'అన్నీ తెలిసేనన్నమాట యిందులోకి దిగారు?...' అంది జ్యోతి.

'తెలిసినా యిప్పుడేమీ చెయ్యలేను జ్యోతీ!...ఒకసారి పీటల్లోకి దిగితే యిక బయట పడడం కష్టం...'

'పోనీ రంగణ్ణి మాదగ్గరే వుంచుకుని చదివించుదాం... ఇక్కడికి తీసుకురండి...' అని సలహాయిచ్చింది జ్యోతి.

'అయినా అదే రాశాడు...అదీకాక వాళ్ళ వ్యాఖ్యని చేసుకోలేదని ఆయనకు కొంచెం కష్టంవుంది...ఎందుకొచ్చింది రేపెళ్ళి తీసుకొస్తాను...'

ఆనందరావు అన్నప్రకారం తమ్ముణ్ణి తీసుకొచ్చాడు. వాడికి యింటికొచ్చి ప్రైవేటు చెప్పేందుకు ఒక మేష్టర్ని కూడా ఏర్పాటుచేశాడు. రంగడికి చెట్లెక్కడం, వేలగట్లంబడి తిరగడంమీదున్న శ్రద్ధ చదువుమీదలేదు. ఆ ట్యూషను మేష్టరు వచ్చినప్పుడు కాసేపు ఎలాగో బలవంతాన కూర్చొనేవాడు. ఆయనటు వెళ్ళగానే వూరివెంబడి తిరిగేవాడు. ఓరోజు ఆనందరావు తమ్ముడి చదువుగురించి జ్యోతిని వాకబుచేశాడు.

'భేష్...చాలా శ్రద్ధ చూపిస్తున్నారు తమ్ముడి చదువుమీద?...' ఎగతాళిగా అంది జ్యోతి.

'ఏ చదవటంలేదా?...'

'ఎందుకు చదవటంలేదు' రమణయ్యగారి జామచెట్టుమీద, మనింట్లో వుసిరిక చెట్టుమీద భలే చదువుతున్నాడుగా!...'

'అదికాదు జ్యోతీ! నేనెప్పుడూ చిన్న మీద తిరుగుతుంటానుగదా...నీవు కాస్త వాణ్ణి అదిలిస్తుండ గూడదా?...'

'సరే లెండి! ... అంత పిచ్చాకారం కంటె అదినిష్కారం మేలుట! నేను ఎప్పుడైనా తప్పిజారి ఓ దెబ్బవేశా నంటే తిట్టి పోసేందుకా?... అంతకంటె పట్టించుకోక పోవడమే మంది!'

'బాగుంది! నువు మాత్రం వాణ్ణి అనవసరంగా ఎందుకు కొడతావ్? ఆ మాత్రం తెలీదానాకు!...మనం కొట్టినా తిట్టినా వాడిమంచి కోరే వాళ్ళమే...చెడు కోరే వాళ్ళం కాదుగా...'

'ఆమాత్రం నమ్మకముంచారు చాలు!... ఇక నుండీ వాడి చదువు విషయం నే చూసుకుంటాను...' అని హామీ యిచ్చింది జ్యోతి.

మరునాడుసాయంత్రం ప్రైవేటుమేష్టరు వచ్చేవేళకు రంగడికి కనబడకుండా తలుపు చాటున నక్కింది జ్యోతి ... అంతదాకా హుషారుగా గాలిపటం తయారు చేస్తున్న రంగడి మొఖం మేష్టారిని చూడగానే మాడిపోయింది. గాలిపటం బీరువా క్రిందికి తోసేసి కడుపు నొక్కుకుంటూ, మూలుగుతూ మేష్టారి ముందుకొచ్చాడు...

'ఏరా?... ఎందుకు మూలుగుతున్నావ్?...' వాడి బాధంతా నిజమేననుకున్న మేష్టారు గాభరగా అడిగారు.

'కడుపు నొప్పండీ...మధ్యాహ్నం నుండీ ఒకటే నొప్పి...' మెలికలు తిరుగుతూ చెప్పాడు రంగడు.

'అయితే వెళ్ళి పడుకో పో ... యీ పూటకు పాఠం వొద్దులే...' అని చెప్పి ఆయన వెళ్ళిపోయ్యారు. ఆయనటు వెళ్ళగానే దాచిన గాలిపటం తీయబోతున్న రంగడు, 'ఎప్పటి నుండి రా రంగా కడుపు నొప్పి?...' అన్న వదిన ప్రశ్న విని నిజంగానే వొణికి పొయ్యాడు.

'మ...మధ్యాహ్నం...నుండీ...' అన్నాడు బిక్క మొగంతో యిక యివ్వాళ గాలిపటం ఎగరేసే వీలులేదురా అనుకొంటూ.

'అయితే నాతో చెప్పలేదేం?... ఇలారా పడుకో... మందిస్తా తగ్గిపోతుంది...' అంది జ్యోతి అలమారలో మందుసీసా తీస్తూ...

మందనగానే రంగడి గుండెలు ఝల్లుమన్నాయి, 'అదే తగ్గిపోతుందిలే వదినా, మందొద్దు...' అన్నాడు బిక్క బిక్కగా...

'ఏ రోగమైనా మంచి మందు పడందే తగ్గదు...' అంటూ గ్లాసుతెచ్చి, నోరు తెరవమని బలవంతంగా గొంతులో పోసింది జ్యోతి. ఘాటుఘాటుగా తిమ్మిరిగా వున్న ఆ మందు మింగేసరికి రంగడికి కళ్ళంట నీళ్ళొచ్చాయి. నిండా ముసుగు తన్ని పడుకున్నాడు...ఆ రాత్రికి జ్యోతి అన్నం కూడా పెట్టలేదు రంగడికి ... అదంతా దొంగ నొప్పని జ్యోతికి తెలుసు. కానీ యీ మధ్య తల నొప్పనీ, కడుపు నొప్పనీ చదువెగ్గొట్టడం బాగా అలవాటయింది రంగడికి. ఓసారి గట్టిగా బుద్ధి చెబితేగానీ దోవలోకి రాడని అనుకుంది. పిల్లల శ్రేయస్సు కోరిన వాళ్ళు ఒక్కోసారి కఠినంగా వుండక తప్పదని తెలుసు జ్యోతికి...రంగడికి ఆకలి గిజగిజలాడిపోతోంది. 'అన్నం పెట్టు' అని అడుగుదామంటే 'మందు పోస్తానం టుందేమోనని' భయం...ఆ రాత్రి ఎంతకూ నిద్రపట్టని రంగడు 'యికముందెప్పుడూ వదినతో అబద్ధాలు చెప్పనని' ఒట్టేసుకున్నాడు. మర్నాడు పొద్దుటే కాఫీ పెడ్తుంటే వచ్చి పక్కన కూర్చున్న రంగణ్ణి చూసి, 'ఏరా కడుపునొప్పి ఎలా వుంది?...పాలుతాగుతావా?...ఈ పూటగూడా అలాగే పస్తు పడుకుంటావా,' అని అడిగింది జ్యోతి...

రంగడికి భోళ్ళున ఏడుపొచ్చింది...కళ్ళు తుడుచుకుంటూ, 'నాకు కడుపునొప్పి లేదు...' అన్నాడు.

'మరి నిన్న ఎందుకలా చెప్పావ్?... చదువు ఎగ్గొట్టి ఆడుకోవచ్చనా?...'

అవునని తలూపాడు రంగడు...పీక్కుపోయిన మొఖం, ఉబ్బిన కళ్ళు...వాణ్ణి చూస్తే జాలేసింది జ్యోతికి...'మరి యింకెప్పుడూ అలా అబద్ధాలు చెప్పనని చెంపలేసుకుంటే అన్నం పెడతాను...' అంది.

'ఇంకెప్పుడూ చెయ్యనొదినా...ఇంకెప్పుడూ చెయ్యను...' ఆకలిమంటా, ఏడుపూ కలిసి గట్టిగానే చెంపలు వేసుకున్నాడు రంగడు.

జ్యోతి ఆప్యాయంగా వాణ్ణి దగ్గరకు తీసుకుని కళ్ళు తుడిచి రాత్రికూడా అన్నం తినలేదని గడ్డపెరుగువేసి అన్నం పెట్టింది. ఆ తర్వాత వాడికి తలదువ్వి మంచిబట్టలు వేస్తూ, 'రంగా! నీకు చదువుకోవాలని లేదా?...చదువుకోకపోతే అందరూ 'చదువు

కానీ మొద్దూ కదలదేని ఎద్దు' అని ఎగతాళి చెయ్యరట్రా?...' అని మంచిగానే అడిగిన వదినకు, 'నాకు చదువుకోవాలనే వుంది.. కానీ...' అంటూ నసిగాడు రంగడు ...వాడికి ఏదో చెప్పాలనివుంది కానీ భయపడుతున్నాడని గ్రహించిన జ్యోతి ఆ విషయం తెలుసుకోవాలని ప్రైవేటుమేష్టరు వచ్చేవేళకు చాటుగా నిలబడివుంది...

మేషారు రావడమే తరువాయి, 'నాలుగో ఎక్కం చెప్పరా రంగా?...' అన్నారు. 'నాలుగొకట్ల నాలుగు...' అంటూ రంగడు ఎక్కం చెప్పుకుపోతున్నాడు...గోడ కానుకుని కాళ్ళు ముందుకు బారచాచి మధ్య మధ్య గోక్కుంటూ ఎక్కడో ఆలోచిస్తూ 'ఆఁ... ఆఁ...' అంటున్న పంతులుగారు 'అరేయ్!... ఎంత?... నాలుగేళ్ళు యిరవైయా?...ఇరవైయా?...మువ్వైనోరు...పైకి వినబడకూడదు...' అంటున్నారు.

జ్యోతి తలుపు చాటునుండి తొంగి చూచింది. లోపల్లోపలే ఏడుపు దిగమింగుతున్న రంగడు, కళ్ళు తుడుచుకుని ఎర్రగా కందిపోయిన తొడను చూచుకుంటున్నాడు..

జ్యోతి మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. కొందరు కొందరికి నోరు ఆడుతున్నంతసేపూ, చెయ్యి ఆడుతుండడం అలవాటు. అలా చీటికి మాటికి కొడుతుంటే చదువు పేరు చెబితే అసహ్యం, మేష్టరంటే ఓ పెద్దపులి అనేభావం ఏర్పడుతయి. ఆటల మీద ఎంత ఆసక్తి చూపుతారో, చదువు మీద కూడా అలాంటి ఆసక్తి కలిగించినప్పుడే పిల్లలకు చదువుమీద శ్రద్ధ, ఆసక్తి కలుగుతయి.

ఆరాత్రి ఆనందరావును అడిగింది జ్యోతి 'మన వూళ్ళో ఎన్ని ఎలిమెంటరీ స్కూల్స్ వున్నయి?...' అని.

'రెండు...ఏం ఎందుకు కావల్సివచ్చింది?..'

'నాకు వాటిని చూడాలని వుంది...'

'ఏం రాణీగారి మనసు యివ్వాళ ఎలిమెంటరీస్కూల్స్‌మీదికి మళ్ళిందేం?'

'రంగడికి ఆ ప్రైవేటు మేష్టరిని మాన్పించేసి ఎలిమెంటరీస్కూల్లో చేర్పించాలి. అవసరమైతే మంచిమేష్టరును కూడా పెట్టాలి...'

'పథకం బాగానే వుందిగాని — మను మాట్లాడాలంటే ఆ పంతుళ్ళను యిక్కడికే పిలిపిస్తాగా...'

'ఏం నేను వెళ్ళి స్కూల్స్ చూడగూడదా?...'

'కూడదనికాదు... బాగుండదేమోనని... ఇంతదాకా ఏ కలవారికోడలూ అటువంటి చోట్లకు వెళ్ళడం నేను చూడలేదు... అది మనయిళ్ళల్లో సంప్రదాయంకాదు.'

'సాంప్రదాయాలూ, కట్టుబాట్లు, అనేవి మనకు మనం సృష్టించుకున్నవి. అవి మనకు అనుల్లంఘనీయాలూ, అభేద్యాలూ కావు. అసలైనా సంప్రదాయాలపేరట ఎన్నాళ్ళు ఆడవాళ్ళు నిలా కట్టేస్తారు బయట ప్రపంచం చూడకుండా ? ... ఇవ్వాళ ఒక్కరం సాహసించి అనాచారంగా వస్తున్న ఆ సంకెళ్ళను విచ్ఛిన్నం చేస్తే, రేపటినుండి యిదే సంప్రదాయమంటూ ప్రజలు మనమార్గాన్నే అనుసరిస్తారు...'

ఆనందరావు నవ్వుతూ వింటున్నాడు జ్యోతి చెప్పేది... చివరికిజ్యోతి, 'ఇదోండి మీకు కోపంవస్తేవచ్చింది. ఒక్కటిమాత్రం సత్యం. అసలు స్త్రీలకు విద్య, తగిన స్వాతంత్ర్యం లభించందే.. వాళ్ళదృక్పథంలో మార్పురాందే మీరు ఎన్నిప్రణాళికలు అమలు జరుపుకోండి, ఎన్నిపథకాలు వేసుకోండి... మీపల్లెలు బాగుపడవు...' అంది ఆవేశంతో...


'అమ్మా! ఒప్పుకున్నాంగానీ ... యిక ఆపండి తమ ఉపన్యాసం... ఎందుకొచ్చింది నేను నీతో వాదించలేను... అహా... అది కాదు...కాకిచేత కబురంపితే వచ్చివాలుతారు పంతుళ్ళు...ఈకాస్తదానికి మనం వెళ్ళటమెందుకూ అని?...' అప్పటికీ అయిష్టంగానే నసిగాడు.

'ఒక ఉపాధ్యాయుడి మంచి చెడ్డలు నిర్ణయించాలంటే ఆయనదగ్గర చదువుకునే పిల్లలమధ్యనే చూడాలి...' అని నొక్కి చెప్పింది జ్యోతి.

ఆనందరావుకు ఒప్పుకోక తప్పలేదు. మరునాడు ప్రొద్దున్నే జ్యోతి ఆనందరావు యిద్దరూ బయలుదేరారు. ముందు యింటికి దగ్గర్లోవున్న స్కూల్‌కి తీసుకువెళ్ళాడు ఆనందరావు...'ఇదే...పి. ఎస్. ఎలిమెంటరీ స్కూల్...'

'ఇదా!!!'

జ్యోతి అంత ఆశ్చర్యపోవడంలో వింతేమీ లేదు. దాన్ని స్కూల్ అనేకంటే పశువుల పాక అనడం మేలు...పశువుల పాకకే తడికలు పెట్టి స్కూల్ అన్నారేమోననిపిస్తుంది. పైకప్పు నామమాత్రమే ... ఆ చుట్టూ తడికెలూ నామమాత్రమే ...వాన వస్తుందనగానే పిల్లల్ని యింటికి పంపుతారు. ఆ స్కూలు ముందున్న ఖాళీ స్థలంలో యిరుగూ పొరుగువాళ్ళు కట్టేసుకున్న పశువుల పేడా, రొచ్చూలోంచి బయలుదేరి ఈగలు, దోమలు, వచ్చే అతిథులకు ముందు స్వాగతం చెబుతయి, 'జుంయి' మని ముసురుతూ స్కూలు చిమ్మడమనేది ఏ ఆరు నెలలకో, ఏడాదికో జరిగే విషయంతప్ప



"పూర్వాసంధ్యా ప్రవర్తతే..."

నిత్యమూ జరిగే విషయం కాదని చూడగానే చెప్పెయ్యవచ్చు. అయితే ఆ స్కూల్లో పంతుళ్ళందరూ ఆనందరావుకు ఎలక్షన్సులో మంచి సాయం చేశారు.

జ్యోతి ఆపరిసరాలను చూచి అసహ్యించుకుంది...

'ముఖం చిట్లిస్తున్నావ్?...అయిందీ?... నే ముందే చెప్పలా?...' అన్నాడు ఆనందరావు. పోనీ వెళ్ళిపోదామా అని ధ్వని ఎచ్చేలా...

'ఛీ!...ఈ పరిసరాల్లో వున్న స్కూలుకు వచ్చి చదువుకోడానికి ఏ పిల్లాడి మనసొప్పుతుంది. పాఠశాల శుభ్రంగానూ, ఆకర్షణీయంగానూ వున్నప్పుడే పిల్లలకు ఆ బడికి పోవాలని ఆసక్తి కలుగుతుంది కానీ,ఇలాంటి స్కూల్‌కి రావడానికి ఎవరిష్టపడతారు?... అనుకుంది జ్యోతి.

'పదండి...ఇంతదూరం వచ్చింది స్వయంగా చూడాలనేగా?....

'పరిసరాలు నువ్వు కనీసం ఎప్పుడూ చూసికూడా వుండవనే వద్దన్నాను' చుట్టూతా వమిలిపడేసిన చెఱుకు ముక్కలపిప్పి, ఒక ప్రక్క పిల్లలు 'ఒకటికి' పొయ్యేచోటు లోనే బుట్టలుపెట్టుకుని అమ్ముతున్నారు చక్రాలు. ఇటువంటి పరిసరాలు నిజంగా యిదివరలో ఎప్పుడూ చూడలేదు జ్యోతి.

'దిగందే లోతు తెలియదు...తినందే రుచీ తెలియదు...లోపలికి వెళ్దాం పదండి...'

'సరేపద...నేను చెబితే నువు ఏనాడు విన్నావు గనుక?...'

జ్యోతి ఆనందరావులు లోపలికి వెళ్ళే సరికి ఎదురుగా కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు మేష్టరు...ఆ క్లాసులో వున్న పది, పదిహేనుమంది పిల్లల్లో, నలుగు రాడపిల్లలు ఒకపక్కగా కూర్చుని అచ్చనకాయలు ఆడుకుంటున్నారు. మరో యిద్దరు చుక్కలాట లాడుకుంటున్నారు. ఇంకో పక్కగా ఓ ఐదారుమంది మొగపిల్లలు ఒకచోటచేరి చిన్నసైజు యుద్ధానికి సన్నద్ధులవుతున్నారు. మరో క్లాసులో యిద్దరు టీచర్లు ఒకచోటచేరి సొంత సొద కాబోలు వెళ్ళబోసుకుంటున్నారు. మిగతా యిద్దరు ఐపూ అంతూ లేరు. పిల్లలంతా రొజారొజగా అర్చుకుంటూ, ఒకరి నొకరు తన్నుకుంటూ గోలచేస్తున్నారు.


జ్యోతి ఆనందరావులను ముందుచూచింది పిల్లలు. గాభరాగా ఒకరి తర్వాత ఒకరు లేచి 'నమస్కారమండీ...' 'నమస్తే...'అంటూ తలా ఓరకంగా తమకుతోచిన విధంగా చెబుతున్నారు. వాళ్ళగొడవతో మెళుకువవచ్చిన మేష్టరు వీళ్ళను చూడగానే కంగారు పడుతూ... 'రండి...రండి...' అన్నాడు చేతులు జోడించి.

ఆయనబట్టలు బాగామాసి మురికి కంపు కొడుతున్నాయి. దువ్వని తలజుట్టు చిందర వందరగావుంది. క్లాసునిండా కాగితం ముక్కలు పడివున్నయి. అనుకోకుండా 'ప్రెసిడెంటు'గారు ఆయన సతీమణితోసహా విచ్చేయడంతో వాళ్ళకు చాలా చిత్రంగా వుంది. 'రండమ్మా రండి...' అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళి కుర్చీ తెచ్చివేశారు.

'తమరింత దూరం శ్రమతీసుకోవాలా?... మాట మాత్రం.,' ప్రక్కగా నిలబడి నసిగాడో పంతులు.

ఆనందరావు ఏదో చెప్పబొయ్యేంతలో జ్యోతి కల్పించుకుని, 'స్కూలు చూద్దామని వచ్చాం...' అని తనే ముందు చెప్పేసింది.

''మహద్భాగ్యం... రండి... రండి...' అంటూ లోపలంతా త్రిప్పి చూపారు... ఇంచుమించు స్కూలంతా అలాగే వుంది.



పిల్లలందరూ, మాసిన బట్టలు రేగిన తలలతో వున్నారు. జ్యోతికి ఆ స్కూలులోన ఎక్కువ సేపు నిలవబుద్ధి పుట్టలేదు. స్కూలు నుండి బయటపడగానే...'స్కూల్లో ముగ్గురు టీచర్లే కనబడుతున్నారేం?...' అని అడిగింది జ్యోతి.

'మిగతా యిద్దరూ పనిమీద ఎటో వెళ్ళుంటారు...' అని చెప్పాడు ఆనందరావు...

'ఇదే ఎవరన్నా యిన్‌స్పెక్టింగ్ అథారిటీ వస్తే?...'

'వస్తే ఏం చేస్తారేం?...'

'ఓహో!... వీరు తమ అస్మదీయుల్లో వారన్నమాట!...తమ అభయ హస్తం సదా వీరి కండగా వుంటుందికాబోలు!...' వెటకారంగా అంది జ్యోతి.

ఆనందరావు నవ్వి వూరుకున్నాడు.

'ప్రభుత్వం నిర్బంధ ప్రాథమిక విద్య నమలులో పెట్టారుగదా, స్కూల్లో అంత తక్కువ మంది పిల్లలున్నారేం?...' జ్యోతి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

'ఆఁ...స్కూలుకి సరిగా రారు పిల్లలు... ఆ కండక్టర్లు వెళ్ళి పిల్లల్ని యిళ్ళల్లో తిరిగి పిల్చుకొస్తారు ... మరి కాస్సేపటికి 'పంతులూ, మావాడు గొడ్లకాయాల... పంపండి...'అంటూ 'మేము పొలమెళ్ళాల యింటికాడ పిల్లల్ని సూడాలి...' పిల్లల్ని పంపమని అందరూవచ్చి పిల్చుకెళ్తుంటారు. పంతుళ్ళుమాత్రం ఎక్కడని అవస్థపడతారు పాపం?...ఏమన్నా అంటే 'ఈ పంతులు మంచివాడు కాదంటారని' వాళ్ళ భయం...'

'ఆ ప్రజలకు గట్టిగా చెబుదామంటే ఓట్లు పడవేమోనని మీకు భయం. అంతేనా?...' జ్యోతి నవ్వుతూ అడిగింది.

'ఇదో... నువ్విలా మాట్లాడ్డం ఏం బాగుండలేదు...'ఆనందరావు కొంచెం నిష్ఠూరంగా అన్నాడు. జ్యోతి యింక మాట్లాడలేదు. మౌనంగా అతడి వెనకాల నడిచింది.

'ఇదో....యిదే రెండో స్కూలు.... ఆనందరావు మరో పూరి పాకను చూపాడు.

ఆ స్కూలుగూడా యించుమించు జీర్ణావస్థలోనే వుంది. ఎటొచ్చీ, పోయిన తడికలకు పాత చాపలు అతుకుపెట్టి వున్నాయి. పరిసరాలు మాత్రం శుభ్రంగా చిమ్మి

వున్నాయి. ఎక్కడా ఒక్క కాగితం ముక్కా గానీ, గడ్డిపరకగానీ కన్పడలేదు.

'సింగిల్ టీచరు స్కూల్...లోపలుంటాడు శర్మమేష్టరు...వెళతావా?...నేనూ రావాలా?...' ఆనందరావు గంభీరంగా అడిగాడు...అతడికి శర్మ అంటే ఇష్టాదు. బహుశా క్రిందటి ఎలక్షన్సులో శర్మమేష్టారు ఎవ్వరి వైపు ప్రచారం చెయ్యకుండా తటస్థంగా వుండడం కారణం కావచ్చు....

'మీరుకూడా రండి' ప్రార్థేయపూర్వకంగా అడిగింది జ్యోతి. విధిలేక జ్యోతి వెనక లోపలకు వెళ్ళాడు ఆనందరావు.

జ్యోతి వెళ్ళేసరికి శర్మ మేష్టారు అటు తిరిగి బోర్డుమీద లెక్కలు వేస్తున్నారు. ఇవతలగా నిలబడి జ్యోతి 'లోపలకు రావచ్చునా మేషారూ?...' అని ప్రశ్నించింది మర్యాదగా.

తిరిగి చూచిన శర్మ విభ్రాంతుడై, 'రండి...లోపలకు రండి...' అంటూ ఆహ్వానించాడు. ఆయన బట్టలు పాతవే అయినా, అక్కడక్కడ కుట్టిన అతుకులు చాలా వున్నా, శుభ్రంగా మాత్రం వున్నాయి. పిల్లలందరూ తమ ప్రెసిడెంటుగారిని చూడగానే మౌనంగా లేచి నిలబడ్డారు ... 'కూర్చోండి...' అని ఆనందరావు చెప్పగానే అంతా మౌనంగా కూచున్నారు.

పిల్లలందరూ శుభ్రంగా తలలు దువ్వుకుని, వుతికిన బట్టలు వేసుకుని చూడ ముచ్చటగా వున్నారు. ముందు వరుసలో కూర్చున్న పాపను చూడగానే జ్యోతికి ముచ్చటేసింది.

'పాపా!...నీపేరేమిటి?...' అని అడిగింది.

'సీత.' అని లేచి నిలబడి ముద్దుగా చెప్పిందా పాప.

'అబ్బో!...తాటాకుచాపలు వేసుకున్నారే అంతా!...మీ యింటినుండి తెచ్చుకున్నారా?'

'లేదండీ...క్రింద కూర్చుంటే బట్టలు మాస్తాయని మేము తాటాకులు తెచ్చుకున్నాం...మరేమో మా మేషారు చాపలల్లి యిచ్చారు...' అని చెప్పిందా పాప.

'ఆమూల చిన్న తాటాకు బుట్ట పెట్టారెందుకు?'

'అదే..అది...కాగితం ముక్కలూ, చెత్తా అందులోవేస్తాం.'

'ఆ మూల...అదేమిటే చిన్న డబ్బా, నీళ్ళు?'

'మరేమో...పలకా అదీ తుడుచుకోవాలంటే వుమ్మేసి తుడుచుకోకుండా ఆ నీళ్ళు పెట్టి తుడుచుకుంటాం. రోజూ ఆ డబ్బాలో వేరే నీళ్ళుపోస్తుంటాం.' అని చెప్పింది ఆ పాప.

'ఓహో...బాగుందీ ఏర్పాటు.' అంది జ్యోతి. తర్వాత శర్మ మేష్టారితో 'మా మరిది రంగడ్ని మీ స్కూల్లో చేర్పించాలనివుంది. రేపు పంపిస్తాము. ఏ 'స్టాండర్డు'కు పనికివస్తాడో పరీక్షించి ఆక్లాసులో వేసుకోండి.' అని చెప్పింది.

'అలాగేనండి...రేపు పంపించండి.' అన్న శర్మ మేషారితో 'మీక్లాసు డిస్టర్బు చేసినట్లున్నాం క్షమించండి.' అంటూ నమస్కరించింది జ్యోతి.

'ఫర్వాలేదండీ...' అంటూ ప్రతి నమస్కారంచేశాడు శర్మ.

తిరిగివచ్చేస్తూ అంతదాకా మౌనంగా వున్న ఆనందరావుతో 'మీకు రంగడ్ని యీ స్కూల్లో చేర్పించడం యిష్టం లేనట్లుంది?....' అని అడిగింది జ్యోతి.

'వాడి చదువు బాధ్యత నీ కొప్పజెప్పాను... అంతా నీ యిష్టం' ముభావంగా అన్నాడు ఆనందరావు.

(ఇంకావుంది

అధ్యక్షుని మరణం

(8వ పేజీ తరువాయి)

కెన్నెడీ కాళ్లదగ్గిర ముడుచుకుని కూర్చున్నాడు!

ఒక్కొక్కరుగా పెద్ద ఉపన్యాసకులంతా లేచి, గొంతుకలు సవరించుకుని మాట్లాడి హర్షధ్వనుల మధ్య మళ్లీ ఆసీనులయ్యారు. అధ్యక్షుడు అంత వాక్ప్రతిభ ప్రదర్శించ లేదు. కేవలం లెక్కలతో నిండిన సమాచారం వప్పచెప్పాడు. వినేవారికి, 'ఈయన చాలా తేలికగా మాట్లాడేస్తున్నాడే!' అనిపించేట్లు ఉన్నప్పటికీ ఆయన బొస్టన్‌లో ఒక పాఠశాలలో ఉపన్యాసానికి సంబంధించిన అభ్యాసం ఎంతో కష్టపడి చేశాడని చాలా మందికి తెలియదు. వేదికమీద ఆయన ధోరణి చాలా సునాయాసంగా కనిపించేది; ఆయన చేతులని చూడగలిగితే నిజం బయట పడిపోయేది. అందుకనే వాటిని కనిపించకుండా బల్లకింద దాచాడు! వాలంటీకి మాత్రం వాటిని ప్రత్యేకంగా పరిశీలించే అవకాశం కలిగింది. నరాల బలహీనతకల మనిషి చేతులవలే వణికిపోయాయుట! ఎప్పుడయినా చేతితో బల్లమీద అభినయంచేసి చూపించవలసి వచ్చినప్పుడు నిదానంగా ఉన్నట్లే ఉన్నా తిరిగి కిందదాచగానే వణకు ప్రారంభించేదిట...

తర్వాతి మజిలీ ఫోర్ట్‌వర్త్. అక్కడ హొటల్ టెక్సాస్‌లో దిగారు. హొటల్ నిండా పెద్ద టోపీలు వేసుకున్న మనుష్యులు కిక్కిరిసి ఉన్నారు. (టెన్‌గాలన్ హాట్'లు ఈ ప్రాంతానికి ప్రసిద్ధి.) పౌర పాటున అధ్యక్షుడికి చిన్న గదులూ, ఉపాధ్యక్షుడికి పెద్దవీ ఇచ్చారు! 'హొటల్ ఏర్పాట్లు అన్నీ చెడ్డాయి!' అన్నాడు కెన్‌వోడాన్నెల్ తర్వాత. అధ్యక్షుడి గదిలో 'ఎయిర్ కండిషనర్' కూడా సరిగ్గాలేదు. శ్రీమతి కెన్నెడీ గది అతిసామాన్యంగా ఉంది. కిటికీలో నుంచి బయటికి చూస్తే మంచి దృశ్యం కనిపించటం లేదు. బల్లమీద సందేశాల కట్ట. బల్ల పక్కనే ఆమె పెట్టెలు. తన కార్యదర్శి ఎక్కడ? అలిసి పోయిన అధ్యక్షుడి సతీమణి పెట్టెల ముందు కూలబడి బట్టలు బయటికి తియ్యటం ప్రారంభించింది. నిద్రపోయే ముందు అధ్యక్షుడిని కలుసుకుంది.

'ఇవాళ నీ ఉపన్యాసం చాలా బావుంది!' అన్నాడు ఆయన. 'వంటోల్ల ఎలా ఉంది'?

'అబ్బ! అలిసి పోయాను!'

కెన్నెడీ సునాయాస ధోరణి ఎంత కృత్రిమమయినదో అతని వోపిక కూడా అంతే! తేలికగా అలిసి పోయేవాడు. మగతగా, 'నాతోబాటు లేవక. నేను పొద్దున బ్రేక్‌ఫాస్ట్ ముందే మాట్లాడాలి. నువ్వు పక్క వదిలి లేవక! ఫలహారానికి మాత్రం తొమ్మిదింపావుకి వచ్చేశయి,' అన్నాడు. గుడ్‌నైట్ చెప్పింది ఆవిడ.

దీపం ఆర్పేసే ముందు జాక్వెలీన్ కెన్నెడీ మర్నాడు తను వేసుకోనపోయే దుస్తులవి బయటికి తీసి సిద్ధంగా ఉంచింది: 'నేవీబ్లూ' బ్లవుస్ నేవీ హాండ్ బాగ్, అంత ఎత్తు నుడమలులేని చెప్పులు, గులాబి రంగు స్టూట్, గులాబి రంగు టోపీ — డల్లాస్‌లో తను వేసుకోవాలని అధ్యక్షుడు చెప్పిన డ్రెస్...

(ఇంకా వుంది)

కొత్త సీసాల్లో

(9-వ పేజీ తరువాయి)

ప్రభుత్వంలోనూ, ప్రయివేటు రంగంలోనూ కూడా దక్షిణాదివారు అధికం కావటంతో మహారాష్ట్రులకి అన్యాయం జరుగుతోందని ఆయనవాదం.

శ్రీ ఠాక్రె ప్రచారానికి ఆయన ఆశించినంత సంచలనం కలగలేదు. దానికి కాలం కలిసిరాలేదు. మహాత్మాగాంధీ జాతీయోద్యమం అప్పుడు దేశాన్ని కదిల్చివేస్తోంది. జాత్యయికమత్యం జాతీయాశయం అయిపోయింది. ఈ వర్గద్వేష ప్రచారానికి అంత ప్రాముఖ్యత రాలేకపోయింది. అంతేకాక, ఆర్థిక ఇబ్బందులవల్ల శ్రీ ఠాక్రే తన పత్రిక నిలపవలసివచ్చింది. ఆయన రేపిన దక్షిణ భారత వ్యతిరేకోద్యమం కాలగర్భంలో కలిసిపోయింది.

కొన్ని దశాబ్దాలుగా ఠాక్రె పేరు మరుగున పడింది. తిరిగి 1950 ప్రాంతాలలో 'సమ్యుక్త మహారాష్ట్ర సమితి' ఏర్పడి బొంబాయి విభజన కోరేదాకా ఆయన మళ్లీ ప్రజాదృష్టిలో ప్రముఖపాత్ర వహించలేక పోయాడు. వార్తా పత్రికలలో ఆయన తన వ్యాసాలతోకొంత సంచలనంకలిగించగలిగాడు.

నేడు, కేశవ్ సీతరావ్ ఠాక్రె వృద్ధాప్యంలో, ఆయనపేరు ఆయన కుమారుడు బాల్‌ఠాక్రె నిలబెట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

అయితే, బాల్‌ఠాక్రె తండ్రికన్నా ఎక్కువ లౌక్యుడు. రాజకీయాలలో దిగే ముందు తన ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టుకుని మరీ దిగాడు. ఇంకొకరి ఆసరాలేకుండా తనని తనే పోషించుకొనగలిగే ఏర్పాట్లు చేసుకున్నాడు. ఆయన అఖిలభారత కీర్తి



1966 లో ఛాయాచిత్ర బహుమానం, జర్మన్ ఛాయా చిత్రకారుడు శ్రీ ఎక్కీహర్డ్ సాక్ తీసిన ప్రసిద్ధ అమెరికన్ రచయిత శ్రీ జేమ్స్ అర్థర్ బాల్డ్విన్ ముఖచిత్రానికి లభించింది.

కల వ్యంగ్య చిత్రకారుడు.

శ్రీ బాల్‌ఠాక్రే ప్రచురించే వారపత్రిక 'మార్మిల్' (తనతండ్రి స్థాపించిన 'ప్రబోధన్' వంటి పత్రిక) మంచి అమ్మకం కల పత్రిక. అందులోని ఆయన కార్టూన్‌లు బహుళ ప్రజాదరణని పొందగలిగాయి, పొందుతున్నాయి. అంతేకాక, సాహిత్య ప్రమాణాల దృష్ట్యా 'మార్మిల్' స్థాయి అధికమయినది.

ఇటీవల ఎన్నికల సందర్భంలో తన తండ్రి ఆశయాలకి అనువుగా ఉండే ఉద్యమం తిరిగి ఉధృతంచేసే అవకాశం బాల్‌ఠాక్రేకి కలిగింది. తండ్రి గురుత్వం ఉండనే ఉంది. కాబట్టి జాతీయ విచ్ఛిన్నాన్ని పెంపొందింపే ఈ ఉద్యమం నేర్పుతో నడిపించగలడని నిస్సందేహంగా చెప్పవచ్చు!

ఈ ప్రచారం కొత్తదేమీ కాదు. కొత్త సీసాలలో పోసిన పాత పానీయం.

— ఒక విలేఖరి ●

భోజనం వదిలేసి విసురుగా అందరిని కసిరిన సుజాత ప్రవర్తన చూసి తమ మధ్య ఏదో జరిగిందని అందరూ గుర్తిస్తారేమోనని సిగ్గుతో చితికిపోయాడు సుధాకర్. రాత్రి భోజనం చెయ్యకుండానే గదిలోకి వచ్చి ముసుగు బిగించి పడుకుంది సుజాత.

మొట్టమొదటిసారిగా... పండక్కి అత్త వారింటికి వచ్చాడు! ఎంతో ఆనందంగా, సరదాగా నలుగురిలో గడపవలసింది! ఏమిటిది?...ఎంతో చికాకనిపించింది సుధాకర్‌కి. అందరూ ఏమనుకుంటారు?... పెళ్ళయిన మూడునెలలకే తమ గురించి నలుగురూ నానా రకాలుగా అనుకోవడం తనకి యిష్టం లేదు. ఈ వున్న నాలుగు రోజులు ఎలాగో అలాగ సర్దుకుని గడపాలి మామూలుగా! యింటికి వెళ్ళాక యీ సమస్య ఎదురవదుగా యింక!

తెల్లవారితే పండుగ! సుజాత రేపూ యిలాగే ప్రవర్తిస్తే పండుగపూటా కూతురు, అల్లుడు యిలా వుంటే యింట్లో వాళ్ళు బాధపడతారు? యింత అవివేకంగా ఆలోచించే మనిషికి తను యిప్పుడు ఏం చెప్పినా అర్థమవదు! అసలు అర్థం చేసికోవడానికే ప్రయత్నించని మనిషికి చెప్పి ప్రయోజనంలేదు! నెమ్మది మీద తనకే అర్థం అవుతుంది తన అపోహ, ఉత్తి ఊహేనని!

'యిలా అనవసరంగా తామిద్దరూ కోపాలు పెంచుకుని, తమ మధ్య కలతలు పెంచుకోవడం వల్ల ఏం లాభం లేదు! జీవితాంతం ఒకటిగా గడపవలసిన తమలో యిప్పటినించి భేదాభిప్రాయాలు రాకూడదు! యిలా మనశ్శాంతి లేకుండా బాధపడే కంటె సుజాతకి ఏదో చెప్పి ప్రసన్నురాలిని చేసుకోవాలి!

పెళ్ళయిన యీ మూడు నెలల్లో తామిద్దరిమధ్య అసలు చిన్న మాటపట్టింపు లైనా రాలేదు! యింతసేపు ... యిలా సుజాతతో మాట్లాడకుండా ఎన్నడూ లేదు!... యింకా పంతం పెంచుకుని కూర్చోలేక పోయాడు సుధాకర్. నెమ్మదిగా లేచి ప్రక్కన కూర్చుని సుజాతని తన వైపు తిప్పుకున్నాడు.

'యింకా కోపం పోలేదా సుజా!' ప్రేమగా అడిగిన సుధాకర్ మొహంలోకి చూడలేక కళ్ళు వాల్చుకుంది సుజా.

గురివింద

(15 వ పేజీ తరువాయి)

'ఎందుకు చెప్పు అనవసరంగా యీ కోపం, యీ అనుమానం, ఏడుపు? నా మీద నీకా మాత్రం నమ్మకం లేదా? ... మూడు నెలలయింది, నేనెలాంటివాడనో అర్థంచేసికోలేదా?'... రాజీ ధోరణిలో ఆరంభించాడు సుధాకర్.

'నాకు కోపంవస్తే మీకేం బాధ' యింకా బింకంగానే అంది సుజాత.

'నాకు కాకపోతే మరెవరికి బాధ! ఏదో నాలుగురోజులు సరదాగా వుందామని వచ్చాం...నీవిలా కోపాలు ఏడుపులు సాగిస్తే అందరూ ఏమనుకొంటారు? ... యీపాటి దానికి రావడమెందుకు యిక్కడికి?... నీ విలాగే వుంటే నేను రేపే వెళ్ళిపోతాను, అలా అయితే నీకు తృప్తి కలిగితే చెప్పు!' సుజాత కొంత మెత్తబడింది. ఎర్రబడిన కళ్ళతో 'ఏం నాలోనే ఎంతసేపటికీ మీకు తప్పు కనిపిస్తోంది!... నేను మిమ్మల్ని ఏం అనలేదు, తను...ఆవిడ, మీ మీద ఎందుకు అంత ఇంటరెస్టు చూపాలి! భార్యాభర్తల మధ్యకి ఎందుకు రావాలి!...'

'సరే...సరే...మళ్ళీ ఎత్తకు ఆ గొడవ! నీ కంత అనుమానమయితే నేనసలు ఆవిడతో మాట్లాడనే మాట్లాడను!...అసలు ఆవిడ వున్నప్పుడు మీ యింటికే రాను... సరేనా!'

'నేను అలా...అన్నానా?' కలవరపాటుతో అడిగింది సుజాత.

'నీ వనక పోయినా నే నంటున్నాను!... యింక నిశ్చింతగా వుండు!' సుజాత మొహంలో భర్త యిచ్చిన భరోసాతో వెలుగు కనపడింది.

* * *

'సుజా!...మళ్ళీ యివాళ నాన్న దగ్గిర నించి ఉత్తరం వచ్చింది. బాబుని చూడాలని నాన్న వూరికే కలవరిస్తూ రాస్తున్నారు. బాబు పుట్టి అప్పుడే పది నెలలయింది,...యింకా ఎప్పుడు తీసుకొస్తారని వారానికి ఒక ఉత్తరం రాస్తున్నారు... మనవడిని చూడాలని తాత, మామ్మవూరికే ముచ్చట పడుతున్నారు...నా కిప్పుడప్పుడే శలవదొరికేట్టు లేదు...నిన్ను, బాబునయినా పంపమంటున్నారు...మీరిద్దరూ వెళ్ళి ఒక నెలవుండండి...నేను ఓ నాలుగు రోజులు శలవపెట్టి వచ్చి తీసుకు వస్తాను...యీ మనవడికోసం ఆ తాతగారూరికే కలవరిస్తున్నారు...' కొడుకుని ముద్దులాడుతూ, అన్నాడు సుధాకర్.

'మీరు లేకుండానా,...... ఒక్కతినీ వెళ్ళనా!'...కొంత అయిష్టంగానే అంది సుజాత.

'పరవాలేదు...ఒక నెలేగా! ... అంతలా రాస్తున్నారు...వెళ్ళకపోతే బాగుండదు,... నిన్ను...బాబుని పంపిస్తున్నానని రాస్తాను నాన్నకి'...

* * *

'అదేంరా?...ఉత్తరం లేకుండా దిగావు... ఇంకా వారానికి వస్తానన్నావు?' రైలుదిగి వచ్చిన సుధాకర్‌ని చూస్తూ ఆశ్చర్యపోయింది తల్లి.

'లేదమ్మా, ముందు అనుకున్నానుగాని,... మళ్ళీ వారం మా జనరల్ మేనేజర్ వస్తున్నాడు, అప్పుడు శలవదొరకదు,...అందుకని యిప్పుడే శలవతీసుకున్నాను నాలుగు రోజులు...వెళ్ళేటప్పుడు సుజాని తీసుకు వెడతాను...ఏదీ ఎవరూ యింట్లో కనపడరేం?' నాలుగు వైపులా చూస్తూ అడిగాడు సుధాకర్.

'నాన్నగారు అలా షికారు వెళ్ళారు,... సుజాతని, పిల్లల్ని తీసుకుని మీ బావ సినిమాకి వెళ్ళారు'...

'బావ వాళ్ళు వచ్చారేమిటి?...'

'ఆ...వారం రోజులయింది, పద్మ, బావ వచ్చారు...అందరూ సరదాగా తిరుగుతున్నారు...నీవు కూడ లేవని ఎంతో యిదవుతున్నారు'...

'ఏం అన్నయ్యా...బాగున్నావా?'...... పద్మ లోపల్నించి వస్తూ అడిగింది.

'పద్మా!...నీ వింట్లోనే వున్నావా?...నీవు వెళ్ళలేదూ!...'కొంత ఆశ్చర్యంగా అడిగాడు.

'అందరం వెడదామనే అనుకున్నాం... తీరా సాయంత్రం అయ్యేసరికి నాకు కొంత జ్వరం తలిగినట్లుంది...టికట్లు కొన్నారని... సుజాత వాళ్ళని తీసుకుని మీబావ వెళ్ళారు!'


'ఊహూ' పాలోచనగా అన్నాడు సుధాకర్.

'లేవరా,...స్నానం అదీ చెయ్యి,... భోంచేద్దువుగాని'...లోపలికి వెడుతూ తల్లి అంది.

ఉల్లాసకరంగా జీవించండి


మఫత్‌లాల్ గ్రూప్ షర్టింగులు

శరీరానికి వ్యాపించే స్టయిల్, సంభ్రమింపజేసే రకముల
సాహసమైన దట్టపు ధారలు, మీ స్థాయికైన సహచారి
సర్వసిద్ధంగా లభ్యం. మీరెక్కడున్నా దానిని
ధరించండి జీవితం ఉల్లాసకరం. మఫత్‌లాల్
గ్రూప్ షర్టింగులను ఎన్నుకోండి. బుష్‌షర్టులకు,
మరియు ఇతర మామూలు ధారణకు 2x2
కాటన్ 'టెరీన్' కాటన్ టెరిలైట్
మోఫినైట్ మరియు హైట్ క్వాలిటీలో



న్యూ శోరక్ (శోరక్)
అహమదాబాద్. న్యూ శోరక్,
నడియాడ్. స్టాండర్డ్,
బొంబాయి. స్టాండర్డ్
(న్యూచైనా), బొంబాయి
స్టాండర్డ్, దేవాస్.
సాసూన్ బొంబాయి.
సాసూన్, (న్యూయూని
యన్), బొంబాయి
సూరత్ కాటన్, సూరత్.
మఫత్‌లాల్ ఫైన్, నవసారి.

LPE-Aiyars M. 153 TL.



ఇన్‌ఫెంటోన్

గ్రైప్ వాటర్ రిజిస్టర్డ్

పాపాయిని సంతోషముగా
వుంచును

పాపాయిల జీర్ణశక్తిని
వృద్ధి పరచును. అన్ని
కాలములలోనూ వాడవచ్చును.

హైదరాబాద్ కెమికల్ అండ్
ఫార్మస్యూటికల్ వర్క్సు లిమిటెడ్,
హైదరాబాదు-20.

AA

'అదేమిటి చెప్పా పెట్టకుండా వచ్చేశారు' సినిమానించి వస్తూనే సుధాకర్‌ని గదిలో చూసి ఆశ్చర్యంగా అడిగింది సుజాత.

'తెలిస్తే ... జాగ్రత్తపడే దానివా?' అదోలా అడిగాడు సుధాకర్...'విహారాలు అయ్యాయా దేవిగారికి!'

'...విహారాలు ఏముంది...ఏదో సినిమాకి వెళ్ళాం...' బట్టలు మార్చుకుంటూ మామూలుగా అంది సుజాత.

'మా బావతోనా?' సుధాకర్ గొంతులోని వ్యంగ్యం సుజాత గుర్తించలేదు.

'ఊ...అందరం వెళ్దాం అనుకునే వేళకి, మీ చెల్లెలికి వంట్లో బాగులేదని రాలేదు, మేము వెళ్ళాం!...' అంతకంటె అప్పుడు యింక ఏం అనాలో తెలియక ఊరుకున్నాడు సుధాకర్.

* * *

'అయ్యాయా, అందరికి శుశ్రూషలు!... అయిందా మా బావగారికి పరిచర్య' పాపం నీకు సేవలతో ఊపిరి ఆడుతున్నట్టు లేదే?'

'బాగుంది శ్రమ అనుకుంటే ఎలా?... అత్తవారింట్లో ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా? కూర్చుంటే అందరూ ఏమనుకుంటారు?' పమిట చెంగుతో చమట వత్తుకుంటూ ఆయాసపడుతూ అంది సుజాత.

'అ...ఆహా!...అలాగా?' వెక్కిరింపుగా అదోలా అన్నాడు సుధాకర్. అది గమనించకుండానే సుజాత జడవిప్పుకుంటూ... 'యింక అలాగే పడుకున్నా రేమిటి? మూడు గంటలయి పోతూంది,...అందరూ తయారయి పోయారు...మనమే వుండిపోయాం!... లేవండి...!' తొందరపెడుతూ అంది సుజాత.

'ఎక్కడికి?' తాపీగా పడుకునే అడిగాడు సుధాకర్.

'బాగుంది...పొద్దున అందరం పిక్నిక్‌కి వెళ్దాం అనుకున్నాంగా...మరచి పోయారా?'

'నేనెందుకు?'

'అదేమిటి, మీరు రారూ?' వింతగా చూసింది సుజాత.

'నేనెందుకు మీ మధ్య?...నీవు, బావ అందరూ సరదాగా వెడుతూంటే మీ మధ్య నేనెందుకు?...' అదోలా అన్నాడు సుధాకర్.

'ఏమిటి?' తెల్లబోయింది సుజాత.

'అవును, వారంరోజుల నించి మీరు షికార్లకి, సినిమాలకి అన్నింటికీ వేడుతున్నారు యివాళ మీ మధ్య నేనెందుకు?'

'ఏమిటి మాట్లాడుతున్నారు మీరు?' ఎఱ్ఱబడ్డ ముఖంతో సుజాత అడిగింది.

'తెలుగే మాట్లాడుతున్నాను!...వెళ్ళండి సరదాగా...వెళ్ళండి...నీకు మొగుడి అవసరం ఏమిటి? తీసికెళ్ళడానికి మా బావ వున్నాడుగా' కాస్త కఠినంగా అన్నాడు సుధాకర్.

'ఏమిటిది?...ఏమిటిలా క్రొత్తగా మాట్లాడుతున్నారు? ఏమిటి మీ ఉద్దేశం?'

'నా ఉద్దేశం ఏమిలేదు!...నేను రాను, నీవు వెళ్ళు!'

'మీరు రాకపోతే నేనెలా వెడతాను? నేనూ వెళ్ళను?'

'ఓహో!...ఏం పతిభక్తి?...ఏం నటన! యిన్నాళ్ళు తిరగ్గా లేనిది యివాళ ఏం వచ్చింది?' హేళనగా అన్నాడు సుధాకర్.

'నటనా?...నాది నటనా!...ఏ మయింది మీ కివాళ, యిలా మాట్లాడుతున్నారు?'... కోపంగా అడిగింది సుజాత.

అవును నామాటలు బాగుండవు, నీ చేతలు బాగున్నాయా?'

'నేనేం చేశాను?...ఏమిటీ అర్ధం పర్ధం లేని మాటలు, చెప్పేది సరిగా అర్ధం అయేట్టు చెప్పండి' తీక్షణంగా చూసింది సుజాత.

'కాస్త ఆలోచిస్తే అర్ధం నీకే బోధపడుతుంది...మొగుడున్నాడని కూడా మరచిపోయి, పరాయి మగవాడితో సినిమాలు, షికార్లు...నేను లేనని యింత బరితెగిస్తావా?' సూటిగా సుజాత మొహంలోకి చూస్తూ అడిగాడు సుధాకర్.

నివ్వెరపోయి చూసింది సుజాత... 'ఆ... ఎవరా పరాయి మగవాడు? నేనెవరితో తిరిగాను?... ఎవరి గురించి మీరిలా అంటున్నారు?' సుజాత గొంతు వణికింది.

'మా బావ!... మా బావ నీకు పరాయి మగవాడు కాక స్వంతవాడా?' సుజాత కోపం కట్టలు తెంచుకుంది. 'ఏమిటా మాటలు!... ఏం అంటున్నారో అసలు మీకు తెలుస్తోందా?...ఏదో సరదాగా నలుగురితో కలసి, మా బావగారితో సినిమాలకి, షికార్లకి వెళ్ళినంతమాత్రాన యిలా మాట్లాడుతున్నారా?...కాస్త కట్టుకున్న పెళ్ళాం యింకో మగవాడితో మాట్లాడినంతమాత్రాన యింత అనుమానమా?...యిదేనా మీ సంస్కారం. పెద్ద సంస్కారవంతులేమో!...యింతకీ నేను చేసిందాన్లో మీకేం తప్పు కనిపించింది. అందరితో కలసే సినిమాలకి దానికి వెళ్ళానుగాని, నే నొక్కర్తినీ ఆయనతో వెళ్ళలేదే? అంతమాత్రాన కట్టుకున్న మొగుడిని వదిలి ఆయన్ని ప్రేమించేస్తాననుకున్నారా? మోహించేస్తాననుకున్నారా?... ఛీ...ఛీ...అసలు యింత హీనమైన ఆలోచన మీకెలా వచ్చింది?' ఆవేశంతో దులపసాగింది సుజాత.

'ఏమో, ప్రేమించావో, మోహించావో నాకెలాతెలుస్తుంది!' నిబ్బరంగా చూస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు.

'అవును...యింతోటి నవ మన్మధుడు నాకు లేడని మోహించేస్తాను...'

'ఆ...యిదేమాట మా చెల్లెలి దగ్గర అను, నీ మొగుడు ఏపాటి నవమన్మధుడో తెలుస్తుంది!'...

'ఆ...యింతోటి మొగుడు,...యీపాటి మొగుడు నాకు లేడనా?...ఆవిడ మొగుడి కోసం ఏడవడం నాకేం ఖర్మ!'...అయినా మీ కిలాంటి అనుమానం అసలు ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?...ఆ మాత్రం నామీద నమ్మకం లేకపోయిందా? కట్టుకున్న భార్యని, రెండేళ్ళు కాపురం చేశారు,...నామనసు మీకు తెలీదా?...పిల్లడి తల్లిని. వావి వరుసలుకూడా మరచిపోయారా? ఆయన నాకు అన్నవరస అని తెలుసా? నన్నుగురించి యింత హీనంగా ఎలా ఆలోచించారు? నన్ను యిలా యింత అవమానం చేయడానికి మీ మనసెలా వప్పింది...ఎందు కింతలా మారిపోయారు ఒకనెలలో... సుజాత గొంతు రుద్ధమవసాగింది...కన్నీళ్ళు జారాయి చెంపల వెంబడి.

ఏడుస్తున్న సుజాత వంక ఒక్క క్షణం చూసి...దృఢంగా ఒక్కొక్కమాట వత్తి పలికాడు సుధాకర్. 'మీ వదినకీ... పెళ్ళయి పదేళ్ళయింది!...ముగ్గురు పిల్లలతల్లి!... నాకు చెల్లెలు వరస!...అన్నమాట...మరచి పోయినట్లున్నావు పాపం!'

తెల తెల బోయి చూస్తున్న సుజాతని ఆత్మవిమర్శచేసుకోడానికి అక్కడే వదిలి, చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు సుధాకర్ బయటికి. ●



శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్నలో గీతాంజలి, పద్మనాభం.

చిత్రసమీక్ష:

శ్రీ శ్రీ శ్రీ మర్యాదరామన్న

తెలివైన తీర్పులను సమయోచిత ప్రజ్ఞతో యివ్వటంలో సిద్ధహస్తుడని పేరుపొందిన మర్యాదరామన్న కథలనుగురించి మనలో చాలామందికి తెలుసు. మొట్ట మొదట అవివేకియైన గొర్రెల కాపరిగా జీవితం ప్రారంభించిన రామన్న మూర్తీభవించిన మంచితనంవల్ల ఓ మహర్షి దయకు పాత్రుడై విజ్ఞాని అవుతాడు. తర్వాత తన ఊరిమర్యాదను కాపాడి మర్యాదరామన్నగా పేరు పొందుతాడు. తన చతురతవల్ల ఆ రాజ్యానికే కొన్నాళ్లపాటు రాజై శ్రీ శ్రీ శ్రీ మర్యాదరామన్నగా పేరు తెచ్చుకుంటాడు! రాజ్యాన్ని తమ హస్తగతం చేసుకోవాలన్న ఆశతో దురాగతాలు సాగిస్తున్న సేనాని, మహామంత్రి, కోశాధికారుల ఆటలుకట్టించి రాకుమారిని వివాహమాడి మహారాజవుతాడు.

రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్‌వారు నిర్మించిన ఈ చిత్రంలో పద్మనాభం, గీతాంజలి, రాజనాల, ముక్కామల, ప్రభాకరరెడ్డి, పెరుమాళ్లు, రాజ్‌బాబు, మీనాకుమారి మొదలగువారు నటించారు. రాజశ్రీ, హరనాథ్, కృష్ణ, రామకృష్ణ, శోభన్‌బాబు గెస్టు ఆర్టిస్టులుగా పాల్గొన్నారు. రచన వీటూరి, సంగీతం కోదండపాణి, కళ బి. ఎన్. కృష్ణ, కెమేరా జె. సత్యనారాయణ, దర్శకుడు హేమాంబరధరరావు. నిర్మాత బి. పురుషోత్తం.

చిత్రంలో పద్మనాభం ఉదాత్తమైన నటనను ప్రదర్శించారు. రాకుమారిగా గీతాంజలి చక్కని నటను ప్రదర్శించింది. సేనానిగా రాజనాల ఆ పాత్రకు మెరుగులు దిద్దారు. రాజ్‌బాబు తదితరులు చక్కని హాస్యాన్నందించారు. మిగిలినవారంతా తమ తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు. హాస్యప్రధానమైన ఈ చిత్రంలో స్టంట్ మాయలు, మంత్రాలు కూడా ఉండటంచేత మామూలు ప్రేక్షకునికి కూడ మంచి వినోదాన్ని అందిస్తుంది. శ్రావ్యమైన సంగీతం, చక్కనిబాణీలతో కూడినపాటలు సంగీతప్రియులను ఆకర్షిస్తాయి. దర్శకత్వం ప్రతిభావంతంగా ఉంది.

—మాధవ్

చిత్రసమీక్ష

ది సైలెన్సర్స్

డొనాల్డ్ హామిల్టన్ నవల ఆధారంగా కొలంబియావారు నిర్మించిన ఆంగ్ల చిత్రం ది సైలెన్సర్స్. జేమ్స్‌బాండ్ చిత్రాల్లాంటివి చాలా వచ్చాయి. కాని ది సైలెన్సర్స్ లోని 'మాట్ హెల్మ్' ఒక్కడే ఆ స్థానే నిలబడగల్గుతాడు! జనం సాధారణంగా సినిమాల్లో కోరుకునేవన్నీ ఇందులో వున్నాయి. ఈ చిత్రంలో అమ్మాయిలు, అద్భుతాలు; గూఢచారుల రహస్యాలు మొదలైనవాటిల్లో ప్రత్యేకత, మాట్ హెల్మ్‌గా డీన్‌మార్టిన్ నటన, ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. డాలియలావి, ఆర్థర్ డి. కన్నల్, జేమ్స్ గ్రెగరీ మొదలైనవారు నటించిన రంగుల చిత్రం 'ది సైలెన్సర్స్' ఇప్పుడు మద్రాసులోని 'రాజకుమారి'లో ప్రదర్శిస్తున్నారు.

—సిరరాజు



'దేవునిగెలిచిన మానవుడు'లో నర్తకి రేణు



'పూలరంగడు'లో జమున, నాగేశ్వరరావు.

చిత్రలహరి

◻ 'మా అమ్మాయి భర్తరోజు' అన్నారు ధూళిపాళ. 'వాళ్లమ్మాయి భర్తరోజులు' అంటూ పకపకానవ్వాడు హరనాథ్. 'భర్తరోజు ఏమిటి? బర్త్ డేనా?' అంది సంధ్యారాణి. 'అవును. యిది షాట్‌లో డైలాగు' అన్నాడు హరి. తనూ యీ సారి గలగలా నవ్వింది సంధ్యారాణి. శ్రీ రాధాకృష్ణ ప్రొడక్షన్స్‌వారి మొదటిచిత్రం సెట్స్‌మీదది యీ సందడి. ఈ చిత్రంలో ధూళిపాళ వేషం కొత్త తరహాకు చెందినటువంటిది. తమాషాగా వుంటుంది. ఆయన ధరిస్తున్నది కాంట్రాక్టర్ కాంతయ్య భూమిక. ఈ చిత్రానికి గత నెల 29 న గోల్డెన్ స్టూడియోలో ఉదయం గం. 9—34 కి ప్రారంభం జరిగింది. నిర్మాత, దర్శకుడు, పంపిణీదారుడు అయిన శ్రీ ఎం. ఎస్. నాయక్ ఎం. ఏ., కెమెరా 'స్విచ్ ఆన్' చేశారు. హరనాథ్, చంద్రకళ, శోభన్‌బాబు, సంధ్యారాణి, ధూళిపాళ, సునీత, సబితాదేవి, లలిత, అన్నపూర్ణ, స్వామి ముఖ్యపాత్రలు పోషిస్తున్న యీ సాంఘిక చిత్రానికి మాటలు ఆంజనేయ శాస్త్రి రాశారు. సంగీతం : సత్యం, కెమెరా: శ్రీకాంత్, కళ : వి. వి. రాజేంద్రకుమార్ బి. ఏ., కూర్పు: బాల్. జి. యాదవ్, స్టిల్స్: మోహన్ బ్రదర్స్, నిర్మాత: యల్. రమణారెడ్డి, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: ఎం. నాగేశ్వర రావు.



'స్త్రీ జన్మ'లో కృష్ణకుమారి

* * *

శ్రీ ఎం. నాగేశ్వరరావు తెలుగులో ఒక చిత్రానికి స్వతంత్రంగా దర్శకత్వం వహించటం యిది మొదటిసారి. ఇంతకు ముందు ఆయన మూడు కన్నడచిత్రాలకు దర్శకుడుగా పనిచేశారు. ఆ మూడు చిత్రాలు విజయవంతంతగా నడచినవే. ఉత్సాహవంతుడూ, యువకుడూ అయిన శ్రీ నాగేశ్వరరావుకి చలనచిత్ర పరిశ్రమలో పదేళ్ళ అనుభవం వున్నది. ఈ చిత్రానికి యింకా నామకరణం చేయలేదు. మొదటి షూటింగ్ 'షెడ్యూలులో అయిదు రీళ్ల చిత్రం తయారయింది.

* * *

'రామకృష్ణగారూ, మీరు నించోండి!' అంది గీతాంజలి. 'ఎంతసేపు నేను నించోవడం? నువ్వులాగవు. ఈసారి లాక్కపోతే ఊరుకోను మరి!' అంటూ నించున్నాడు రామకృష్ణ. గీతాంజలి నవ్వింది అందంగా, కొంచెం ఆగి, 'సీమై పొజిషన్ సర్' అంది కెమెరామన్ ఎం. కె. రాజుగారితో. 'కొంచెం యిటు' అన్నారాయన, పొజిషన్ చూస్తూ. 'సరిగ్గా లాగు' అన్నాడు రామకృష్ణ, 'యిలాగా' అంది గీతాంజలి కొరడాను తిప్పుతూ. 'చిన్నప్పుడు చేపను పట్టలా ఎప్పుడూ, గేలంవేసి?' అడిగారు నాగభూషణం. 'అలాగా, అయితే సరే!' అంది షాట్‌కి సిద్ధమవుతూ. అది పెద్ద హాలు. సోఫాలముందు రామకృష్ణ, అతని కెదురుగా నాగభూషణం వున్నారు. రామకృష్ణచేతిలో పిస్తోలువుంది. అది నాగభూషణంవైపుకు గురి పెట్టబడివుంది. గీతాంజలి మేడ బాల్కనీలో వుంది. ఆ బాల్కనీ నుంచి కొరడాతో పిస్తోలును చుట్టింది గీతాంజలి. ఇప్పుడు దీనిని తనదగ్గరకు లాక్కోవాలన్నమాట! అదీ షాట్! 'ఓ. కె. బాగుంది' అన్నారు డైరెక్టర్ కృష్ణ.

విజయవర్ధన్ మూవీస్ వారునిర్మిస్తున్న ఉత్కంఠప్రధానంగా గల చిత్రం 'ఉపాయంలో అపాయం' చిత్రానికి చెందిన యీ దృశ్యాన్ని జూన్ మొదటి తేదీన ప్రసాద్ స్టూడియోస్‌లో తీశారు. త్వరిత

గతిన నిర్మింపబడుతున్న యీ చిత్రం యింతవరకు పదిరీళ్లు పూర్తి అయింది. జూన్ నెలాఖరుకు నిర్మాణం పూర్తి చెయ్యాలని అనుకుంటున్నారు. విజయ నిర్మల, కృష్ణ, గుమ్మడి, రామ్మోహన్, రాజ్ బాబు రమణారెడ్డి, సూర్యకాంతం, రావికొండలరావు, కె. వి. చలం, బేబీ పద్మిని మున్నగువారూ యిందులో నటిస్తున్నారు. సంభాషణలు: సముద్రాల (జూ) సంగీతం: మహాదేవన్, కళ: తోట, సహకారదర్శకుడు: కె. వి. రావు, కూర్పు, దర్శకత్వం: టి. కృష్ణ, నిర్మాతలు: పి. వెంకురెడ్డి. ఏ. రామిరెడ్డి.

* * *

రాజలక్ష్మీ యూనిట్‌లో అపారానుభవం కలిగిన కెమెరామన్ శ్రీ వి. యస్. ఆర్. స్వామి, యిపుడు టైగర్ ప్రొడక్షన్స్‌వారి 'అసాధ్యుడు' చిత్రానికి ఛాయాగ్రాహకునిగా పనిచేస్తున్న సంగతి పాఠకులకి తెలిసినదే! ఈ యువఛాయాగ్రాహకుని వివాహం జూన్ మొదటి తేదీన గుడివాడలోని రాజేంద్రనగర్‌లోగల లక్ష్మీ విలాస్‌లో రాత్రి గం. 8.58 కి వైభవోపేతంగా జరిగింది. వధువు చి. సౌ. నిర్మలాదేవి బి. ఏ. నూతన వధూవరులకు శుభాకాంక్షలు!

సురేష్ కంబైన్స్ వారిసాంఘికానికి మొదట 'స్త్రీ' అని పెట్టినపేరును మార్చి యిపుడు 'స్త్రీ జన్మ' అని ఖాయంచేశారు. పదిరీళ్లు పూర్తి అయిన యీ చిత్రంలో యన్. టి. రామారావు, కృష్ణకుమారి కృష్ణ, విజయలక్ష్మి, పద్మనాభం, గీతాంజలి, రాజ్ బాబు, రమాప్రభ, అంజలీదేవి. నాగయ్య, ప్రభాకరరెడ్డి, ముఖ్యభూమికలు పోషిస్తున్నారు. రచన. సముద్రాల జూనియర్, సంగీతం: ఘంటసాల, కళ: రాజేంద్రకుమార్, కూర్పు: మార్తాండ్, దర్శకుడు: కె. యస్. ప్రకాశరావు, నిర్మాత: డి. రామానాయుడు. విజయా పిక్చర్స్ వారిద్వారా యీచిత్రం ఆంధ్రలో విడుదల అవుతుంది.

* * *

జ్వాలా ద్వీపరహస్యం; ఇద్దరు మొనగాళ్ళు చిత్రాలను అందించిన మధు పిక్చర్స్ సంస్థ యీసారి భారీ యెత్తున సాంఘిక చిత్ర నిర్మాణానికి ఉపక్రమించబోతున్నది. జెమినీవారు తమిళంలో నిర్మించిన 'మోటార్



'దేవుని గెలిచిన మానవుడు'లో వాణిశ్రీ

సుందరంపిళ్లై' యీ చిత్రానికి ఆధారం. నాగేశ్వరరావు, జానకి కలసి మళ్లీ యింతకాలానికి యిందులో జంటగా నటిస్తున్నారు. వీరితోపాటే కృష్ణ, విజయనిర్మల, చలం, అల్లు రామలింగయ్య యింతవరకు ముఖ్యభూమికలు పోషించేందుకు ఎన్నుకోబడినారు. సంభాషణలు: ఆత్రేయ, సంగీతం: కోదండపాణి, కథ: యస్. కృష్ణారావు, కూర్పు: యస్. యస్. ప్రకాశం, దర్శకుడు: వి. మధుసూదనరావు, నిర్మాత: పి. మల్లిఖార్జునరావు. ఈ చిత్రం షూటింగు జూలై మొదటి తేదీనుంచి హైదరాబాద్‌లోని శ్రీ సారథి స్టూడియోలో ఆరంభం అవుతుంది.

* * *

గౌరీ ఆర్ట్ ఫిలింస్‌వారి 'దేవుని గెలిచిన మానవుడు' గోల్డెన్ స్టూడియోలో శీఘ్రగతిన తయారవుతున్నది. ఈ శృంగార హాస్యరస ప్రధానచిత్రంలో వాణిశ్రీ, కాంతారావు, రాజనాల, చలం, గీతాంజలి, విజయలలిత, జయకృష్ణ, మిక్కిలినేని, పి. సాంబశివరావు, మోదుకూరి సత్యం, గణేశ్, రణధీర్, రమేష్, రేణు, నాగిని, కుమారి సచ్చు, ఛాయాదేవి, మాలతి మున్నగువారు నటిస్తున్నారు. రచన: పద్మరాజు, పాటలు: సి నారాయణరెడ్డి, వీటూరి, సంగీతం: రాజన్—నాగేంద్ర, కళ: నరసింహారావు, కెమేరా: చంద్రు, నిర్వహణ: యస్. భావనారాయణ, నిర్మాత: వై. వి. రావ్, దర్శకుడు: హనుమాన్ప్రసాద్ కృష్ణమూర్తి. ఈచిత్రం జూన్ నెలాఖరులో పూర్ణావారి ద్వారా విడుదల కాబోతున్నది.

—మోహన్‌కుమార్



''సాక్షి''లో విజయనిర్మల

మనిషి బుద్ధి

(47-వ పేజీ తరువాయి)

లోకాభిరామాయణం మాట్లాడుతూ శంకరం తప్ప అందరూ నిశ్చింతగా నిద్ర పోయ్యేరు.

మర్నాడు ప్రొద్దున బయల్దేరాడు శంకరం. స్వామ్యమ్మ ఉత్తరాలు రాస్తుండమని చెప్పింది. సుందరి కన్నీళ్లు తెచ్చుకుంది. అతనికి ఏడుపు వచ్చింది. 'ఇదంతా అబద్ధం' అని చెప్పాలనుకునీ చెప్పలేక పోయేడు.

పరంధామయ్యగారు బస్సుదాకా వచ్చేరు.

బస్సు కదులుతుండనగా శంకరం చేతిలో రెండు వందల రూపాయలు పెట్టారాయన. 'ఖర్చుల కుంటుంది, శంకరం తీసుకో. బీదవాణ్ని ఇంతకన్నా ఎక్కువివ్వలేను.' అన్నారు ఆయన. వొద్దనాలనుకునీ అనలేక పోయేడు శంకరం. మౌనంగా తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

'ఉత్తరం రాయటం మర్చిపోకు శంకరం!' అన్నారు పరంధామయ్యగారు, 'సరే మావయ్యా! మీరూనా వెంట వాస్తేనే బాగుండేది! ఓసారి అంతాచూసి వచ్చేవారు!' అన్నాడు శంకరం.

'ఇప్పుడు పనులున్నాయి. మరోసారి ఎప్పుడైనా వాస్తాలే! రాకపోక లెప్పటికేనా తప్పవాయె!' అన్నారు పరంధామయ్యగారు.

బస్సు కదిలింది.—

ఆ రోజు రాత్రి బాలా త్రిపురసుందరికి నిదర రాలేదు. అకస్మాత్తుగా ఎక్కణ్నించో వూడిపడి, వచ్చినంత హఠాత్తుగా మళ్లీ వెళ్లిపోయిన బావనుగురించే ఆలోచిస్తూ వుండిపోయింది. అతను వెళ్లిపోవటంలో తనకింత బాధ ఎందుకు కలుగుతున్నదో అర్థం కాలేదా పిల్లకి. మనసునెంత అదుపులో పెట్టుకుందామన్నా అది శంకరం వేపే పరుగిడుతున్నది. మళ్లీ చాలా రోజులయ్యాక వచ్చి తనను కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి దేశదేశాలూ తిప్పుతాడని కలలు కంటోంది. అతను ముద్దుపెట్టుకున్న అరచేతిని అలానే పెదాలకానించుకుని తెల్లవారే దాకా వెచ్చటి ఊహలతో మంచంమీద అటునించిటూ పొర్లుతూ ఉండిపోయింది.

స్వామ్యమ్మ, పరంధామయ్యగార్లూ, గొప్ప వాడయిన అల్లుడిలో కూతురు సుఖ పడుతుందని, అంతకన్నా మంచివరుణ్ని ఎన్ని జన్మలెత్తినా సంపాదించటం కష్టమనీ, తమ అదృష్టానికి మురిసిపోతూ సంతృప్తిగా నిదర పొయ్యారు.

అదే రాత్రి హైదరాబాదు హోటల్ అన్నపూర్ణలో పప్పురుబ్బుతూ కునికిపాట్లు పడుతున్న శంకరం, మామయ్యిచ్చిన రెండొందలతో చిన్న టీ కొట్టు తెరిచినట్టు, ఏడాది లోపల దాన్ని పెద్దహొటల్‌గా మార్చేసినట్టు, చిన్నకారొకటి కొనుక్కుని, దాన్లో వెళ్లి సుందరిని వెంటబెట్టుకుని ఝామ్మంటూ వచ్చినట్టు కలలు కంటున్నాడు. ●

అవీ - ఇవీ...

మే నెల 18, 19, 20, 21 తారీఖులలో కలకత్తా ఆంధ్ర సంఘంవారు వారి స్వంత హాలులో నాటిక పోటీలు నిర్వహించారు. సంఘాధ్యక్షులు డా. ఐ. వి. కృష్ణమూర్తి 18 వ తారీఖున ప్రారంభోత్సవం చేశారు. శ్రీయుతులు వేదాంతం సుబ్రహ్మణ్యం, యస్. ఎస్. చక్రవర్తి, బులుసు సూర్యనారాయణ గార్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 12 నాటికలు చూపించారు.

పోటీలు జయప్రదంగా ఒరిపించిన మెంబరు— ఇన్— చార్జి శ్రీ పద్మసోల సుబ్బారావు అందరికి ధన్యవాదాలు చెప్పడంతో, జన గణ మనతో పోటీ ఉత్సవాలు ముగిసాయి.

* * *

గుంతకల్లు రయిల్వే ఇన్‌స్టిట్యూట్ కళా సమితివారు 30—4—67 నుంచి 7—5—67 దాకా తమ అష్టమ నాటక, నాటిక పోటీలు జయప్రదంగా జరుపుకున్నారు. 'ఆరాత్రి, ఆరాధన, మంచుతెర, నీడలోనిజం' ప్రదర్శనలకి బహుమతులు వచ్చాయి. కొందరు నటీనటులకి కూడా బహుమతులు వచ్చాయి. (ఐ. వి.) ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



ప్రేమకుమారి